epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

PRGI No: APTEL/26/A6182

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

సోమవారం | 27-07- 2026 | సంపుటి: 01, సంచిక: 02, గుంటూరు. | పేజీలు: 12, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

గొడ్డలి పార్టీ ట్రాప్‌లో పడొద్దు: సీఎం చంద్రబాబు

అమరావతి జూలై 26 (ప్రజా కలం ప్రతినిధి)

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రేపటి నుంచి 45 రోజుల పాటు ఇంటింటి ప్రచార కార్యక్రమం చేపట్టాలని పార్టీ నేతలకు సీఎం చంద్రబాబు సూచించారు. పార్టీ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ప్రజలు కూటమికి చారిత్రాత్మక విజయాన్ని అందించారని గుర్తు చేశారు. 94 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్లతో విజయం సాధించామని, గత ప్రభుత్వ విధానాల కారణంగానే అప్పటి అధికార పార్టీ 151 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితమైందని వ్యాఖ్యానించారు. టీడీపీతో పాటు కూటమి పార్టీల సమిష్టి పోరాటం, ఎన్నికల వ్యూహాల ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందన్నారు. ప్రస్తుతం ప్రజలకు ఉపయోగపడేలా పాలన సాగిస్తున్నామని, ప్రజాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి నాయకుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బూత్ కన్వీనర్లు, పార్టీ కమిటీలు, ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా

పనిచేయాలని, కష్టంతో కాకుండా ఇష్టంతో పని చేస్తూ ప్రజలు, కార్యకర్తలతో ఎప్పుడూ సన్నిహితంగా ఉండాలని సూచించారు.

'అనుచరులు కాదు.. పార్టీకి నాయకులు కావాలి' అని చంద్రబాబు స్పష్టం చేశారు. సమస్యలకు పరిష్కారం చూపే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకునేలా వ్యవహరించాలని నేతలకు సూచించారు. ఎన్నికల సమయంలో హామీలతో ఇంటింటికి వెళ్లినట్లే, ఇప్పుడు కూడా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న హామీలు, సంక్షేమ పథకాల గురించి వివరించాలని చెప్పారు. ప్రజలకు ఏవైనా సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేస్తూ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను స్పష్టంగా తెలియజేయాలని సూచించారు.

మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ శ్రేణులంతా అవుట్‌రీచ్ కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందనే నమ్మకం ఉన్నప్పటికీ, ఏమరుపాటు వద్దని, ప్రజలకు నచ్చని పనులకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. యువత సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, 'గొడ్డలి పార్టీ' విధానాల వల్ల యువత ఎలా నష్టపోయిందనే అంశాలను కూడా వివరించాలని సూచించారు.

కేవలం డబ్బుతో ప్రజల ఆదరణ పొందలేమని, ప్రజల మధ్య నిరంతరం ఉంటూ ప్రత్యర్థి పార్టీ విధానాలను ఎండగట్టాలని అన్నారు. గొడ్డలి పార్టీ ఇప్పటికీ సమాజంలో విభేదాలు సృష్టించే ప్రయత్నం చేస్తోందని విమర్శించిన చంద్రబాబు, ప్రజలతో నిరంతరం మమేకమైతే అలాంటి కుట్రలను సమర్థంగా తిప్పికొట్టవచ్చని పేర్కొన్నారు. అగ్రస్థాయి నాయకుల నుంచి క్షేత్రస్థాయి కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ ప్రజల్లో ఉండటాన్ని బాధ్యతగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

కేంద్ర విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ప్రహ్లాద్ జోషి

న్యూఢిల్లీ: కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఆదివారం కేంద్ర విద్యాశాఖ మంత్రిగా నూతనంగా నియమితులైన అదనపు బాధ్యతలు చేపట్టారు. కేంద్ర మంత్రిమండలి నుంచి ధర్మేంద్ర ప్రధాన్ సమర్పించిన రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించిన తర్వాత, శనివారం కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ బాధ్యతలు అప్పగించారు. "ప్రధాన మంత్రి సూచన మేరకు, క్యాబినెట్ మంత్రి ప్రహ్లాద్ జోషికి ఆయన ప్రస్తుతం నిర్వహిస్తున్న బాధ్యతలతో పాటు విద్యా శాఖ బాధ్యతలను కూడా అప్పగించాలని రాష్ట్రపతి ఆదేశించారని రాష్ట్రపతి భవన్ అధికారిక ప్రకటన పేర్కొంది. కర్ణాటకలోని ధార్వాడ్ నియోజకవర్గం నుండి లోక్‌సభకు ఎన్నికైన కేంద్ర మంత్రి జోషి, ప్రస్తుతం వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ, అలాగే నూతన పునరుత్పాదక ఇంధన శాఖల బాధ్యతలను నిర్వహిస్తున్నారు. గత పదవీకాలంలో ఆయన బొగ్గు, గనులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రిగా పనిచేశారు. విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా, అలాగే పరీక్షలలో అవకతవకలకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలను 'దేశ వ్యతిరేక శక్తులు' దుర్వినియోగం చేయకుండా ఉండేలా చూసేందుకు తాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాజీనామా సమర్పించినట్లు ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు. పోటీ పరీక్షలలో జరిగిన అవకతవకలపై దేశవ్యాప్తంగా వారాలుగా జరుగుతున్న నిరసనల నేపథ్యంలో ఈ రాజీనామా జరిగింది. విద్యార్థులు పరీక్షా విధానంలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం, సంస్కరణలు కావాలని డిమాండ్ చేస్తున్నారు.

కలం కౌంటర్

షర్మిలకు విజయవంతంగా శస్త్ర చికిత్స

త్వరగా కోలుకోవాలని సీఎం చంద్రబాబు ట్వీట్

అమరావతి జూలై 26 (ప్రజా కలం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు శనివారం హైదరాబాద్ కాంటినెంటల్ ఆసుపత్రిలో చేసిన శస్త్ర చికిత్స విజయవంతమైంది. ఇటీవల కొద్దిరోజులు తీవ్ర కడుపునొప్పితో బాధపడిన ఆమె ఉదయం ఆస్పత్రిలో చేరగా వైద్యులు వెంటనే పరీక్షలు జరిపి.. శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడ ఉందని ధ్రువీకరిస్తూ ఏపీసీసీ అధికారిక ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేసింది. కాగా, ఈ విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు.. షర్మిల త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. షర్మిల సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ కూడా షర్మిల త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

యువతకు హామీలిచ్చి మోసం చేసిన చరిత్ర మీది

హైదరాబాద్, జూలై 26 (ప్రజా కలం ప్రతినిధి)

విద్యార్థుల విజయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటు అని తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఎద్దేవా చేశారు. యువతకు ఇచ్చిన హామీలపై ఎక్కడ నిలదీస్తారోనని మీరే ఊరేగింపులు చేస్తారా? అని ప్రశ్నించారు. తెలంగాణ యువతకు ఎన్నో హామీలు ఇచ్చి మోసం చేసిన చరిత్ర మీది అని, ఇకనైనా ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే తెలంగాణ యువత మిమ్మల్ని గద్దె దించటం ఖాయమని కవిత హెచ్చరించారు.

36 రోజుల పాటు ఉద్యమం చేసి కేంద్రం

దిగి వచ్చేలా విద్యార్థులు పోరాటం చేశారని, తప్పనిసరి పరిస్థితుల్లో కేంద్రమంత్రి రాజీనామా చేయాల్సిన స్థితి తెచ్చారు. వెయ్యి శాతం ఇది విద్యార్థులు సాధించిన ఘన విజయం అని కవిత గుర్తు చేశారు. ఈ విజయాన్ని తమ ఖాతాలో వేసుకోవటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నించటం సిగ్గుచేటు అని, కాంగ్రెస్ ఫెయిల్యూర్స్ ను విద్యార్థులు ఎక్కడ నిలదీస్తారోనని, విద్యార్థుల ఘనతను తాము సాధించినట్లు నాలుగు గంటల పాటు నగర వీధుల్లో ముఖ్యమంత్రి సహా కాంగ్రెస్ నాయకులు ముందుగానే కొవ్వొత్తుల ర్యాలీ ఊరేగింపు చేశారని ఆరోపించారు. విద్యార్థులు, యూత్ ను పట్టించుకోని ముఖ్యమంత్రి 21 ఏళ్లుకే యువత పార్లమెంట్ లో ఉండేలా బిల్లు తెస్తామని చెబుతున్నారని వ్యంగ్యంగా మాట్లాడారు.

నియంతృత్వ పోకడలతో ఏదీ సాధించలేం : అన్నా హజారే



మహారాష్ట్ర, జులై 26: సమస్యలు ఏవైనా సరే హింస ద్వారా కాకుండా శాంతియుతమైన చర్చల ద్వారానే పరిష్కారమవుతాయని ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే స్పష్టం చేశారు. మహారాష్ట్రలోని అహిల్యానగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పరిణామాలపై, విద్యార్థుల నిరసనలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వాలకు, నాయకుల మొదటి ధ్యేయం కావాలని ఆయన అన్నారు. ఉద్రిక్తతలు సృష్టించడం.. నియంతృత్వ ధోరణితో ఏమీ సాధించలేమని అన్నా హజారే తెలిపారు. ఇప్పటి వరకు తాను 22సార్లు నిరాహార దీక్ష చేశానని.. ఎన్నడూ హింసను ఆశ్రయించలేదని వెల్లడించారు. శాంతియుత ఆందోళనలే (గ్రుఘఎవటబశ్రీతీశేవర్ం) శాసనపరమైన మార్పులు తీసుకురావడానికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. తాను చేపట్టిన శాంతియుత నిరసనల కారణంగా.. 10 చట్టాలు అమల్లోకి వచ్చినట్లు తెలిపారు.

ప్రభుత్వాలు, నేతలు పౌరుల మాట వినాలని.. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని హజారే సూచించారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం రెండు అడుగులు ముందుకు వేయాల్సి వచ్చినా.. అది తప్పేమి కాదని పేర్కొన్నారు. మన నిర్ణయాలు ప్రజాప్రయోజనాలకు అనుగుణంగా ఉండటమే ముఖ్యమన్నారు. మంత్రుల రాజీనామా వంటి డిమాండ్లను సైతం శాంతియుత పద్ధతిలో సాధించుకోవాలని ఆయన సూచించారు. హింసాత్మక నిరసనల కంటే శాంతియుత పద్ధతిలో చేపట్టే నిరసనలు, చర్చలే ప్రజల్లో, పాలనలో మార్పు తీసుకువస్తాయన్నారు. ఎంతటి పరిస్థితులు ఎదురైనా హింసను మాత్రం ఆశ్రయించొద్దని ప్రజలకు, యువతకు, ప్రభుత్వానికి అన్నా హజారే సూచించారు.

150 ఏళ్ల నాటి కరువు పరిస్థితి

తక్కువ నీటితో సాగయ్యే పంటలే మేలు: మంత్రి తుమ్మల

హైదరాబాద్, జూలై 26 (ప్రజా కలం ప్రతినిధి)

ప్రపంచంపై ప్రకృతి చాలా తీవ్రంగా దాడి చేసిందని, 150 సంవత్సరాల్లో లేని కరువు పరిస్థితి కనిపిస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామంలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడంతో మనదేశానికి వచ్చే నైరుతి రుతుపవనాల జాడ లేకుండా పోయిందని, దీంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు. దీంతో రానున్న మార్చి, ఏప్రిల్ నెలల దాకా దుర్భిక్ష ప్రభావం ఉండవచ్చునన్నారు. తెలంగాణలో సరైన వర్షాలు కురవవని ఐఎండీ, ప్రపంచ వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారని తెలిపారు. వచ్చే నెలలో అంతంత మాత్రంగా కురిసే వర్షాలు మెట్ట పంటలకు ఉపయోగపడవచ్చునన్నారు. వరి సాగుకు చాలా కష్టతరంగా ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో తక్కువ కాలంలో తక్కువ సాగునీటితో చేతికొచ్చే పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు వంటి పంటలను సాగుచేసుకోవాలని రైతులకు ఆయన సూచించారు. కాగా, రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలను మరింత సమర్థంగా, పారదర్శకంగా తీర్చిదిద్ది రైతులకు నాణ్యమైన్ సవలు అందించాలని అధికారులను ఆదేశిం చారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు చేపట్టాలని ఒక ప్రకటలో సూచించారు. మార్కెట్ కమిటీల పనితీరును సమగ్రంగా పరిశీలించేందుకు ఆరు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందాలు వారం రోజులపాటు తనిఖీ చేస్తాయని పేర్కొన్నారు.

27 నుంచి రైతు వేదికల్లో విత్తన మేళా

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 29 వరకు రైతు వేదికల్లో విత్తన మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో సాగుకు అనువైన ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు రైతు వేదికలో 4 నుంచి 5 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుచేసి, నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు.

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో సైబర్ మోసాలు

హైదరాబాద్, జూలై 26 (ప్రజా కలం ప్రతినిధి)

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో సైబర్ మోసాలు జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదివారం పేర్కొన్నారు. రూ.10 వేలు ఈఎండీ చెల్లింపుల పేరుతో నకిలీ కాల్స్ ద్వారా మోసాలకు పాల్పడుతున్నారని, డబ్బులు చెల్లిస్తే ఇళ్లు ఇప్పిస్తామంటూ చెప్పేవాళ్ల మాటలు నమ్మొద్దు అని సజ్జనార్ తెలిపారు.

చివరి తేదీ అంటూ భయపెట్టి డబ్బులు కాజేసేస్తున్నారని, నేరరహిత, సురక్షితమైన హైదరాబాద్ కోసం ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు. అవకాశం దొరకకపోతే నేరస్తులు ప్రవేశించలేరని, తరుచుగా వ్యక్తుల నిర్లక్ష్యమే నేరాలకు ఆస్కారం కల్పిస్తుంది. ఇంటి పని కోసం సహాయకులను నియమించుకునే ముందు వారి వివరాలను నరిగ్గా సరిచూసుకోవడం, నేపథ్య తనిఖీలు చేయడం తప్పనిసరి అని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే, ఏదైనా అనుమానాస్పద కదలికలు, ఇంటి తాళాలు పోవడం లేదా ఇంటి పనివారు అకస్మాత్తుగా కనిపించకుండా పోవడం వంటివి జరిగితే, వెంటనే 'డయల్ 100'కు కాల్ చేయడం, హైదరాబాద్ సిటీ పోలీస్ వాట్సాప్ హెల్ప్‌లైన్ నంబర్ 94906 16555కు సమాచారం అందించాలని ఆయన ప్రజలకు సూచించారు.

కులాలు లేకుండా రాజకీయం సాధ్యమేనా?

విజయవాడ : జనసేన అధినేత పవన్ కల్యాణ్ లక్ష్యం ఆంధ్రప్రదేశ్ లో నెరవేరుతుందా? అన్నది ఇప్పుడు సందేహంగా మారింది. కులాల ప్రస్తావన చేయకుండానే రాజకీయాలు చేస్తానని పవన్ కల్యాణ్ చెప్పడం ఆచరణలో సాధ్యమేనా? అన్న చర్చ జరుగుతుంది. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ అంటే కులాలతో ముడిపడి ఉన్న రాజకీయం. గత కొన్ని దశాబ్దాలుగా కులాల మధ్యనే రాజకీయం నడుస్తుంది. ఇప్పుడు పవన్ కల్యాణ్ కుల జాడ్యాన్ని కూకటి వేళ్లతో పీకివేయాలని ప్రయత్నించడం సాహసోపేతమైన చర్యగానే చూడాలి. ఆంధ్రప్రదేశ్ లో ఏ రాజకీయ పార్టీ అయినా కులం పునాదుల మీద నడవాల్సిందే. కొన్ని ఏళ్లుగా అన్ని పార్టీలూ అదే కోవలో నడుస్తున్నాయి కానీ ఇటీవల పవన్ కల్యాణ్ తాను కులం ప్రస్తావన లేకుండానే రాజకీయాలు చేస్తానని చెప్పడం ఒకింత ఆశ్చర్యకరమే. కులాలు పేరు చెప్పి తాను ఓట్లు అడగనని కూడా పవన్ కల్యాణ్ అనడం వచ్చే ఎన్నికల ప్రచారం వరకూ ఆగాల్సిందే. ఎందుకంటే గత ఎన్నికల్లోనూ పవన్ కల్యాణ్ కులం ప్రస్తావన తెస్తూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ట్రోల్ చేస్తున్నారు. కానీ వచ్చే ఎన్నికల్లోనూ కాపు సామాజికవర్గం అండ పవన్ కల్యాణ్ కు అసవరం ఉంటుంది. అప్పుడు ఏం చేస్తారన్నది జనసైనికుల్లోనూ చర్చ మొదలయింది. అయితే పవన్ కల్యాణ్ కు సినిమాల పరంగా కులాలకు, మతాలకు అతీతంగా అభిమానులు ఉన్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ రాజకీయాలకు వచ్చే సరికి వేరుగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ లో 27 శాతం ఓటు బ్యాంకున్న కాపు సామాజికవర్గాన్ని తెలివైన ఏ రాజకీయ నాయకుడు దూరం చేసుకోరు. పవన్ కల్యాణ్ కూడా అదే విశ్వాసంతో ఉన్నట్లు కనిపిస్తుంది. ఎన్నికల సమయానికి తనను వదిలి వెళ్లరన్న ధీమాలో ఆయన ఉన్నారు. కేవలం కాపు సామాజికవర్గం ఓట్లతోనే ఎవరూ గెలవలేరన్న పవన్ కల్యాణ్ మాటల్లోనూ నిజం లేకపోలేదు. అందుకే ముందుగా మిగిలిన సామాజికవర్గ ఓటర్లను దగ్గరకు తీసుకోవడం ప్రథమ లక్ష్యంగా పవన్ కల్యాణ్ పెట్టుకున్నట్లు కనపడుతుంది. చివరకు కాపులు తనను వీడి పోరన్న నమ్మకమే పవన్ ను నోట ఆ మాట పలకిస్తుందంటున్నారు. మరి ఎన్నికల నాటికి పవన్ మాట తీరు ఎలా మారుతుందన్నది చూడాలి.

నాయకత్వ లక్షణాలపై 3 రకాల అప్లికేషన్లు...మీరు జనసేన కార్యకర్తా.. నేతగా ఎదగాలనుకుంటున్నారా? ఇంకెందుకు ఆలస్యం. అప్లికేషన్ సమర్పించండి అంటోంది ఆ పార్టీ అధిష్టానం. పైస్థాయిలో ఉండే లీడర్లు.. కిందిస్థాయి నేతలను నియమించడం, అన్ని పార్టీల్లో ఆనవాయితీగా వస్తోంది. అయితే జనసేన కార్యకర్తల నుంచే నేతలు పుట్టుకురావాలనే ఆలోచనకు, ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్.. ఓ ఆకారం ఇచ్చారు. దీంతో కార్యకర్తలను మాత్రమే కాదు.. పార్టీ కోసం నాయకులను తయారుచేసే ఫ్యాక్టరీగా జనసేన మారుతోంది. దీనిలో భాగంగా క్షేత్రస్థాయిలో అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అసెంబ్లీ, పార్లమెంట్, మండల, గ్రామస్థాయిలో నేతలుగా ఎదగాలనే ఆసక్తి, రాజకీయ శక్తి ఉన్న జనసైనికులు, వీర మహిళలను ప్రోత్సహిస్తోంది.అభ్యర్థుల నుంచి ఐదు రోజుల పాటు అప్లికేషన్లు తీసుకుంటారు. దీనికోసం క్షేత్రస్థాయిలో 32మందితో పరిశీలన కమిటీ ఏర్పాటుచేశారు. అప్లికేషన్ తీసుకున్నాక, కార్యకర్తలు ఏ ఉద్దేశంతో వస్తున్నారు.. ఎలా పనిచేస్తారు.. వాళ్ల నాయకత్వ లక్షణాలపై స్క్రూటినీ చేస్తారు. దీనికోసం మంగళగిరి జనసేన ప్రధాన కార్యాలయంలో మూడు రకాల డెస్కులు ఏర్పాటుచేశారు. అక్కడ మూడు రకాల అప్లికేషన్లు ఇస్తారు. ఎవరు ఏ కేటగిరీ కింద అప్లయ్ చేయాలనుకుంటే, ఆ అప్లికేషన్ తీసుకోవచ్చు.పార్లమెంట్ స్థాయి నాయకులు, అసెంబ్లీ స్థాయి నాయకులు, మండల, గ్రామస్థాయి?ఇలా రకరకాల స్థాయిల్లో నాయకులను నియమించుకునేందుకు, పార్టీ శ్రేణుల్లో ఆసక్తి ఉన్నవారి నుంచి అప్లికేషన్లు స్వీకరిస్తామన్నారు మంత్రి కందుల దుర్గేష్.క్షేత్రస్థాయిలో నాయకులను నియమించడంలో, పవన్ కల్యాణ్ నిర్ణయమే ఫైనల్ అని మంత్రి తేల్చిచెప్పారు. కార్యకర్తలే నేతలుగా ఎదిగితే?క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం అవుతుందనే ఆలోచనతో జనసేన ఈ కార్యాచరణ చేపట్టింది.

జగన్ పాదయాత్రపై తర్జనభర్జనలు

కడప : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పాదయాత్రలకు ఎప్పుడూ ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. ప్రజలతో నేరుగా కలిసే అవకాశాన్ని కల్పించే ఈ విధానాన్ని గతంలో పలువురు నాయకులు విజయవంతంగా ఉపయోగించారు. ఇప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి పాదయాత్ర చేపట్టే అవకాశంపై రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది. అధికారాన్ని కోల్పోయిన తర్వాత పార్టీని మళ్లీ ప్రజలకు మరింత దగ్గర చేయాలనే ఆలోచనలో వైసీపీ ఉన్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.గత ఎన్నికల ఫలితాల అనంతరం పార్టీ శ్రేణులను మరింత చురుకుగా మార్చాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వైసీపీలో వ్యక్తమవుతున్నట్లు సమాచారం. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం, పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నింపడం, భవిష్యత్ ఎన్నికలకు బలమైన పునాది వేయడం వంటి లక్ష్యాలతో పాదయాత్రను ఒక రాజకీయ సాధనంగా పరిశీలిస్తున్నారనే ప్రచారం కొనసాగుతోంది.జగన్ గతంలో నిర్వహించిన ప్రజా సంకల్ప యాత్ర రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపు తీసుకొచ్చిందని పార్టీ నాయకులు తరచూ గుర్తుచేస్తుంటారు. ఆ యాత్ర ద్వారా ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు పెంచుకోవడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పార్టీకి బలమైన మద్దతు లభించిందని వారు భావిస్తున్నారు. అదే అనుభవాన్ని మరోసారి ఉపయోగించుకోవచ్చా అనే అంశంపై అంతర్గతంగా చర్చ జరుగుతోందని రాజకీయ వర్గాలు అంటున్నాయి.ఇటీవల వివిధ జిల్లాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహిస్తున్న సమావేశాల్లో కూడా సంస్థాగత బలోపేతంపై ఎక్కువగా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ప్రతి నియోజకవర్గంలో పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడం, స్థానిక సమస్యలపై స్పందించడం, ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం.అయితే పాదయాత్రపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు. పార్టీ నాయకత్వం నుంచి స్పష్టమైన నిర్ణయం వచ్చే వరకు ఇవన్నీ రాజకీయ చర్చలుగానే పరిగణించాల్సి ఉంటుంది. అయినప్పటికీ, అలాంటి కార్యక్రమం జరిగితే రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వాతావరణం మరింత వేడెక్కే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.మరోవైపు అధికార కూటమి కూడా ప్రజల్లో తమ కార్యక్రమాలను మరింత విస్తృతంగా తీసుకెళ్తోంది. ఈ నేపథ్యంలో ప్రతిపక్షంగా వైసీపీ కూడా ప్రజల మధ్య తన ఉనికిని బలంగా చాటుకోవడానికి కొత్త వ్యూహాలు అమలు చేయాల్సిన పరిస్థితి ఉందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. పాదయాత్ర వంటి కార్యక్రమాలు పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని పెంచడమే కాకుండా ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమయ్యే అవకాశాన్ని కూడా కల్పిస్తాయని వారు అభిప్రాయపడుతున్నారు.రానున్న ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటికే తమ కార్యాచరణను ప్రారంభించాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడం, స్థానిక సమస్యలను గుర్తించడం, పార్టీ బలాన్ని పెంచడం వంటి లక్ష్యాలతో అన్ని పార్టీలు ముందుకు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో జగన్ భవిష్యత్ రాజకీయ కార్యాచరణ ఎలా ఉండబోతుందనే అంశంపై ఆసక్తి నెలకొంది. పాదయాత్రకు సంబంధించి అధికారిక ప్రకటన వస్తుందా లేదా అన్నది రానున్న రోజుల్లో తేలే అవకాశం ఉంది.

స్థానిక సంస్థల ఎన్నికలపై మీనమేషాలు

విజయవాడ : ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికల జైత్రయాత్ర తర్వాత అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి రాజకీయంగా ప్రస్తుతం ఎలాంటి అడ్డంకులు లేవు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో కూటమికి అనుకూల గాలి స్పష్టంగా వీస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని మెజారిటీ పంచాయతీలు, జడ్పీటీసీ, ఎంపీటీసీలతో పాటు మున్సిపల్ సంస్థల పదవీ కాలం ముగిసిపోయి, స్థానిక సంస్థలన్నీ ప్రత్యేకాధికారుల పాలనలోకి వెళ్లాయి. సాధారణంగా ఇలాంటి క్లీన్ పొలిటికల్ అట్మాస్పియర్ ఉన్నప్పుడు ఏ అధికార పార్టీ అయినా తక్షణమే స్థానిక ఎన్నికలు జరిపి కింది స్థాయి వరకు అధికారాన్ని హస్తగతం చేసుకోవాలని చూస్తుంది. కానీ, ఏపీలో మాత్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ విషయంలో వ్యూహాత్మక మౌనాన్ని ప్రదర్శిస్తున్నారు. ఎప్పుడు అంతర్గత సమీక్షలు జరిగినా మరో రెండు, మూడు నెలల్లో స్థానిక ఎన్నికలు అని చెబుతారు కానీ.. అడుగు ముందుకు పడటం లేదు. వేసవి సెలవుల కాలంలోనే పంచాయతీ, పురపాలక ఎన్నికలను పూర్తి చేసి ఉంటే అడ్మినిస్ట్రేటివ్ పరంగా ఎంతో అనుకూలంగా ఉండేది. అయినప్పటికీ ప్రభుత్వం ముందడుగు వేయకపోవడం వెనుక ప్రధాన కారణం వైసీపీ లోకల్ క్యాడర్ ను మరింత అలసిపోయేలా చేయడమేనని అనుకుంటున్నారు. మరికొన్నాళ్ల పాటు ప్రత్యేకాధికారుల పాలన కొనసాగిస్తూ, గత ప్రభుత్వ అవినీతిపై విచారణలు జరిపి, లీగల్‌గా వారిని కట్టడి చేయడం ద్వారా.. వైసీపీకి కనీసం పోటీ చేసే ఓపిక లేకుండా చేసే ప్లాన్ ఉందన్న అభిప్రాయం వినిపిస్?తంది. మరోవైపు, స్థానిక ఎన్నికల జాప్యం వెనుక కూటమి అంతర్గత సమీకరణాల లెక్కలు కూడా ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ సీట్ల పంపకం పైస్థాయిలో సజావుగా సాగిపోయింది కానీ, గ్రామ స్థాయికి వచ్చేసరికి టీడీపీ, జనసేన శ్రేణుల మధ్య టికెట్ల కోసం తీవ్ర పోటీ నెలకొంది. ప్రతి ఊరిలోనూ ప్రెసిడెంట్ సీటు కోసం, ప్రతి డివిజన్‌లోనూ కార్పొరేటర్ సీటు కోసం ఇరు పార్టీల స్థానిక నేతలు పట్టుబడుతున్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఈ ఎన్నికలు పెడితే తమ్ముళ్ల మధ్య కొత్త పంచాయతీలు మొదలై కూటమి సఖ్యత దెబ్బతినే ప్రమాదం ఉంది. అందుకే, నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను ముగించి, కీలక నేతలకు వివిధ కార్పొరేషన్లలో సర్దుబాటు చేసిన తర్వాత.. నియోజకవర్గాల వారీగా పూర్తి సమన్వయం కుదిరినప్పుడే స్థానిక సంస్థల బరిలోకి దిగాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, చంద్రబాబు ఒక అండర్‌స్టాండింగ్‌కు వచ్చినట్లు సమాచారం.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సూపర్ సిక్స్ హామీల అమలు కూడా ఈ నిర్ణయాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ప్రస్తుతానికి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు, అమరావతి, పోలవరం ప్రాజెక్టుల పునరుద్ధరణపైనే పూర్తి నిధులు, శ్రద్ధ పెడుతోంది. స్థానిక ఎన్నికలు వస్తే ప్రభుత్వ యంత్రాంగం అంతా మళ్లీ కోడ్ పరిధిలోకి వెళ్లిపోతుంది, పరిపాలన స్తంభిస్తుంది. అలా కాకుండా, మొదట ప్రభుత్వ గ్యారంటీల అమలు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, ప్రజల్లో పూర్తి స్థాయి నమ్మకం సంపాదించిన తర్వాత.. ఆ ఊపులోనే స్థానిక ఎన్నికలను ఏకపక్షంగా స్వీప్ చేయాలనేది చంద్రబాబు అసలు వ్యూహం చంద్రబాబు నాయుడు ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, శత్రువు పూర్తిగా బలహీనపడే వరకు, తన కూటమి శ్రేణులు పూర్తి సమన్వయానికి వచ్చే వరకు ఓపికగా వేచి చూస్తున్నారు. బడ్జెట్ ఆమోదం, నామినేటెడ్ పదవుల ప్రక్రియ ముగిసిన తర్వాత.. బహుశా ఈ ఏడాది ఆఖర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలోనే స్థానిక సమరానికి శంఖారావం పూరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతవరకు ప్రత్యేకాధికారుల ద్వారానే గ్రామాలు, నగరాల్లో కూటమి మార్క్ పాలనను జనానికి రుచి చూపించాలనేదే ప్రభుత్వ ప్రస్తుత రోడ్ మ్యాప్ అనుకోవచ్చు.

భారీగా తగ్గిన పోర్టుల పరిధి

నెల్లూరు : ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న రామాయపట్నం, మచిలీపట్నం ఓడరేవుల నోటిఫైడ్ పరిధిని ప్రభుత్వం భారీగా తగ్గించింది. గత ప్రభుత్వం ఈ పోర్టుల పరిధిని అత్యధిక కిలోమీటర్ల మేర విస్తరిస్తూ ఇచ్చిన నోటిఫికేషన్లను సవరిస్తూ కూటమి ప్రభుత్వం తాజా ఉత్తర్వులు ఇచ్చింది. కొత్త నిబంధనల ప్రకారం రెండు పోర్టుల పరిధిని చెరి 15 కిలోమీటర్లకు పరిమితం చేశారు. గతంలో రామాయపట్నం నాన్-మేజర్ పోర్టు పరిధిని సముద్ర తీరం వెంబడి ఏకంగా 51 కిలోమీటర్ల మేర విస్తరిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు.అయితే ఇంత పెద్ద పరిధి అవసరం లేదని భావించిన ప్రస్తుత ప్రభుత్వం, దానిని కేవలం 15 కిలోమీటర్లకు కుదిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇదే విధంగా కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం పోర్టు పరిధిని కూడా గతంలో సముద్ర తీరం వెంబడి 64 కిలోమీటర్ల మేర నోటిఫై చేశారు. తాజా ఉత్తర్వుల ప్రకారం ఈ విస్తీర్ణాన్ని కూడా భారీగా తగ్గించి, కేవలం 15 కిలోమీటర్లకే పరిమితం చేశారు. పరిధి తగ్గించడానికి గల ప్రధాన కారణాలు ఒకసారి చూస్తే.. పోర్టుల పరిధి 50 నుండి 64 కిలోమీటర్ల మేర ఉండటం వల్ల ఆయా తీర ప్రాంతాల్లో స్థానిక మత్స్యకారులు వేటాడటానికి, బోట్లు నిలుపుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.వారి జీవనోపాధి దెబ్బతినకుండా ఉండేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పోర్టుల పరిధి ఎక్కువగా ఉంటే ఆ పరిధిలో కొత్తగా ఫిషింగ్ హార్బర్లు, జెట్టీల నిర్మాణానికి సాంకేతిక, చట్టపరమైన ఇబ్బందులు వస్తాయి. ఇప్పుడు పరిధి తగ్గించడం వల్ల తీరప్రాంతంలో ఇతర అభివృద్ధి పనులకు మార్గం సుగమమైంది. ఓడరేవుల నిర్వహణ, భద్రత మరియు పరిపాలన కేవలం పోర్టు అవసరాలకే పరిమితం కావడం వల్ల పర్యవేక్షణ మరింత సులభతరం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల పోర్టుల నిర్మాణానికి ఎలాంటి ఆటంకం కలగదని, అదే సమయంలో స్థానిక మత్స్యకార గ్రామాలకు పెద్ద ఊరట లభిస్తుందని తీరప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాజధాని పనులు...ఎవరి ట్రాప్ లో ఎవరు?

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో రాజధాని అమరావతి చాప్టర్ ఎప్పుడూ అత్యంత సున్నితమైన, ఉద్వేగభరితమైన అంశం. సార్వత్రిక ఎన్నికల్లో చారిత్రాత్మక పరాజయం తర్వాత కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు, చేస్తున్న పర్యటనలు ఆ పార్టీకి మేలు చేయడం పక్కన పెడితే.. ప్రజల్లోకి తీవ్రమైన చర్చకు కారణం అవుతున్నాయి. తాజాగా అమరావతి పరిధిలో వైసీపీ నేతలు చేపట్టిన పర్యటన తీవ్ర ఉద్రిక్తతలకు దారితీయడం, దానిని అడ్డం పెట్టుకుని అధికార తెలుగుదేశం పార్టీ కూటమి తీవ్రస్థాయిలో ఎదురుదాడికి దిగడం ఏపీ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రాజధాని విషయంలో వైసీపీ ఏం చేసినా అది ఆ పార్టీకే సెల్ఫ్ గోల్ లా మారుతోందన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో వ్యక్తమవుతోంది. అమరావతి రాజధానికి భూములు ఇవ్వడానికి ఇష్టపడని అతికొద్ది మంది వ్యక్తులను, తమ పార్టీ సానుభూతిపరులను తెరపైకి తెచ్చి వైసీపీ సరికొత్త రాజకీయ నాటకానికి తెరలేపిందని టీడీపీ ఆరోపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతిలో పనులు శరవేగంగా పుంజుకుంటున్న తరుణంలో.. ఎలాగైనా ఈ పనులను అడ్డుకోవాలని, ఇక్కడ మళ్లీ వివాదాలు రాజేయాలనే కుట్రతోనే వైసీపీ నేతలు ఈ పర్యటనలు పెట్టుకున్నారని టీడీపీ నేతలు అంటున్నామని. తాము అధికారంలో ఉంటే మావిగన్ అంటామని, విపక్షంలో ఉంటే మళ్లీ అమరావతి ఆపేస్తామని మాట్లాడే నేతలు ఇక్కడికి వస్తే.. సహజంగానే రైతులు, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని కూటమి శ్రేణులు వాదిస్తున్నాయి.వైసీపీ నేతల పర్యటనలో స్థానిక రైతులు కాకుండా.. గతంలో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై భౌతిక దాడులకు పాల్పడిన నిందితులు, పలువురు పేరుమోసిన రౌడీషీటర్లు ఉండటం ఆ పార్టీని మరింతగా డిఫెన్స్‌లో పడేసింది. శాంతిభద్రతల సమస్యను సృష్టించడానికే రౌడీ మూకలతో రాజధాని గ్రామాల్లోకి వచ్చారనే విమర్శలకు వైసీపీ బలమైన కౌంటర్ ఇచ్చుకోలేకపోయింది. ఈ మొత్తం ఎపిసోడ్‌లో వైసీపీ వ్యూహాత్మకంగా తీవ్రమైన పొరపాటు చేసింది. నిజంగానే అమరావతి పరిధిలో భూ నష్టపరిహారం లేదా ల్యాండ్ పూలింగ్ విషయంలో ఎవరికైనా అన్యాయం జరిగి ఉంటే, వారు న్యాయపోరాటం చేసుకోవడానికి లీగల్ సెల్ ద్వారా సహాయం చేయడం పూర్తిగా వేరు.కానీ, అలా కాకుండా వందలాది మంది అనుచరులతో, వివాదాస్పద వ్యక్తులతో రాజధాని ప్రాంతంలోకి ప్రవేశించి ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించడం ద్వారా.. రాజధాని అభివృద్ధికి తాము పూర్తిగా వ్యతిరేకమనే పాత ముద్రను వైసీపీ స్వయంగా మరింత బలోపేతం చేసుకున్నట్లయింది. ఇది చంద్రబాబు ప్రభుత్వానికి రాజకీయంగా ఒక అయాచిత అస్త్రాన్ని అందించింది. టీడీపీకి విమర్శలు గుప్పించడానికి మంచి అవకాశం దొరికింది. ఐదేళ్ల పాటు అమరావతిని శ్మశానం అని, 'భూ కుంభకోణం' అని అవహేళన చేసిన వైసీపీ.. ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని ఇక్కడ తిరుగుతోందని మంత్రులు లోకేష్, నారాయణలు నిలదీస్తున్నారు. తాము అమరావతిని గ్లోబల్ సిటీగా మారుస్తుంటే.. వైసీపీ మళ్లీ విధ్వంసానికి ప్లాన్ చేస్తోందని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో టీడీపీ విజయవంతమైంది. దీనివల్ల అమరావతి సెంటిమెంట్ ఉన్న కృష్ణా, గుంటూరు జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీపై మరింత వ్యతిరేకత పెరుగుతుందని టీడీపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రాజధాని అమరావతి విషయంలో వైఎస్సార్సీపీ ఒక స్పష్టమైన, స్థిరమైన విధానానికి రావలసిన అవసరం ఉందని పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు.

సునీల్ కు షాకిచ్చిన భార్య

అమరావతి : ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్.. గతంలో ఆయన సీఐడీ చీఫ్‌గా పనిచేశారు. ఆ సమయంలో రఘు రామను లక్ష్యంగా చేసుకున్నారన్న వాదన ఉంది. వైసీపీ నేతలకు సహకరించి ఆయనను వేధించారని కేసు కూడా నమోదైంది. ఇదిలావుంటే, కూటమి సర్కారు వచ్చిన త ర్వాత.. ఆయనను సస్పెండ్ చేశారు. గతంలో అగ్నిమాపక శాఖ డీజీగా ఉన్న సమయంలో ఉన్నతాధికారులకు చెప్పకుండానే విదేశాలకు వెళ్లారన్నది ఆయనపై ఉన్న మరో ఆరోపణ.ప్రస్తుతం ఈ విషయంపైనే ప్రభుత్వం విచారణ చేస్తోంది. కోర్టులో ఈ కేసు పెండింగులో ఉంది. ఇంతలోనే సునీల్ కుమార్ రిటైరయ్యారు. అయితే.. ఆయనకు ఎలాంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ నిలుపుదల చేయరాదని, రిటైర్మెంట్ విషయంలో కేసులను చూపించి ఇబ్బందులు కలిగించరాదని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీ చేసింది. అయితే.. అసలు సమస్య ఐపీఎస్ సునీల్ కుమార్ సతీమణి నుంచే ఎదురైంది. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద దక్కే సుమారు కోటి రూపాయలకు పైగా సొమ్మును నిలుపుదల చేయాలంటూ ఆమె ప్రభుత్వానికి విన్నించారు.ఈ మేరకు సునీల్ సతీమణి అరుణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. తన భర్తతో తనకు కుటుంబ పరమైన వివాదాలు ఉన్నాయని.. 2017లోనే తాను కోర్టును ఆశ్రయించి గృహ హింస చట్టం కింద కేసు పెట్టానని పేర్కొన్నారు. ఈ కేసులో పెండింగులో ఉన్న నేపథ్యంలో బెనిఫిట్స్‌ను నిలుపుదల చేయాలని కోరారు. ఒకవేళ ఇప్పుడే ఆ సొమ్మును ఆయనకు ఇచ్చేస్తే భవిష్యత్తులో తనకు ఇబ్బంది ఏర్పడుతుందని.. ఆ సొమ్మును ఇతరుల ఖాతాలకు మళ్లించే ప్రమాదం ఉందని అరుణ పేర్కొన్నారు. తన జీవించే హక్కును దృష్టిలో పెట్టుకొని.. సునీల్‌కుమార్ రిటైర్మెంటు బెనిఫిట్స్‌ను నిలుపుదల చేయాలని ఆమె కోరారు.ఈ లేఖను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం బెనిఫిట్స్‌ను నిలుపుదల చేస్తూ.. సోమవారం మరో ఉత్తర్వు జారీ చేసింది. దీంతో సునీల్‌కు సొమ్ము విడుదల వ్యవహారం సంకటంగా మారింది. అయితే.. ఇలాంటి సందర్భాల్లో ప్రభుత్వాలు జోక్యం చేసుకునే అవకాశాలు చాలా తక్కువ. గతంలో సుప్రీంకోర్టు కూడా ఉద్యోగి జీత భత్యాలు సహా.. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై ఆ ఉద్యోగికి మాత్రమే హక్కు ఉంటుందని.. స్పష్టం చేసింది. ఈ నిధులను ఆపేందుకు లేదా వేరే వారికి బదిలీ చేసేందుకు సంపూర్ణ హక్కు ఉద్యోగికి మాత్రమే ఉంటుందని స్పష్టం చేసింది. దరిమిలా.. ఇప్పుడు సర్కారు ఏం చేస్తుందన్నది చూడాలి.

ఇక సినిమా కష్టాలే

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో సీఐడీ చీఫ్‌గా పనిచేసిన సునీల్ కుమార్.. అప్పట్లో ప్రతిపక్ష నేతలను, విమర్శకులను తీవ్రంగా టార్గెట్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజును నాటి కస్టడీలో భౌతికంగా హింసించిన కేసులో సునీల్ కుమార్ ప్రధాన నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో ఆయన ఇప్పటికే గుంటూరు సీసీఎస్ పోలీసుల ముందు విచారణకు కూడా హాజరయ్యారు. ఒకవేళ ఆయన ఏదైనా రాజకీయ పార్టీలో చేరి మైక్ పట్టుకుందామని భావించినా.. ఈ కస్టోడియల్ టార్చర్ కేసుతో పాటు అగ్రిగోల్డ్ బాధితుల రిలీఫ్ ఫండ్స్ దుర్వినియోగానికి సంబంధించి అవినీతి నిరోధక శాఖ జరుపుతున్న అధికారిక విచారణలు ఆయనకు నిరంతరం చట్టపరమైన చిక్కులను తెచ్చిపెట్టడం ఖాయంగా కనిపిస్తోంది.సునీల్ కుమార్ రాజకీయ భవిష్యత్తుకు కేవలం ప్రభుత్వ పరమైన కేసులే కాకుండా.. క్షేత్రస్థాయిలో సొంత సామాజికవర్గ సీనియర్ లీడర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దళిత అజెండాతో ఆయన నడుపుతున్న అంబేద్కర్ ఇండియా మిషన్ అనే సంస్థ వెనుక ఉన్న అసలు రహస్యాలను దళిత నేతలే బట్టబయలు చేస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి గోదావరి జిల్లాల సీనియర్ దళిత నేత, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ కుమారులు గత కొన్ని వారాలుగా సోషల్ మీడియా వేదికగా సునీల్ కుమార్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పొలిటికల్ వార్ నడుపుతున్నారు. ఒక ఐపీఎస్ అధికారిగా ఉంటూ సునీల్ కుమార్ నడిపిన మత సంస్థల వివరాలు, దానికి విదేశాల నుండి వచ్చినట్లు చెప్తున్న నిధులు, భారీ ఆర్థిక లావాదేవీలు, యన కూడబెట్టిన బినామీ ఆస్తుల లెక్కలను ఆధారాలతో సహా పబ్లిక్ డొమైన్‌లోకి తీసుకువచ్చారు. దళితుల సంక్షేమం పేరిట సునీల్ కుమార్ తన సొంత సామ్రాజ్యాన్ని ఏ విధంగా నిర్మించు కున్నారనే అంశంపై హర్షకుమార్ వర్గం చేసిన దాడులు ఆయన సామాజిక క్రెడిబిలిటీని తీవ్రంగా దెబ్బతీశాయి. ఇప్పటివరకు ఐపీఎస్ హోదా, సర్వీస్ రూల్స్ అడ్డం పెట్టుకుని తనపై వచ్చే ఆరోపణలను సాంకేతికంగా ఎదుర్కొన్న సునీల్ కుమార్‌కు.. ఇకపై అలాంటి రక్షణ కవచాలేవీ ఉండవు. సాధారణ పౌరుడిగా మారిన తరుణంలో.. ప్రభుత్వం ఆయన ఆర్థిక మూలాలను, ట్రస్టుల వెనుక ఉన్న విదేశీ ఫండింగ్ నెట్‌వర్క్‌ను లోతుగా తవ్వేందుకు సిద్ధమవుతోంది. ఈ లెక్కలన్నీ పూర్తిగా బయటకు తీసి ప్రజల ముందు పెడితే.. పీవీ సునీల్ కుమార్‌కుసామాజికంగా ఎలాంటి గౌరవం ఇవ్వాలో, ఆయనను నాయకుడిగా అంగీకరించాలో లేదో ప్రజలే స్వయంగా తేల్చుకుంటారు. ఖాకీ చొక్కా విడిచాక సింహంలా రాజకీయాల్లోకి వద్దామనుకున్న మాజీ ఐపీఎస్ అధికారి.. ఇప్పుడు చుట్టుముట్టిన లీగల్ కేసులు, ఆస్తుల వివాదాల చక్రబంధం నుండి ఎలా బయటపడతారనేది ఆయన చేతుల్లోనే ఉంది.

మళ్లీ రియాల్టి జోష్..

అనంతపురం : బెంగళూరు-హైదరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలోని అనంతపురం, పెనుకొండ పరిసర ప్రాంతాల్లో గత కొన్ని నెలలుగా స్తబ్దంగా ఉన్న స్థిరాస్తి మార్కెట్ ఈ జూన్ నెలలో మళ్లీ ఊహించని రీతిలో పుంజుకుంది. సార్వత్రిక ఎన్నికల అనంతర పరిణామాలు, పారిశ్రామిక విధానాలపై స్పష్టత రావడంతో పారిశ్రామిక జోన్ల సమీపంలో ల్యాండ్ మార్కెట్ ఒక్కసారిగా క్రయవిక్రయాలతో బిజీగా మారింది. నిన్నటివరకు నిస్తేజంగా కనిపించిన వెంచర్లు, ల్యాండ్ కన్వర్షన్ ప్రాజెక్టులు ఇప్పుడు మదుపరుల రాకతో మళ్లీ పాత వైభవాన్ని సంతరించుకుంటున్నాయి.ఈ మార్కెట్ రికవరీకి ప్రధాన కారణం ఇక్కడి పారిశ్రామిక రంగంలో పెరుగుతున్న ఉపాధి అవకాశాలేనని జిల్లా పారిశ్రామిక వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కియా మోటార్స్ అనుబంధ పరిశ్రమలతో పాటు, కొరియన్ కంపెనీల విస్తరణ, రక్షణ రంగ సంస్థల రాకతో పెనుకొండ, హిందూపూర్, అనంతపురం రూరల్ పరిధిలోని ఇండస్ట్రియల్ హబ్‌లలో కొత్త ప్రాజెక్టులు వేగం పుంజుకున్నాయి. దీంతో ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వస్తున్న పారిశ్రామిక కార్మికులు, టెక్నీషియన్లు, ఉన్నతాధికారుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.ఈ ఉద్యోగుల వలసల కారణంగా పెనుకొండ టౌన్ , నేషనల్ హైవేకి ఆనుకుని ఉన్న పరిసర గ్రామాల్లో ఇండ్ల అద్దెలకు పరీతమైన డిమాండ్ ఏర్పడింది. సింగిల్ బెడ్‌రూమ్, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లతో పాటు బ్యాచిలర్ రూమ్‌ల కోసం కంపెనీలు ముందస్తుగా అగ్రిమెంట్లు చేసుకుంటుండటంతో ఇండ్ల యజమానులకు మంచి అద్దెలు లభిస్తున్నాయి. ఇదే సమయంలో, ఇండస్ట్రియల్ జోన్లలో పనిచేసే మధ్యతరగతి ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని రియల్టర్లు చిన్న ప్లాట్ల విక్రయాలను ముమ్మరం చేశారు.తక్కువ బడ్జెట్‌లో, సులభ వాయిదాల పద్ధతిలో దొరికే 100 నుంచి 150 చదరపు గజాల ప్లాట్ల కొనుగోళ్లకు ఇక్కడి స్థానిక ఉద్యోగులు, చిన్న వ్యాపారస్తులు విపరీతమైన ఆసక్తి చూపిస్తున్నారు. డీటీసీపీ అనుమతులున్న వెంచర్లలో శరవేగంగా ప్లాట్లు అమ్ముడవుతుం డటంతో, (

కేబినెట్ విస్తరణకు బ్రేక్

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో గత కొంతకాలంగా హాట్ టాపిక్‌గా నడుస్తున్న మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియకు ప్రస్తుతానికైతే బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. ఢిల్లీ వేదికగా ఏఐసీసీ అగ్రనాయకత్వం, ఇటు రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని సమీక్షలు జరిపినప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఉన్న సంక్లిష్ట రాజకీయ సమీకరణాలు ఈ ప్రక్రియకు గట్టిగా మోకాలడ్డుతున్నాయి. ఉన్న సమస్యలకు తోడు కొత్త సమస్యలను కొనితెచ్చుకోవడం ఇష్టం లేక, కాంగ్రెస్ హైకమాండ్ ఈ కేబినెట్ విస్తరణ అంశాన్ని ప్రస్తుతానికి పూర్తిగా పక్కన పెట్టేసినట్లు తెలుస్తోంది.తెలంగాణ కాంగ్రెస్‌లో పైకి అంతా సజావుగానే ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ.. అంతర్గతంగా నడుస్తున్న వర్గ పోరాటం ఊహించిన దానికంటే చాలా ఎక్కువగా ఉందనేది నగ్నసత్యం. ముఖ్యంగా, రాహుల్ గాంధీకి అత్యంత నమ్మకస్తురాలైన ఏఐసీసీ సీనియర్ నేత మీనాక్షి నటరాజన్ వ్యవహారం ఇప్పుడు పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మధ్యప్రదేశ్‌లో ఆమె రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురికావడంలో తెలంగాణకు చెందిన ఒక వర్గం నేతల పాత్ర ఉందన్న అనుమానాలు బలంగా వ్యక్తమవుతున్నాయి. అధిష్టానానికి అత్యంత సన్నిహితురాలైన నేతకే రాష్ట్రంలోని సొంత పార్టీ వర్గం నుండి సరైన మద్దతు లభించలేదనే టాక్ రాహుల్ గాంధీని తీవ్ర అసంతృప్తికి గురిచేసినట్లు సమాచారం. ఈ ఒక్క ఘటనతో తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ల మధ్య ఉన్న విభేదాలు ఏ స్థాయికి చేరాయో హైకమాండ్‌కు స్పష్టమైన అవగాహన వచ్చింది.నిజానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ పెద్దలు కలిసి తెలంగాణ కేబినెట్‌లో భారీ మార్పులు చేయాలని ఒక పక్కా ప్లాన్ సిద్ధం చేశారు. సరిగా పనిచేయని మంత్రులను కేబినెట్ నుండి తొలగించాలని, సామాజిక, ప్రాంతీయ సమీకరణాల ఆధారంగా కొత్తవారికి అవకాశం కల్పించాలని భావించారు. అసంతృప్త సీనియర్లను ప్రసన్నం చేసుకోవడానికి కార్పొరేషన్లు, నామినేటెడ్ పదవులను సర్దాలని నిర్ణయించారు. కానీ, మీనాక్షి నటరాజన్ ఎపిసోడ్ రేపిన సెగలతో సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ఈ తరుణంలో మంత్రివర్గంలో చెయ్యి పెడితే, పదవులు దక్కని అసంతృప్త నేతలు తిరుగుబాటు జెండా ఎగురవేసే ప్రమాదం ఉందని అధిష్టానం గ్రహించింది. అది కాస్తా ప్రభుత్వ స్థిరత్వానికే ఎసరు తెచ్చే అవకాశం ఉందన్న విశ్లేషణలతో పాత ప్లాన్‌ను పూర్తిగా పక్కన పెట్టేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.ఒకవైపు పార్టీని కంటికి రెప్పలా కాపాడుకుంటూనే, మరోవైపు పరిపాలనను ముందుకు తీసుకెళ్లాల్సిన కత్తిమీద సాము లాంటి పరిస్థితిని సీఎం రేవంత్ రెడ్డి ఎదుర్కొంటున్నారు. కేబినెట్ విస్తరణ చేపడితే.. ఆశావహుల సంఖ్య ఇక్కడ డజన్లలో ఉంది. ఉమ్మడి ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాల నుండి సీనియర్లు, అలాగే ఇతర పార్టీల నుండి వలస వచ్చిన నేతలు మంత్రి పదవుల కోసం తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ఈ తరుణంలో ఎవరికి ఇచ్చినా మరొకరు అసంతృప్తికి గురికావడం ఖాయం. అందుకే రేవంత్ రెడ్డి కూడా ఈ వివాదాన్ని తలకెత్తుకోవడం కంటే, "ఉన్న ముఠా తగాదాలను మరింత రచ్చ చేయకుండా యథాతథ స్థితిని కొనసాగించడమే శ్రేయస్కరం" అనే ముగింపునకు వచ్చినట్లు ఢిల్లీ వర్గాల సమాచారం. మరింత సరైన సమయం వచ్చే వరకు వేచి చూడడమే రాజనీతి అని ఆయన భావిస్తున్నారు.తెలంగాణలో త్వరలోనే మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ జరుగుతుందనే ప్రచారానికి ప్రస్తుతానికైతే బ్రేక్ పడినట్లే. ఒకవేళ అత్యవసరమై ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాల్సి వచ్చినా.. అది కేవలం నామమాత్రపు విస్తరణగానే ఉ ంటుంది తప్ప, ఎవరినీ మార్చే లేదా తొలగించే సాహసం హైకమాండ్ చేయకపోవచ్చు

వరంగల్ భూమిలో బంగారం

వరంగల్ : సాధారణంగా వ్యవసాయ భూమి కౌలుకు తీసుకునే వారు తక్కువ ధర కోసం ప్రయత్నిస్తారు. కానీ వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం కోపాకులపాడులోని ఓ ఆరెకరాల వ్యవసాయ భూమికి ఎక్కడా లేని డిమాండ్ ఉంది. ఆ భూమిని తమకే కౌలుకు ఇవ్వాలంటూ ల్యాండ్ ఓనర్ చుట్టూ తిరుగుతున్నారు. అందుకు కారణం ఏంటీ, ఈ భూమి వార్తల్లో నిలవడానికి కారణాలు ఇవే.చెన్నారావుపేటకి చెందిన ఒక వ్యక్తి ఈ భూమిని స్థానికంగా ఉండే ఓ రైతు దాదాపు పదేళ్ల కిందట కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఈర్యతండాకు చెందిన రైతు భూమిని కౌలుకు తీసుకుని పత్తి సాగు చేస్తున్నారు. జూన్ 24న ఆ పొలంలో కలుపు తీయిస్తున్న సమయంలో మహిళా కూలీలకు బంగారు ఆభరణాలు దొరికాయి. భూ యజమాని కూలీలను విచారించగా వారు దొరికిన బంగారు వస్తువులను చూపించడంతో, తనకు న్యాయం చేయాలంటూ ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ భూమి ఉన్న ప్రాంతంలో చాలా ఏళ్ల కిందట ఆలయాలు ఉండేవని, అందుకే ఇక్కడ తరచూ నిధులు బయటపడుతుంటాయని స్థానికులు చెబుతున్నారు. గతంలో 1991లో అప్పటి భూమి యజమానికి, ఆ తర్వాత పొలంలో పనిచేసే జీతగాడికి కూడా బంగారం దొరికిందని చెబుతున్నారు. దేవతామూర్తుల విగ్రహాలు లభించాయని, తాజాగా బంగారం దొరకడంతో మరోసారి హాట్ టాపిక్ అవుతోంది. బంగారాన్ని పంచుకున్న వారిపై చర్యలు తీసుకుని, తనకు అప్పగించాలని భూమిని మొదట అమ్మిన వ్యక్తి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ పొలంలో లంకె బిందెలు ఉన్నాయని వదంతులతో అర్ధరాత్రి వేళల్లో స్థానికులు ఆ భూమి పరిసర ప్రాంతాల్లో తవ్వకాలు జరుపుతుంటారు.

తనకు వాటా ఇవ్వలేదని పాత ఓనర్ ఫిర్యాదు

వరంగల్ జిల్లా కోపాకులపాడులోని ఆరెకరాల భూమిలో కలుపు తీస్తుండగా కూలీలకు 50 తులాల బంగారం దొరికినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, తనకు వాటా ఇవ్వకుండా ప్రస్తుత యజమాని, కూలీలు ఆ బంగారాన్ని పంచుకున్నారని కొన్నేళ్ల క్రితం ఆ భూమిని అమ్మిన వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో ఇక్కడ ఆలయాలు ఉండేవని, తరచూ నిధులు దొరుకుతుంటాయని స్థానికులు చెబుతున్నారు.

ఫడ్నవిస్ తో పవన్ భేటీ

ముంబై : మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నీవీస్‌తో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమావేశమయ్యారు. ఇద్దరు నేతలు ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన కీలకమైన అంశాలపై చర్చించారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు రెండు ఆడ పులులు ఇచ్చే అంశంపై ఇద్దరు చర్చించారు. ఏపీకి రెండు ఆడ పులులు ఇస్తున్నందుకు మహారాష్ట్ర సీఎంకు పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిశారు. ముంబైలోని మహారాష్ట్ర ముఖ్యమంత్రి వారి క్యాంపు కార్యాలయంలో సమావేశమైన పవన్, ఫడ్నవీస్‌లు.. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. తూర్పు కనుమల్లో పులుల సంరక్షణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కి రెండు ఆడపులులను ఇవ్వాలని నిర్ణయం తీసుకోగా.. పవన్ సీఎం ఫడ్నవీస్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో రెండు రాష్ట్రాలకు సంబంధించిన అంశాలలో పరస్పరం మరింత సహకరించుకోవాలని పవన్, ఫడ్నవీస్‌లు నిర్ణయించారు.ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న తూర్పు కనుమలలో ఆడ పులుల సంఖ్య గణనీయంగా తగ్గిందని పవన్ కళ్యాణ్ తెలిపారు. అందుకే పులుల సంఖ్య పునరుద్ధరణ కోసం మహారాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకున్నామని.. ఏపీకి రెండు ఆడ పులుల్ని ఇచ్చేందుకు అంగీకరించిందని పేర్కొన్నారు. తూర్పు కనుమలలో పులుల సంరక్షణ చరిత్రలో ఇది ఒక మైలురాయిగా నిలిచిపోతుందని అభిప్రాయపడ్డారు. మహారాష్ట్ర నుంచి తీసుకొచ్చే ఆడ పులులు తూర్పు కనుమల్లో ప్రవేశంతో అంతరసంతానోత్పత్తిసమస్యల్ని అధిగమించొచ్చన్నారు. అంతేకాదు జన్యు వైవిధ్యం పెరిగి, పులుల సంఖ్య దీర్ఘకాలిక స్థిరత్వానికి దోహదపడుతుందన్నారు. తూర్పు కనుమలలో పులుల ఆవాస వ్యవస్థ ఏర్పడుతుందన్నారు.మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సంరక్షణ కార్యాచరణ శాస్త్రీయ విధానాలు, స్థిరమైన వన్యప్రాణి నిర్వహణ ఆధారంగా జీవ వైవిధ్య పరిరక్షణకు కట్టుబడి ఉన్న విషయాన్ని ప్రతిబింబిస్తోందన్నారు పవన్ కళ్యాణ్. 'ఆంధ్రప్రదేశ్?మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య ఏర్పడిన ఈ భాగస్వామ్యం తూర్పు కనుమలలో పులుల దీర్ఘకాలిక సంరక్షణకు విశేషంగా దోహదపడుతుందని విశ్వసిస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో మాకు నిరంతరం మార్గదర్శకత్వం అందిస్తున్న కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. వన్యప్రాణి సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ లక్ష్యాల సాధనలో మహారాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం, ఇతర భాగస్వామ్య సంస్థలతో కలిసి మరింత సమన్వయంతో ముందుకు వెళ్తాము' అన్నారు పవన్ కళ్యాణ్. మహారాష్ట్ర నుంచి ఏపీకి త్వరలోనే రెండు ఆడపులులు వస్తుండటంతో ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం లభించింది.

కేబినెట్ లో మరో మంత్రి

హైదరాబాద్ : తెలంగాణపై భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో త్వరలో జరగబోయే కేంద్ర మంత్రివర్గ విస్తరణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. రాష్ట్రం నుంచి కేంద్ర క్యాబినెట్‌లో మరొకరికి అవకాశం లభిస్తుందా, లేక ప్రస్తుతం ఉన్న ఇద్దరితోనే సరిపెడతారా అనే అంశంపై రాష్ట్ర బీజేపీ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఈ మార్పులు, చేర్పుల ప్రచారం నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన పలువురు బీజేపీ ఎంపీలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు ప్రారంభిస్తున్నారు. ఢిల్లీ స్థాయిలో తమకు అనుకూలంగా సమీకరణాలను చక్కబెట్టుకునే పనిలో పడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి ఊహించని విధంగా ఎనిమిది స్థానాలను కైవసం చేసుకుంది కమలం పార్టీ. దీనికి అదనంగా లక్ష్మణ్ ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యునిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి కిషన్ రెడ్డి కేంద్ర క్యాబినెట్ మంత్రిగా, బండి సంజయ్ సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక తర్వాత తెలంగాణలోనే పార్టీ అధికారంలోకి రావడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని బీజేపీ జాతీయ నాయకత్వం బలంగా విశ్వసిస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా తెలంగాణలో పాగా వేయడమే లక్ష్యంగా కేంద్ర మంత్రులు, జాతీయ నేతలు రాష్ట్రంలో నిరంతరం పర్యటిస్తున్నారు. ఈ తరుణంలో, రాష్ట్రంలోని ముఖ్య నాయకుల మధ్య ఉన్న అంతర్గత విభేదాలను సమూలంగా పరిష్కరించి, కేడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపడానికి మరో మంత్రి పదవిని కేటాయించడం దోహదపడుతుందని అధిష్టానం భావిస్తున్నట్లు సమాచారం.తెలంగాణ నుంచి ప్రస్తుతం ఒక క్యాబినెట్, ఒక సహాయ మంత్రి పదవులు ఉండగా, రాబోయే ఎన్నికల వ్యూహంలో భాగంగా మూడో వ్యక్తికి అవకాశం కల్పించడం ద్వారా సామాజిక సమతుల్యతను సాధించాలని అధిష్టానం యోచిస్తోంది. మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కించుకునేందుకు పలువురు సీనియర్ నాయకులు ఎవరి ధీమాతో వారు ఉన్నారు. ప్రధానంగా ఈటల రాజేందర్, డి.కె.అరుణ, ధర్మపురి అర్వింద్, జి.నగేశ్ తదితరుల పేర్లు ప్రచారంలో ఉన్నాయి.అయితే., ఈటల రాజేందర్, డీకే అరుణ రేసులో ముందు వరుసలో ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ఇప్పటికే బీసీ సామాజిక వర్గం నుంచి బండి సంజయ్ మంత్రివర్గంలో ఉన్నప్పటికీ, బలమైన ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఈటల రాజేందర్‌కు అవకాశం కల్పిస్తే రాష్ట్రంలో రాజకీయంగా పెద్ద ఎత్తున కలిసి వస్తుందని భావిస్తున్నారు. మరోవైపు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ సైతం ఈసారి గట్టి ఆశలతో ఉన్నారు. ఈ విస్తరణలో మహిళలకు ప్రాధాన్యత పెరిగే అవకాశం ఉండటం, పైగా ముఖ్యమంత్రి సొంత జిల్లా అయిన ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ గట్టి పోటీని తట్టుకుని ఆమె విజయం సాధించడంతో ఆమె పేరును అధిష్టానం తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.అయితే, డీకే అరుణ ప్రాతినిధ్యం వహిస్తున్న సామాజిక వర్గం నుంచే ఇప్పటికే కిషన్ రెడ్డి క్యాబినెట్ మంత్రిగా అత్యంత కీలక బాధ్యతల్లో ఉన్నారు. అలాగే శాసనసభలో పార్టీ పక్ష నేత కూడా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో, ఒకే సమీకరణం నుంచి మరో వ్యక్తిని కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఓసీ, బీసీ వర్గాలకు కేంద్రంలో చోటు దక్కినందున, గిరిజన ఓటు బ్యాంకును ఆకర్షించేందుకు ఆదిలాబాద్ ఎంపీ జి.నగేశ్‌కు అవకాశం ఇవ్వవచ్చనే ప్రచారం కూడా ఊపందుకుంది. మరోవైపు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సైతం తనదైన శైలిలో గట్టి నమ్మకంతో ప్రయత్నాలు సాగిస్తున్నారు.మొత్తంమీద, తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రస్తుతమున్న మంత్రులలో ఎటువంటి మార్పులు చేయకుండానే, అదనంగా మరొకరికి అవకాశం కల్పించే వ్యూహాన్ని అధిష్టానం అమలు చేసే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే, బీజేపీ జాతీయ నాయకత్వం చివరి నిమిషంలో నిర్ణయాలు మార్చడంలో ప్రసిద్ధి చెందినందున, ఈ విస్తరణ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఉత్కంఠ కొనసాగడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఉద్యోగులకు 2 వేల కోట్లు విడుదల

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులు, పింఛన్‌దారుల దీర్ఘకాలిక బకాయిల చెల్లింపుల కోసం మరో రూ.2 వేల కోట్లను విడుదల చేస్తూ సర్కార్ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నెల రోజుల వ్యవధిలోనే ప్రభుత్వం మొత్తం రూ.4 వేల కోట్ల నిధులను ఉద్యోగుల కోసం కేటాయించినట్లయింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు సంబంధించిన జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బకాయిలను వంద శాతం చెల్లించి, పెండింగ్ బిల్లులు లేకుండా చేసినట్లు ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగ జేఏసీకి ఇచ్చిన హామీ మేరకు వంద రోజుల్లో రూ.6 వేల కోట్లు విడుదల చేసే లక్ష్యంలో భాగంగా ఈ నిధులు విడుదలయ్యాయన్నారు.తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉ ందనే విషయాన్ని స్పష్టం చేస్తూ తెలంగాణ ఆర్థిక శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల, పింఛన్‌దారుల బకాయిల చెల్లింపుల కోసం మరో రెండు వేల కోట్లు విడుదల చేస్తూ ఆర్థిక శాఖ సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల మే 29న మొదటి విడతగా రెండు వేల కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం.. సరిగ్గా నెల రోజుల వ్యవధిలోనే రెండో విడత నిధులను కూడా సర్దుబాటు చేసింది. దీంతో కేవలం నెల రోజుల వ్యవధిలోనే ఉద్యోగ వర్గాల కోసం ప్రభుత్వం విడుదల చేసిన మొత్తం బకాయిల నిధులు నాలుగు వేల కోట్లకు చేరుకున్నాయి. ఉద్యోగ జేఏసీ నాయకులతో గతంలో జరిపిన చర్చల సారాంశం ప్రకారం.. దీర్ఘకాలంగా పేరుకుపోయిన బకాయిలను తీర్చేందుకు వంద రోజుల వ్యవధిలో ఆరు వేల కోట్లను విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ హామీని నిలబెట్టుకునే క్రమంలోనే ఈ నిధుల విడుదల వేగంగా సాగుతోంది.ఈ నిధుల విడుదలపై ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేస్తూ ఉద్యోగుల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి మరోసారి నిరూపితమైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు, నిధుల కొరత ఎదుర్కొంటున్నప్పటికీ ఉద్యోగులకు ఇచ్చిన ప్రతి మాటను నెరవేరుస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర రాయితీల బకాయిల చెల్లింపు ప్రక్రియను మరింత వేగవంతం చేశామని వివరించారు. ముఖ్యంగా పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే రిటైర్డ్ ఉద్యోగులు, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు సంబంధించి చాలా కాలంగా పెండింగులో ఉన్న జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బకాయిలను వంద శాతం క్లియర్ చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ పరిధిలో జీపీఎఫ్ ఖాతాలకు సంబంధించిన ఎలాంటి పెండింగ్ బిల్లులూ లేవని అన్నారుదీంతో పాటు విశ్రాంత ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించి సెప్టెంబరు 2025 వరకు ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటినీ ప్రభుత్వం పూర్తిగా చెల్లించినట్లు ఆర్థికశాఖ వివరించింది. ఉద్యోగులు, పింఛన్‌దారులు గతంలో ప్రభుత్వానికి పంపిన పది వేల లోపు ఉన్న చిన్న చిన్న బిల్లులను ప్రత్యేకంగా గుర్తించి అలాంటి దాదాపు ఐదు లక్షలకు పైగా బిల్లులను వంద శాతం పూర్తిగా చెల్లించినట్లు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై రాష్ట్రంలోని వివిధ ఉద్యోగ సంఘాల నేతలు తీవ్ర సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నప్పటికీ, ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూల ధోరణితో వ్యవహరించడం అభినందనీయమని కొనియాడారు. రాబోయే రోజుల్లో మిగిలి ఉన్న ఇతర బకాయిలను కూడా ఇదే విధంగా ఒక క్రమపద్ధతిలో విడతల వారీగా చెల్లిస్తామని ఆర్థిక శాఖ అధికారులు తమకు హామీ ఇచ్చారని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వెల్లడించారు.

రంగంలోకి సీఎం టీమ్

హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు ముగుస్తున్న నేపథ్యంలో, రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త చర్చ నడుస్తోంది. ప్రజా పరిపాలనపై ప్రజల అసలు అభిప్రాయం ఏంటి? క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ప్రతిష్ట ఎలా ఉందనే అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఆరా తీస్తున్నారు. ఇంటెలిజెన్స్, థర్డ్ పార్టీ నివేదికలను పక్కన పెట్టి, కేవలం తన సొంత నమ్మకస్తులతో కూడిన 'సీఎం టీమ్'ను రేవంత్ రెడ్డి రంగంలోకి దించడం ఇప్పుడు పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది.ప్రభుత్వ వ్యతిరేకత రాకముందే అప్రమత్తమవ్వడం, లోపాలను సరిదిద్దుకుంటూ ఎన్నికల మూడ్‌ను ఇప్పటి నుంచే సెట్ చేయడమే లక్ష్యంగా సీఎం స్వయంగా ఈ సర్వే ప్రక్రియను మానిటరింగ్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రత్యేక సర్వేను సీఎం టీమ్ తొలుత మంత్రుల నియోజక వర్గాల్లో ప్రారంభించనుంది. ఆ తర్వాతే మిగతా అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తారు. కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలతో పాటు విపక్షాల చేతిలో ఉన్న నియోజకవర్గాల్లోనూ ఈ టీమ్స్ పర్యటించనున్నాయి. ప్రభుత్వ ఆరు గ్యారెంటీలు, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి ఎంతవరకు వెళ్లాయి? స్థానిక ప్రజలకు, పార్టీ క్యాడర్‌కు మంత్రులు, ఎమ్మెల్యేలు ఎంతవరకు అందుబాటులో ఉంటున్నారు? నియోజకవర్గాల్లో పార్టీ పట్టు ఎలా ఉంది? ఎమ్మెల్యేల గ్రాఫ్ ఎలా ఉంది? ఎక్కడెక్కడ అసంతృప్తి వ్యూహాలు నడుస్తున్నాయి? అనే విషయాలను సీఎం అత్యంత రహస్యంగా క్రోడీకరిస్తున్నారు.ఈ సర్వే ద్వారా వచ్చే డేటాను కేవలం నివేదికలకే పరిమితం చేయకుండా, ఒక పక్కా యాక్షన్ ప్లాన్‌ను సీఎం రేవంత్ రెడ్డి సిద్ధం చేస్తున్నారు. సర్వే విశ్లేషణ ఆధారంగా పార్టీ పరంగా, ప్రభుత్వ అభివృద్ధి పరంగా వెనుకబడిన జిల్లాలను ప్రత్యేకంగా ఫిల్టర్ చేయనున్నారు. ఆయా జిల్లాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించడంతో పాటు, ఇన్-ఛార్జ్ మంత్రులను అలర్ట్ చేసి క్యాడర్‌లో నూతనోత్తేజం నింపేందుకు సీఎం కార్యాచరణ రూపొందిస్తున్నారు. మరోవైపు, ప్రజాక్షేత్రంలో పట్టు కోల్పోతున్న ప్రజాప్రతినిధులకు తమ పనితీరు మార్చుకోవాలని గట్టి హెచ్చరికలు జారీ చేసేందుకు కూడా వెనుకాడబోరని గాంధీ భవన్ వర్గాలు పేర్కొంటున్నాయి.ఇప్పటికే ప్రభుత్వం పనితీరు, నెరవేరని హామీలపై సునీల్ కనుగోలు టీమ్ ఉమ్మడి పది జిల్లాల్లో సర్వే చేసి సీఎంకు కీలక రిపోర్ట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నివేదికలో కొన్ని ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. కొన్ని జిల్లాల్లో బీఆర్ఎస్, మరికొన్ని జిల్లాల్లో బీజేపీ కాంగ్రెస్‌కు గట్టి ఫైట్ ఇవ్వనున్నట్లు అంచనా వేశారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో కాంగ్రెస్ కంటే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మెరుగ్గా ఉన్నాయని ఈ రిపోర్ట్ తేల్చినట్లు సమాచారం. దీంతో పార్టీ ఓటు బ్యాంకును కాంగ్రెస్ వైపు ఎలా మళ్లించాలనే దానిపై ప్రభుత్వ పెద్దలు కసరత్తులు ప్రారంభించారు. బీజేపీ ఓటు బ్యాంకు బీఆర్ఎస్‌కు, బీఆర్ఎస్ ఓటు బ్యాంకు బీజేపీకి షిఫ్ట్ కాకుండా ఉంటేనే కాంగ్రెస్‌కు పూర్తి లాభం జరుగుతుందని సునీల్ టీం సూచించినట్లు సమాచారం. ఇకపై ప్రతి ఆరు నెలలకోసారి తమ టీమ్ సర్వే చేసి ప్రభుత్వానికి రిపోర్టు ఇస్తుందని సునీల్ టీమ్ హామీ ఇచ్చింది. అంతేకాకుండా, పార్టీ సోషల్ మీడియా టీమ్‌లను హ్యాండిల్ చేసేందుకు కూడా ఈ టీమ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.మిగతా రాష్ట్రాల్లో అధికార పార్టీలు ఎదుర్కొన్న చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటి నుంచే క్షేత్రస్థాయి వ్యూహాలకు పదును పెడుతున్నారు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ మార్క్ పాలనను మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లి, వచ్చే ఎన్నికల నాటికి తిరుగులేని శక్తిగా ఎదగడానికి సీఎం వేసిన ఈ 'సర్వే వ్యూహం' రాష్ట్ర రాజకీయాల్లో ఏ రకమైన మార్పులు తీసుకువస్తుందో చూడాలి.

విద్యా రంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

- డిఆర్ఓ కు యుటిఎఫ్ జిల్లా శాఖ వినతి

బద్వేలు : విద్యా రంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిఆర్ఓ మల్లికార్జునుడు కు యుటిఎఫ్ కడప జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. కడపలోని జిల్లా కలెక్టరేట్లో విద్యా రంగ, ఉపాధ్యాయుల సమస్యలపై డిఆర్ఓ మల్లికార్జునుడుకు యుటిఎఫ్ జిల్లా శాఖ పక్షాన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబులు మాట్లాడుతూ విద్యా రంగ, ఉపాధ్యాయుల పలు సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. 2025 సంవత్సరములో బదిలీ కాబడిన కొందరు ఉపాధ్యాయులు రిలీవర్ లేని కారణంగా పాత పాఠశాలలోనే కొనసాగుతున్నారన్నారు. ప్రస్తుతం విద్యాశాఖ చేపట్టిన పని సర్దుబాటు ప్రక్రియకు ముందుగానే వారిని రిలీవ్ చేసి వారు కోరుకున్న స్థానాలకు పంపాలన్నారు. ఈ ఏడాది విద్యాశాఖ చేపట్టిన రేషనలైజేషన్ ప్రక్రియకు కట్ ఆఫ్ తేదీని జూన్ 20 వ తేదీగా నిర్ణయించడం వల్ల, ఆ తర్వాత పాఠశాలల్లో పెరిగిన అడ్మిషన్లు పరిగణలోకి రాకపోవడం మూలాన పలు పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు రద్దయ్యే ప్రమాదం ఉందన్నారు. జూన్ 30వ తేదీని ఆధారంగా తీసుకొని రేషనలైజేషన్ ప్రక్రియను చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 45 ప్రకారం ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలో ఉన్న లోపాలను పూర్తిస్థాయిలో సవరించి, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి అప్పటికి ఉన్న సమస్యలను పరిష్కారం చేసి తర్వాత ఆమోదానికి పంపాలన్నారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో నాన్ లోకల్ కేటగిరీలో సెలెక్ట్ అయి సొంత జిల్లాలోకి వెళ్లాలనుకున్న వారికి అంతర్ జిల్లా సాధారణ బదిలీలు నిర్వహించి సొంత జిల్లాలకు వెళ్లే అవకాశం కల్పించాలని కోరారు. 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులను టెట్ పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని కేంద్ర ప్రభుత్వంతో చర్చించి విద్యా హక్కు చట్టం 23 (1) కి సవరణ చేయాలన్నారు. చట్ట సవరణ చేసే వరకు ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ పరీక్షలను ఆఫ్ లైన్ విధానంలో నిర్వహించాలని కోరారు.

గత ఏడాది ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించబడిన పాఠశాలలకు పలుచోట్ల తగినంత స్థలము లేక , తరగతి గదులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అలాంటి పాఠశాలలకు తగినంత స్థలము ఏర్పాటు చేయడంతో పాటు, అదనపు తరగతి గదుల నిర్మాణము చేపట్టాలన్నారు. సమగ్ర శిక్ష, కస్తూర్బా లలో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న ఉపాధ్యాయినీలు, సిఆర్ఎంటి, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లకు మరియు ఇతర సిబ్బందికి మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు దశలవారీగా వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న మెడికల్ రీయంబర్స్మెంట్ బిల్లులను త్వరిత గతిన మంజూరు చేసి, నగదు చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని కోరారు.

లంకె బిందెల ఆశ... అత్తామామల కోసం కూతురు, అల్లుడు ఆత్మహత్య

హైదరాబాద్ : ఇంట్లో లంకెబిందెలు, గుప్తనిధులు ఉన్నాయంటూ ఓ సాధువు చెప్పిన మాటలను నమ్మిన అత్తమామలు.. తమ సొంత కూతురు, అల్లుడి ప్రాణాలనే బలితీసుకున్నారు. అల్లుడితో అప్పులు చేయించి.. ఆ తర్వాత మొహం చాటేయటంతో మనస్థాపం చెందిన దంపతులు ప్రాణాలు తీసుకున్నారు. ఈ విషాదకర ఘటన హైదరాబాద్ శివారు మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మోకిల సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బాలసాయి, పద్మ ఏడాదిన్నర క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. పెళ్లయిన తర్వాత వారిద్దరూ సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు మండలం పటేల్‌గూడలో నివాసముంటూ జీవనం సాగించేవారు. వీరికి ఐదు నెలల బాబు కూడా ఉన్నాడు.అయితే.. పెళ్లయిన కొన్ని రోజులకు ఈ దంపతులు అత్తగారి ఇంటికి వెళ్లారు. అదే సమయంలో పద్మ తల్లిదండ్రులైన శాంతమ్మ, చంద్రయ్య, అలాగే తోడల్లుడు వెంకటేష్ కలిసి బాలసాయికి ఒక కథ చెప్పారు. తమ ఇంట్లో కోట్ల విలువైన నిధి దాగి ఉందని.. దాన్ని వెలికితీయడానికి ఒక సాధువు పూజలు చేయాలని అందుకు రూ.10 లక్షల నగదు అత్యవసరంగా కావాలని అల్లుడు బాలసాయిని నమ్మించారు. అత్తమామల మాటలను నిజమేనని నమ్మిన బాలసాయి.. నాలుగు నెలల క్రితం తనకు తెలిసిన వారి వద్ద వడ్డీలకు రూ.10 లక్షలు అప్పు తెచ్చి అత్తమామల చేతిలో పెట్టాడు.ఆ డబ్బుతో వారు ఇంట్లో రహస్యంగా తవ్వకాలు జరిపారు. అయితే ఎంత తవ్వినా ఎలాంటి నిధి దొరకలేదు. దీంతో సాధువు మోసం చేశాడని తెలిసినా అత్తమామలు ఆ విషయాన్ని దాచిపెట్టారు. ఇటు చూస్తే అప్పు ఇచ్చిన వారు బాలసాయిపై రోజురోజుకూ ఒత్తిడి పెంచడం ప్రారంభించారు. అటు వైపు అత్తమామల నుంచి ఎలాంటి స్పందన లేదు. అవమానాలు, వేధింపులు ఎక్కువ కావడంతో బాలసాయి తన అత్త, మామ, తోడల్లుడిని డబ్బులు తిరిగివ్వాలని కోరాడు. కానీ వారు నయాపైసా కూడా ఇవ్వకుండా చేతులెత్తేశారు.అప్పుల ఊబి నుంచి ఎలా బయటపడాలో దిక్కుతోచని స్థితిలో తీవ్ర మనస్తాపానికి గురైన బాలసాయి, పద్మ తమ ఐదు నెలల పసికందును చూసి కన్నీరుమున్నీరయ్యారు. చివరకు స్వగ్రామమైన జన్వాడకు వచ్చి ఇద్దరూ కలిసి జూన్ 28న బలవన్మరణానికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతుడి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. 'అందరూ మమ్మల్ని క్షమించాలి.

ప్రజా కలం

సోమవారం, జూలై 27, 2026

వ్యవసాయ సంక్షోభం తప్పదా

పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల సంభవించే ఎల్ నినో ప్రస్తుత వాతావరణాన్ని పూర్తిగా శాసిస్తోంది. వర్షాల కొరత నేరుగా ఖరీఫ్ సీజన్‌పై దెబ్బకొట్టబోతోంది. తెలుగు రాష్ట్రాల్లో వరి, పత్తి, మిరప, వేరుశనగ సాగు చేసే రైతులు ఇప్పటికే విత్తనాలు వేయడానికి వెనుకంజ వేస్తున్నారు. కాలవర్షాలు కురవకపోతే పంట దిగుబడి గణనీయంగా పడిపోయి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నభిన్నమవుతుంది. దీని ప్రభావం మార్కెట్లపై పడి పప్పుధాన్యాలు, కూరగాయలు, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటే ప్రమాదం ఉంది. పాలకులకు ఇది కేవలం వాతావరణ సమస్యే కాదు, ఆర్థిక సంక్షోభానికి దారితీసే ముప్పు కూడా. జూలై, ఆగస్టు నెలల్లో కూడా ఎల్ నినో ప్రభావం తీవ్రంగానే ఉండబోతోంది. కాబట్టి, అందుబాటులో ఉన్న కొద్దిపాటి జలవనరులను అత్యంత జాగ్రత్తగా మేనేజ్ చేయడం ఒక్కటే ప్రస్తుతానికి ఉన్న మార్గం.గత ఏడాది పడాల్సిన వర్షాలు ముందే కురిసి, శ్రీశైలానికి వరుసగా మూడు, నాలుగు నెలల పాటు రికార్డు స్థాయిలో ఇన్‌ఫ్లో తెచ్చిపెట్టాయి. కానీ ఈ ఏడాది పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. నైరుతి రుతుపవనాల గమనం మందగించడంతో దేశంలోని సగానికి పైగా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతోంది. వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం, ఈ సీజన్‌లో దేశవ్యాప్త సగటు వర్షపాతం లోటు భారీగా ఉండే ప్రమాదం ఉంది. ఇది దేశ ఆహార భద్రతపై నేరుగా ప్రభావం చూపనుంది.దక్షిణ భారతదేశంలో ఎల్ నినో ప్రభావం అత్యంత స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా జూన్ నాటికి నిండాల్సిన కర్ణాటక, కేరళ, తమిళనాడులోని ప్రధాన జలాశయాలు ఈసారి వెలవెలబోతున్నాయి. కావేరి, కృష్ణా బేసిన్లలో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. దక్షిణాదిలోని ప్రధాన నగరాల్లో ఇప్పటికే తాగునీటి ఎద్దడి సంకేతాలు కనిపిస్తుండగా, విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన జలవనరులు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వర్షాలు సకాలంలో పడకపోతే అంతర్–రాష్ట్ర జల వివాదాలు మళ్లీ రాజుకునే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు జీవనాడి అయిన శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల భవితవ్యం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి భారీగా వరద వస్తేనే ఈ డ్యామ్‌లు నిండుతాయి. అయితే ఎల్ నినో కారణంగా కృష్ణా నది ఎగువ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు మొహం చాటేశాయి. గత ఏడాది తరహాలో ఈసారి జలాశయాలు నిండుతాయా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గోదావరి బేసిన్‌లోనూ ఇదే పరిస్థితి ఉండటంతో.. అటు రాయలసీమకు తాగునీరు, ఇటు కోస్తా, తెలంగాణ జిల్లాలకు సాగునీరు అందించడం ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలకు సవాలుగా మారనుంది.ఎల్ నినో ప్రభావం కారణంగా దేశంలో సాధారణం కంటే తక్కువగా వర్షాలు కురిసే 315 జిల్లాలను కేంద్ర వ్యవసాయ శాఖ గుర్తించింది. ఈ జిల్లాలు కలిగిన ఆయా రాష్ట్రాలు తమ అత్యవసర ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశించింది. ఈ 315 జిల్లాల్లో 25 శాతం కంటే తక్కువ సాగునీటి వసతి కలిగిన 111 జిల్లాలను అత్యంత ప్రమాదకమైన కేటగిరీగా గుర్తించారు. 25 నుంచి 50 శాతంలోపు సాగునీటి వసతి ఉన్న మరో 76 జిల్లాలను మధ్యస్థ ప్రమాదకర కేటగిరీలో చేర్చగా, 50 శాతం కంటే ఎక్కువ సాగునీటి సౌకర్యం ఉన్న 128 జిల్లాలను సాపేక్షంగా తక్కువ ముప్పు ఉన్న ప్రాంతాలుగా పరిగణించారు.అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న జిల్లాలు ఎక్కువగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో కేంద్రీకృతమై ఉన్నాయి. మిగిలిన జిల్లాలు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, బీహార్, జార్ఖండ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. బలహీనమైన రుతుపవనాల ప్రభావాన్ని తట్టుకునేందుకు పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజల సాగువైపు రైతులను ప్రోత్సహించాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. పంటల వైవిధ్యం, తేమ సంరక్షణ, సమర్థవంతమైన నీటి యాజమాన్యం వంటి వ్యూహాలను అనుసరించాలని తెలిపింది.చెరువుల మరమ్మతులు, చెక్ డ్యామ్‌ల పునరుద్ధరణ, కాలువల్లో పూడికతీత, నీటి సంరక్షణ నిర్మాణాల విస్తరణ ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని బలోపేతం చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. మరోవైపు 2026 ద్వితీయార్థంలో ఎల్ నినో తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థ హెచ్చరించింది. 'సౌత్ ఏషియన్ క్లైమేట్ అవుట్ లుక్ ఫోరం' అంచనాల ప్రకారం భారతదేశంలో దీర్ఘకాలిక సగటు వర్షపాతంలో కేవలం 90 శాతం మాత్రమే కురిసే అవకాశం ఉంది. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, నీటి ఎద్దడి కారణంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎల్ నినో వల్ల అనావృష్టి ఏర్పడి ఆహార ద్రవ్యోల్బణం పెరిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే అసలైన విద్య

విశాఖపట్టణం : విశాఖలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం ఘనంగా జరిగిందిఈ వేడుకకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ప్రతి తరం ఒక దేశాన్ని వారసత్వంగా స్వీకరిస్తుంది. కానీ ఆ తరం దేశాన్ని ఎలా వదిలి వెళ్తుందో నిర్ణయించేది విద్య. అందుకే విశ్వవిద్యాలయాలు కేవలం డిగ్రీలు అందించే విద్యాసంస్థలు మాత్రమే కావు... అవి కలలకు రూపమిస్తాయి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి, నాయకులను తీర్చిదిద్దుతాయి, తరాల భవిష్యత్తును మార్చేస్తాయి. ఈ రోజు కేవలం ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవం మాత్రమే కాదు... ఇది అవకాశాల, సమ్మిళిత అభివృద్ధి వేడుక. నాణ్యమైన విద్య దేశంలోని ప్రతి మూలకు, సమాజంలోని ప్రతి వర్గానికి చేరాలనే విశ్వాసానికి ప్రతీకగా నిలిచే వేడుక.అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే వికసిత్ భారత్ కల సాకారంఅన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే, అన్ని వర్గాలు భాగస్వామ్యం అయితేనే వికసిత్ భారత్ కల సాకారమవుతుందన్నారు.. గిరిజన ప్రాంతాల్లోని విశ్వవిద్యాలయాలు కేవలం విద్యా కేంద్రాలు మాత్రమే కావు... అవి సామాజిక పరివర్తనకు, సమాన అవకాశాలకు మార్గదర్శకాలు. ఒక కుటుంబంలో తొలి తరం విద్యార్థి పట్టభద్రుడైతే... ఆ కుటుంబం మొత్తం ముందుకు సాగుతుందన్నారు. దీంతో పాటు దేశం కూడా అభివృద్ధి చెందుతుంది. పరిశోధన, ఆవిష్కరణలు, అభివృద్ధి ద్వారా ప్రతి పౌరుడికి సాధికారత కల్పిస్తూ.. మన గొప్ప గిరిజన వారసత్వాన్ని కాపాడుకోవడమే వికసిత్ భారత్ స్ఫూర్తి. రాష్ట్రపతి గారి కంటే ముఖ్య అతిథి మరొకరు ఉండరుఈ రోజు మీరు మీ డిగ్రీలను అందుకుంటున్న ఈ వేళ.. మీ ముందున్న ముఖ్య అతిథిని ఒక్కసారి చూడాలని నేను కోరుతున్నా. గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవానికి మన రాష్ట్రపతి గారి కంటే మరింత అర్థవంతమైన ముఖ్య అతిథి మరెవరూ ఉండరు. ఆమె జీవితం స్వయంగా ఈ విశ్వవిద్యాలయం వంటి విద్యాసంస్థలు ఎందుకు అవసరమో చెప్పే అత్యుత్తమ సమాధానం. రాష్ట్రపతి గారు ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లాలో ఉన్న ఉపర్‌బేడా అనే చిన్న గిరిజన గ్రామంలో జన్మించారు. ఆ రోజుల్లో పాఠశాలకు చేరుకోవాలంటే ఎంతో దూరం నడిచి వెళ్లాల్సి వచ్చేది. గిరిజన బాలికలు ఉన్నత విద్యను అభ్యసించడం చాలా అరుదు. అయినప్పటికీ ఆమె తన గ్రామం నుంచి డిగ్రీ పూర్తి చేసిన తొలి మహిళగా నిలిచారు. ఆమె వేసిన ఆ ఒక్క అడుగు ఆమె భవిష్యత్తునే కాదు.. ఆమె తర్వాత వచ్చిన వేలాది గిరిజన బాలికల ఆశయాలను కూడా మార్చింది.స్వయంకృషితో రాష్ట్రపతిగా ఎదిగిన వ్యక్తి ద్రౌపది ముర్ము గారుప్రజా జీవితంలోకి ప్రవేశించే ముందు.. ఆమె రాయరంగ్‌పూర్‌లోని శ్రీ అరవిందో ఇంటిగ్రల్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో ఉపాధ్యాయురాలిగా సేవలందించారు. ఉపాధ్యాయ వృత్తి తనకు అత్యంత సంతృప్తిని ఇచ్చిందని, ప్రజా విధానాలను రూపొందించే ముందు విద్యార్థుల జీవితాలను మలిచే అవకాశం తనకు దక్కిందని ఆమె తరచూ చెబుతుంటారు. నాయకత్వం అనేది సేవతోనే ప్రారంభమవుతుందని ఇది మనకు గుర్తుచేస్తుంది. ఆమె ప్రజా జీవితం వారసత్వ ఆధారంగా వచ్చింది కాదు. రాయరంగ్‌పూర్ నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్‌లో కౌన్సిలర్‌గా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం వైస్ ఛైర్‌పర్సన్‌గా, ఎమ్మెల్యేగా, ఒడిశా రాష్ట్ర మంత్రిగా, జార్ఖండ్ గవర్నర్‌గా, చివరకు భారత రాష్ట్రపతిగా ఎదిగారు. ప్రజాసేవ ద్వారా ఒక్కో మెట్టు ఎక్కుతూ స్వయంకృషితో సాధించారు.సంకల్ప బలంతో ప్రజాసేవలోకి తిరిగొచ్చారుఅయితే రాష్ట్రపతి గారి ప్రయాణాన్ని అసాధారణంగా నిలబెట్టింది ఆమె అధిరోహించిన పదవులు మాత్రమే కాదు.. ఆమె జీవితంలో ఎదుర్కొన్న వ్యక్తిగత విషాదాలు కూడా. 2009 నుంచి 2014 మధ్య ఆమె తన పెద్ద కుమారుడు, చిన్న కుమారుడు, భర్త, తల్లి, సోదరుడిని కోల్పోయారు. అలాంటి దుఃఖాన్ని ఊహించడం కూడా మనలో చాలామందికి సాధ్యం కాదు. అయినప్పటికీ ఆమె నిరాశకు గురికాలేదు. ఆధ్యాత్మికతలో బలాన్ని వెతుక్కొని.. కొత్త సంకల్పంతో తిరిగి ప్రజాసేవలోకి వచ్చారని గుర్తు చేశారు. తన వ్యక్తిగత బాధను సమాజం పట్ల కరుణగా, సేవా సంకల్పంగా మలిచారు. 2022లో భారత రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం సందర్భంగా.. భారతదేశంలోని పేదలు కలలు కనడమే కాదు, ఆ కలలను నిజం చేసుకోగలరనే విషయానికి నా ఎన్నికే నిదర్శనం అని చెప్పారు. అవి కేవలం ప్రమాణ స్వీకార సభలో పలికిన మాటలు కావు. ఎన్నో ప్రతికూల పరిస్థితులను అధిగమిస్తూ సాగిన ఆమె జీవితానికి నిదర్శనంగా నిలిచాయి. నేడు ఒక గిరిజన చిన్నారి రాష్ట్రపతి భవన్‌ను చూసినప్పుడు.. అది ఇకపై తనకు దూరంగా ఉన్న ఒక అధికార సంస్థగా కనిపించదు. గ్రామీణ పాఠశాలలో చదివిన, ఉపాధ్యాయురాలిగా పనిచేసిన, గ్రామీణ మార్గాల్లో ప్రయాణించిన, జీవితంలో వ్యక్తిగత కష్టాలను ఎదుర్కొన్నప్పటికీ విద్య, ప్రజాస్వామ్యం, ప్రజాసేవలపై విశ్వాసాన్ని ఎన్నడూ కోల్పోని వ్యక్తి అక్కడ ఉన్నారనే స్ఫూర్తి కనిపిస్తుంది.ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే అసలైన విద్యఈ రోజు మీరు ఒక డిగ్రీని అందుకుంటున్నారు. కానీ రేపు జీవితం మిమ్మల్ని ఒక పెద్ద ప్రశ్న అడుగుతుంది. మీ వల్ల సమాజానికి ఎలాంటి మార్పు వచ్చిందని అడుగుతుంది. విద్య అసలు ఉద్దేశం కేవలం డిగ్రీ సంపాదించడం మాత్రమే కాదు... ప్రజల జీవితాలను మార్చే పరిష్కారాలను చూపడమే అసలైన విద్య. ప్రస్తుతం మనం ఏఐ యుగంలో జీవిస్తున్నాం. ఏఐ సమాధానాలను ఇవ్వగలదు. కానీ మానవీయ విలువలు, జిజ్ఞాస, కరుణ, వ్యక్తిత్వాన్ని ఎన్నటికీ భర్తీ చేయలేదు. ఈ విలువలు గొప్ప విశ్వవిద్యాలయాల్లోనే పెంపొందుతాయి. అవే గొప్ప వ్యక్తులను తీర్చిదిద్దుతాయి. అందుకే విశ్వవిద్యాలయాలు కేవలం నైపుణ్యం కలిగిన వృత్తి నిపుణులను మాత్రమే కాదు.. బాధ్యతాయుతమైన పౌరులను, మానవతా దృక్పథం కలిగిన నాయకులను, జీవితాంతం నేర్చుకునే వ్యక్తులను తయారు చేయాలి.విద్యార్థులను భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దుతాంప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు కలలుగన్న వికసిత్ భారత్ లో నాణ్యమైన విద్య, ఆవిష్కరణలు, పరిశోధనలు అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి కేంద్ర బిందువులుగా నిలుస్తాయి. ఉన్నత విద్యను మరింత బలోపేతం చేస్తూ.. భారత యువతకు మరిన్ని అవకాశాలను కల్పిస్తున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గారికి అభినందనలు. ఈ జాతీయ దార్శనికత నుంచి స్ఫూర్తి పొందుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ఏపీ ఉన్నత విద్యలో సమూల మార్పులు తీసుకువస్తున్నాం. జ్ఞానాన్ని సృష్టించే, ఆవిష్కరణలకు ప్రేరణనిచ్చే విద్యార్థులను కేవలం ఉద్యోగాలకే కాకుండా నాయకత్వానికి సిద్ధం చేసే విశ్వవిద్యాలయాలను నిర్మిస్తున్నాం. మా లక్ష్యం కేవలం డిగ్రీలు అందుకున్న విద్యార్థులను తయారు చేయడం కాదు... భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దడం. నాణ్యమైన అధ్యాపక బృందం, పరిశ్రమల అవసరాలకు అనుసంధానమైన నైపుణ్యాలు, పరిశోధన, ఆవిష్కరణల ద్వారా వేగంగా మారుతున్న ప్రపంచంలో ప్రతి విద్యార్థి విజయవంతం అయ్యేలా భవిష్యత్ విశ్వవిద్యాలయాలను నిర్మిస్తున్నాం. యువతలో ఆత్మవిశ్వాసం నెలకొల్పడమే లక్ష్యంమా లక్ష్యం సులభంగా ఉన్నప్పటికీ ఎంతో ఉన్నతమైంది. ప్రతి విద్యార్థి ఉపాధికి అర్హుడు కావాలి, ప్రతి విశ్వవిద్యాలయం ఆవిష్కరణలకు కేంద్రంగా మారాలి, ప్రతి పరిశోధకుడు సాధికారత పొందాలనేది మా లక్ష్యం. ముఖ్యంగా ప్రపంచంలోని అత్యుత్తమ ప్రతిభతో పోటీ పడగలమనే ఆత్మవిశ్వాసం ప్రతి యువతలో ఉండాలని మేం కోరుకుంటున్నాం. ఈ రోజు మీ తల్లిదండ్రులు మీ డిగ్రీని గర్వంగా ఫ్రేమ్ చేయించుకుంటారు. కానీ మీ నిర్ణయాలు, మీ విలువలు, సమాజానికి మీరు చేసిన సేవలనే జీవితం గుర్తుంచుకుంటుంది. మీ వల్ల ఎన్ని జీవితాలు మారాయి, ఎన్ని సమస్యలకు పరిష్కారాలు చూపించారు, ఎంతమందికి అవకాశాలు కల్పించారనేదే మీ విజయానికి ప్రామాణికం కావాలి. వ్యక్తిత్వాన్ని కాపాడుకోవాలిఇతరుల జీవితాలను మార్చగల శక్తిని మనకు ఇచ్చినప్పుడే విద్య పరమార్థం నెరవేరుతుంది. ఈ రోజు మీరు ఈ విశ్వవిద్యాలయం నుంచి బయటకు అడుగుపెడుతున్నప్పుడు... మీ జ్ఞానాన్ని ఆత్మవిశ్వాసంతో, మీ మూలాలను గర్వంతో, మీ విలువలను వినయంతో మీతో పాటు తీసుకెళ్లండి. డిగ్రీ మీకు ఒక వృత్తిని అందించవచ్చు... కానీ మీ వ్యక్తిత్వమే మీకు గౌరవాన్ని సంపాదించి పెడుతుంది. సమాజానికి మీరు చేసే సేవే మీకు చిరస్థాయిగా నిలిచిపోయే వారసత్వాన్ని అందిస్తుంది. మీ ప్రయాణం మరెందరో జీవితాలకు స్ఫూర్తిగా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని మంత్రి పేర్కొన్నారు. అంతకుముందు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బంగారు పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ మదన్ లాల్ మీనా, వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ టీ.శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేశ్‌పై కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రశంసల వర్షం

విజయనగరం : ఆంధ్రప్రదేశ్ విద్యారంగం అభివృద్ధికి, నూతన విద్యావిధానాల అమలుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధతో చేస్తున్న కృషి అభినందనీయమని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రశంసించారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు లోకేశ్ చూపిస్తున్న చొరవను ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. విజయనగరం జిల్లా భోగాపురంలోని పీఎంశ్రీ ఏపీ మోడల్ స్కూల్‌ను మంత్రి నారా లోకేశ్‌తో కలిసి ధర్మేంద్ర ప్రధాన్ సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా పాఠశాలలో అమలు చేస్తున్న ఆధునిక విద్యాబోధన పద్ధతులు, మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు.పాఠశాలకు చేరుకున్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సి. పార్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. విద్యార్థులు, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం మంత్రులు పాఠశాల ప్రాంగణమంతా కలియతిరిగారు.పర్యటనలో భాగంగా, విద్యాబోధనలో వినియోగిస్తున్న పలు ఆధునిక ఉపకరణాలను మంత్రులు పరిశీలించారు. ప్రాథమిక స్థాయి విద్యార్థుల కోసం రూపొందించిన 'జాదూ పిటారా' కిట్‌ను కేంద్ర మంత్రి ఆసక్తిగా గమనించగా, దాని పనితీరును మంత్రి లోకేశ్, సిబ్బంది వివరించారు. విద్యార్థుల ప్రగతిని నమోదు చేసే ప్రోగ్రెస్ కార్డులు, అసెస్‌మెంట్ బుక్‌లెట్లను లోకేశ్ కేంద్ర మంత్రికి చూపించారు. విలువలతో కూడిన విద్య కోసం ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలతో ముద్రించిన పుస్తకాల గురించి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్'లోని టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, యూనిఫాం, షూ, స్కూల్ బ్యాగ్ వంటి వస్తువులను ప్రధాన్ పరిశీలించారు.రాష్ట్ర విద్యాశాఖ పనితీరును పర్యవేక్షించేందుకు రూపొందించిన 'లీప్' డ్యాష్‌బోర్డును కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆసక్తిగా తిలకించారు. ఈ డ్యాష్‌బోర్డు ద్వారా విద్యార్థుల నమోదు, హాజరు, అభ్యసన ఫలితాలు, మధ్యాహ్న భోజన పథకం, డ్రాపౌట్లు, అధికారుల తనిఖీలు వంటి అనేక అంశాలను రియల్ టైంలో పర్యవేక్షించవచ్చని మంత్రి లోకేశ్ వివరించారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న స్మార్ట్ కిచెన్ల వ్యవస్థపై రూపొందించిన వీడియోను మంత్రులు వీక్షించారు. కడపలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన స్మార్ట్ కిచెన్ గురించి కేంద్ర మంత్రికి లోకేశ్ విశదీకరించారు. అనంతరం స్పోర్ట్స్ రూమ్, స్కిల్ ల్యాబ్‌లను సందర్శించి, అక్కడ విద్యార్థులు పైథాన్ లాంగ్వేజ్‌తో రూపొందించిన ఒక అప్లికేషన్‌ను పరిశీలించి అభినందించారు.అనంతరం మంత్రులిద్దరూ 9వ తరగతి గదికి వెళ్లి విద్యార్థుల మధ్య కూర్చున్నారు. 'ఫిజియోగ్రాఫిక్ డివిజన్ ఆఫ్ ఇండియా' అనే పాఠ్యాంశంపై రూపొందించిన క్లిక్కర్ వీడియోను వీక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి విద్యార్థులతో సరదాగా సంభాషించారు. చాణక్య అనే విద్యార్థిని "చాణక్యుడు కింగా? కింగ్ మేకరా?" అని ప్రశ్నించగా, ఆ విద్యార్థి 'కింగ్ మేకర్' అని చురుగ్గా సమాధానమిచ్చాడు. మరో విద్యార్థిని పాఠ్యాంశాల్లో సందేహాలు వస్తే ఎవరిని అడుగుతావని ప్రశ్నించగా, తన సోదరుడిని అడుగుతానని చెప్పాడు. ఈ నేపథ్యంలో, విద్యార్థుల సౌలభ్యం కోసం బైలింగ్యువల్ టెక్స్ట్ బుక్స్‌ను ప్రవేశపెట్టామని మంత్రి లోకేశ్ వివరించారు. విద్యార్థి స్థాయి ఆధారంగా బోధించే 'పాల్' ల్యాబ్‌ను కూడా మంత్రులు పరిశీలించారు. ఈ సందర్భంగా తమ పేర్లతో 3డీ ప్రింటింగ్‌తో రూపొందించిన బహుమతులను ఓ విద్యార్థి మంత్రులకు అందజేశాడుఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి, చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకట్రావు, జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, సమగ్ర శిక్ష ఎస్పీడీ బి. శ్రీనివాసరావు, ఇతర ఉన్నతాధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు

రాజ్యాంగ విలువలు,న్యాయపాలన పరిరక్షణలో జస్టిస్ రఘునందన్ రావు సేవలు చిరస్మరణీయం

అమరావతి : రాజ్యాంగ విలువలు, న్యాయపాలన పరిరక్షణలో జస్టిస్ రఘునందన్ రావు సేవలు చిరస్మరణీయం అని రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ అభినందించారు. హైకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందిస్తున్న జస్టిస్ రఘునందన్ రావు పదవీ విరమణ సందర్భంగా హైకోర్టు మొదటి కోర్టు హాల్లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం జరిగింది.ఈ వీడ్కోలు కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ మాట్లాడుతూ జస్టిస్ రఘునందన్ రావు న్యాయ ప్రస్థానం, న్యాయపరమైన నిష్పాక్షికత, రాజ్యాంగ విలువల పట్ల అచంచల నిబద్ధత, న్యాయవ్యవస్థ ఆధునీకరణలో ఆయన చేసిన విశిష్ట కృషిని కొనియాడారు.న్యాయవాదిగా విశేష అనుభవాన్ని సంపాదించిన తదుపరి న్యాయమూర్తిగా ధర్మాసనాన్ని అలంకరించి రాజ్యాంగ స్ఫూర్తిని, న్యాయపాలనను అత్యున్నత ప్రమాణాలతో పరిరక్షించారని ఆమె పేర్కొన్నారు.రాజ్యాంగపరమైన అంశాలు, సంక్లిష్టమైన సివిల్ వివాదాలు, పన్నుల సంబంధిత కేసులు, ప్రజాప్రయోజన వ్యాజ్యాలు వంటి అనేక కీలక అంశాల్లో ఆయన వెలువరించిన తీర్పులు న్యాయవ్యవస్థకు మార్గదర్శకంగా నిలుస్తాయని జస్టిస్ లిసా గిల్ పేర్కొన్నారు. తన పదవీకాలంలో సుమారు 25 వేల కేసులను వేగవంతంగా, సమర్థవంతంగా పరిష్కరించడం ద్వారా జస్టిస్ రఘునందన్ రావు న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేశారని ఆమె పేర్కొన్నారు.న్యాయపరమైన బాధ్యతలతో పాటు పరిపాలనా వ్యవహారాల్లోనూ ఆయన అసాధారణ నాయకత్వాన్ని ప్రదర్శించారని, న్యాయస్థానాల మౌలిక సదుపాయాల అభివృద్ధి, సమాచార సాంకేతికత వినియోగం, న్యాయ ప్రక్రియల డిజిటలైజేషన్, న్యాయసేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో ఆయన చేసిన సేవలు చిరస్మర ణీయమని కొనియాడారు.పరిపాలనా కమిటీ, మౌలిక సదుపాయాల అభివృద్ధి కమిటీ, నియామకాలు, బదిలీలు, న్యాయస్థానాల కంప్యూటరీకరణ,ఆర్థిక వ్యవహారాలు, హైకోర్టు పరిపాలన తదితర కీలక కమిటీలలో ఆయన పోషించిన పాత్ర ఆంధ్రప్రదేశ్ న్యాయవ్యవస్థ అభివృద్ధికి బలమైన పునాదులు వేసిందని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు.ఈ సందర్భంగా అడిషినల్ సోలిసిటర్ జనరల్ చల్లా ధనుంజయ్,అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రభునాథ్ వాసిరెడ్డి,ఏపీ బార్ కౌన్సిల్ ఛైర్మన్ ద్వారకానాథ్ రెడ్డి తదితరులు జస్టిస్ రఘునందనరావుకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలుపుతూ తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో హైకోర్టు ఫుల్ బెంచ్ న్యాయమూర్తులు,బార్ కౌన్సిల్ ప్రతినిధులు, హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, న్యాయాధికారులు, రిజిస్ట్రార్లు,న్యాయశాఖ అధికారులు,న్యాయవాదులు పాల్గొన్నారు.

భారీగా తగ్గిన ముడిచమురు ధర

కానీ తగ్గని పెట్రోల్, డీజిల్ రేట్లు.. కారణమిదే!

ముంబై : పశ్చిమాసియాలో సంక్షోభం మొదలైన తర్వాత మొట్టమొదటిసారిగా భారత్ దిగుమతి చేసుకునే ముడిచమురు సగటు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల కంటే దిగువకు పడిపోయింది. అయితే, ఈ తగ్గుదల ప్రయోజనం దేశంలోని వినియోగదారులకు వెంటనే అందే అవకాశం కనిపించడం లేదు. గతంలో ఎదుర్కొన్న భారీ నష్టాలను చమురు మార్కెటింగ్ కంపెనీలు పూడ్చుకోవడానికి ప్రయత్నించడం, వినియోగదారులను ఆదుకునేందుకు ప్రభుత్వం భరించిన ఆర్థిక వ్యయంలో కొంత భాగాన్ని రాబట్టుకోవాలని భావిస్తుండటమే ఇందుకు ప్రధాన కారణాలుగా తెలుస్తోంది.నిన్నటికి భారత క్రూడ్ ఆయిల్ బాస్కెట్ సగటు ధర బ్యారెల్‌కు 68.86 డాలర్లకు తగ్గింది. పశ్చిమాసియాలో ఫిబ్రవరి 28న ఘర్షణలు మొదలైన తర్వాత మార్చి 23న గరిష్ఠంగా 157.04 డాలర్లకు చేరిన ధరతో పోలిస్తే ఇది 56 శాతం కంటే ఎక్కువ తగ్గుదల. ఈ పరిణామం ప్రభుత్వ రంగంలోని చమురు సంస్థలకు కొంత ఊరటనిచ్చింది. ప్రస్తుతం ఈ కంపెనీలు పెట్రోల్‌పై లీటర్‌కు రూ. 5 నుంచి రూ. 6 వరకు లాభం పొందుతున్నప్పటికీ, డీజిల్ అమ్మకాలపై మాత్రం లీటర్‌కు రూ.8 నుంచి రూ. 10 వరకు నష్టపోతూనే ఉన్నాయి. ఈ అంశంపై ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం స్పందించలేదు.సంక్షోభ సమయంలో అంతర్జాతీయంగా ధరలు పెరగడంతో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను స్థిరంగా ఉంచడం వల్ల చమురు కంపెనీలు భారీ నష్టాలను చవిచూశాయి.

ఒక దశలో పెట్రోల్‌పై లీటర్‌కు రూ. 26, డీజిల్‌పై రూ. 81.90 నష్టం వచ్చింది. దీంతో మార్చి 27న కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటర్‌కు రూ. 10 చొప్పున తగ్గించింది. అయినప్పటికీ నష్టాలు కొనసాగడంతో మే 15 నుంచి మే 25 మధ్య చమురు కంపెనీలు పెట్రోల్‌పై రూ. 7.35, డీజిల్‌పై రూ. 7.53 చొప్పున ధరలను పెంచాయి.జూన్ మధ్యలో అమెరికా–ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరే అవకాశాలు, సంక్షోభాన్ని ముగించే దిశగా అవగాహన ఒప్పందం కుదరడంతో చమురు ధరలు శాంతించడం ప్రారంభించాయి. కీలకమైన హర్మూజ్ జలసంధి నుంచి రవాణా పునఃప్రారంభం కావడంతో ధరలు మరింత తగ్గుముఖం పట్టాయి. ఈ పరిణామాలపై పెట్రోలియం శాఖ మంత్రిహర్దీప్ సింగ్ పూరి 'ఎక్స్' వేదికగా స్పందించారు.

జిల్లా ఎస్పీని కలిసిన మాజీ ఎంపీ భరత్

వైసీపీ బీసీ నేత పీతా రామకృష్ణపై పీడీ యాక్ట్ ఉపసంహరించాలని వినతి

రాజమహేంద్రవరం: వైఎస్సార్సీపీ నగర బీసీ నాయకుడు పీతా రామకృష్ణపై పోలీసులు నమోదు చేసిన పీడీ యాక్ట్‌ను ఉపసంహరించాలని మాజీ ఎంపీ, వైఎస్సార్సీపీ జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్‌ను కోరారు. ఈ మేరకు ఎస్పీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ, రామకృష్ణ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ అధికార పార్టీ అన్యాయాలను ప్రశ్నిస్తున్నందుకే లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. ఆయనపై 12 కేసులు నమోదు చేసి రౌడీ షీట్ తెరిచారని, హైకోర్టును ఆశ్రయించగా 10 కేసులు కొట్టివేయబడ్డాయని, కేవలం రెండు కేసులు మాత్రమే మిగిలాయని తెలిపారు.మిగిలిన కేసులను ఆధారంగా చేసుకుని ఎమ్మెల్యే ఒత్తిడితో పోలీసులు వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. నగరంలోని 40వ వార్డులో అధికార పార్టీకి చెందిన వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒక వర్గానికి చెందిన వారికి గాయాలయ్యాయని, బాధితుల ఫిర్యాదుపై న్యాయం చేయకుండా తిరిగి వారిపైనే కేసులు నమోదు చేశారని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిపక్ష వైసీపీ నేతలను నగరంలో తిరగనివ్వమంటూ అధికార పార్టీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు శాంతిభద్రతల సమస్యకు దారితీస్తున్నాయని భరత్ పేర్కొన్నారు. ఇటీవల శెట్టిబలిజ సంఘీయులు వాసంశెట్టి గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్

సెంచరీతో చెలరేగిన నిహాల్ రెడ్డి.. సౌత్ సెంట్రల్ రైల్వే 305 పరుగులు

సికింద్రాబాద్:జులై 26:ప్రజాకలం ప్రతినిధి

హైదరాబాద్‌లోని స్పోర్ట్‌లైట్ క్రికెట్ గ్రౌండ్స్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జట్ల మధ్య జరుగుతున్న రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లో హైదరాబాద్ ఆటగాడు నిహాల్ రెడ్డి శతకంతో మెరిశాడు. నిహాల్ రెడ్డికి తోడు గుగులోత్ చంటి శ్రీ అర్ధసెంచరీతో రాణించడంతో, మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన సౌత్ సెంట్రల్ రైల్వే జట్టు 305 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ మ్యాచ్‌లో అద్భుత బ్యాటింగ్ నైపుణ్యాన్ని ప్రదర్శించిన నిహాల్ రెడ్డి 117 బంతుల్లో 3 సిక్సర్లు, 10 ఫోర్ల సాయంతో 111 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. మైదానంలో నలువైపులా పరుగుల వర్షం కురిపిస్తూ బాధ్యతాయుత మైన ఆటతీరుతో జట్టుకు భారీ స్కోరు అందించడంలో కీలక పాత్ర పోషించాడు. మరొకవైపు గుగులోత్ చంటి 60 బంతుల్లోనే 9 ఫోర్లతో ధాటిగా ఆడి వేగవంతమైన అర్ధసెంచరీ సాధించాడు.యువ క్రీడాకారులు రాణించడం తో జట్టు గెలిపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు..

ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి - రోజాదేవి

కూకట్ పల్లి, జులై 26, ప్రజా కలం ప్రతినిధి:

కూకట్‌పల్లి ఎమ్మెల్యే, శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ మాధవరం కృష్ణారావు సూచనల మేరకు ఆదివారం ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని రిక్షా పుల్లర్స్ కాలనీ, రామకృష్ణ నగర్, వెంకటేశ్వర్ నగర్ (33, 34, 35 బ్లాక్‌లు), మాధవరం నగర్ కాలనీ, నాగార్జున స్కూల్ మరియు కమల ప్రసన్న నగర్ బూత్‌లను (ఏ ఈ ఆర్ ఓ) అసిస్టెంట్ ఎలక్ట్రోల్ రిజిట్రేషన్ ఆఫీసర్ వహీద్ అలీ తో కలిసి పరిశీలించిన మాజీ కార్పొరేటర్ శ్రీమతి మాధవరం రోజా దేవి రంగారావు. ఈ సందర్భంగా

రోజా దేవి మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరికి తన ఓటు హక్కు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అర్హులైన వారి పేర్లు నమోదు చేయడం, తప్పులు సరిచేయడం, అవసరమైన మార్పులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా ప్రజలు కూడా ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటరు వివరాలను ఒకసారి పరిశీలించి ఏవైనా లోపాలు ఉంటే వెంటనే సంబంధిత బూత్ లెవల అధికారులను సంప్రదించి సరిచేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర రావు, మాచర్ల భద్రయ్య, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, జగదీష్ గౌడ్, రవీందర్ రావు, ప్రవీణ్, బాబు, మధు, కొండల్ రావు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ ఇంటర్నేషనల్ 320 బి అధ్యక్షులు గా శైలజా నాయర్

-లయన్స్ ఇంటర్నేషనల్ 320 బి డిస్ట్రిక్ట్ సేవలు అభినందనీయం
-బాధ్యతలు చేపట్టిన 320 బి జిల్లా నూతన కమిటీ
-ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా అవంతి రెడ్డి
-సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా చల్లా శ్రీనివాస్ రెడ్డి

కూకట్ పల్లి, జులై 26, ప్రజా కలం ప్రతినిధి:

లయన్స్ ఇంటర్నేషనల్ లో 320 బి డిస్ట్రిక్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అన్ని క్లబ్ లకు ఆదర్శంగా ఉంటాయని పి ఐ డి లయన్ డాక్టర్ ఘట్టమనేని బాబురావు అన్నారు. 320 బి డిస్ట్రిక్ట్ 11వ క్యాబినెట్ ఇన్స్టాలేషన్ కార్యక్రమం కొంపల్లి లోని ఓ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా 320 బి నూతన గవర్నర్ శైలజ నాయర్, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా అవంతి రెడ్డి, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చల్లా శ్రీనివాస్ రెడ్డి లతో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పి ఐ డి లయన్ డాక్టర్ ఘట్టమనేని బాబురావు మాట్లాడుతూ జిల్లా గవర్నర్ గా బాధ్యతలు చేపట్టిన శైలజ నాయర్ పట్టుదలతో పని చేసే వ్యక్తిత్వం గల వారిని అన్నారు. ఆమె మార్గదర్శకంలో జిల్లాలోని క్లబ్బులు మరింత చురుకుగా సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నేత్రదానం ఆవిష్కృతను గుర్తు చేస్తూ ప్రత్యేక పోస్టర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్స్టలేషన్ చైర్మన్ హలోక్ కుమార్ జ, డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్లు సెల్వ సాయిరాంరాజు, రాజేంద్రప్రసాద్, ఎస్ ఎన్ రెడ్డి, దీపక్ భట్టాచార్య, విద్యాసాగర్ రావు, విజయ్ కుమార్ శెట్టి, మోహన్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ హేమల్ కన్వీద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సేవలకు జాతీయ గుర్తింపు

-గాదె నరేందర్ రెడ్డికి జాతీయ కార్మిక రత్న అవార్డు

యాదాద్రి జూలై 26 ప్రజాకలం:

యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమ కారులు, కార్మిక నాయకుడు,బీఆర్ఎస్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదె నరేందర్ రెడ్డికి జాతీయ కార్మిక రత్న అవార్డు ప్రదానం చేశారు.హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో ఉన్న పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన 19వ జాతీయ వెస్ట్రన్ ఇండియా కాన్ఫరెన్స్ సందర్భంగా ఈ అవార్డును అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,బహుజన సాహిత్య అకాడమీ

జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ కలిసి గాదె నరేందర్ రెడ్డికి జాతీయ కార్మిక రత్న అవార్డును ప్రదానం చేశారు.ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమం,అభివృద్ధి కోసం గత అనేక సంవత్సరాలుగా గాదె నరేందర్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని,తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలోనూ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన సేవలను గుర్తించి బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్మిక రత్న అవార్డుతో సత్కరించడం అభినందనీయమని అన్నారు.అవార్డు అందుకున్న అనంతరం గాదె నరేందర్ రెడ్డి మాట్లాడుతూ,కార్మికుల హక్కులు,సంక్షేమం కోసం తాను చేసిన సేవలను గుర్తించి ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుతో సత్కరించిన రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు, బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.భవిష్యత్తులో కూడా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్టీఐ కమిషనర్ భూపాల్,ఆరు రాష్ట్రాల బహుజన సాహిత్య అకాడమీ అధ్యక్షులు,వివిధ సంఘాల ప్రతినిధులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ నిఘాతో దక్షిణ మధ్య రైల్వే భద్రత మరింత పటిష్ఠం

కొమర వెల్లి కొత్త రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక పర్యవేక్షణ

సిద్దిపేట జిల్లా ప్రతినిధి:
26 జూలై 2026 (ప్రజా కలం ప్రతినిధి)

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ప్రయాణికుల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) ఆధునిక డ్రోన్ సర్వైలెన్స్ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగిస్తోంది.రైల్వే స్టేషన్లు, ట్రాక్‌లు, యార్డులు తదితర కీలక ప్రాంతాలపై డ్రోన్‌ల ద్వారా నిరంతర నిఘా నిర్వహిస్తూ భద్రతను మరింత పటిష్ఠం చేస్తోంది. హైదరాబాద్ డివిజన్‌లో మహిళా ఆర్‌పీఎఫ్ సిబ్బందితో ఏర్పాటు చేసిన “పింక్ పట్రోల్” ప్రత్యేక డ్రోన్ బృందం ఎంఎంటీఎస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, ట్రాక్‌ల వద్ద పర్యవేక్షణ చేపట్టి ప్రయాణికుల రక్షణకు సేవలందిస్తోంది.డ్రోన్ సర్వైలెన్స్ ద్వారా అనుమానాస్పద వ్యక్తులు,చోరీలు,విధ్వంసక చర్యలను

ముందుగానే గుర్తించి అధికారులను అప్రమత్తం చేయడం,భారీ రద్దీ,వండుగలు,ప్రత్యేక కార్యక్రమాల సమయంలో భద్రతను పర్యవేక్షించడం, అత్యవసర పరిస్థితుల్లో రియల్‌టైమ్ వీడియోను అందించి ఆర్‌పీఎఫ్ బృందాలు వేగంగా స్పందించేలా సహకరించడం వంటి బాధ్యతలను ఈ బృందం నిర్వహిస్తోంది. హైదరాబాద్ డివిజన్ సీనియర్ డీఎస్సీ దేబస్మిత సి. బెనర్జీ పర్యవేక్షణలో ఎస్ఐ/ఆర్‌పీఎఫ్ చందిని,మహిళా కానిస్టేబుళ్లు సంకీర్తన,సౌజన్య, హిందూ, డి.అరుణ, జె.అరుణ,అలాగే ప్రవీణ్, షముద్దీన్‌లతో కూడిన పింక్ పట్రోల్ బృందం కొమరవల్లి పుణ్యక్షేత్రం కొత్త రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవం సందర్భంగా డ్రోన్‌ల నిఘాయంతో రాళ్ల దాడులు, ఇతర అవాంఛనీయ సంఘటనలను నివారించేందుకు ప్రత్యేక నిఘా నిర్వహించింది.

డ్రోన్ సాంకేతికత వినియోగంతో రైల్వే భద్రత మరింత సమర్థవంతంగా మారడంతో పాటు, ప్రమాదాలు మరియు అవాంఛనీయ ఘటనలను ముందుగానే గుర్తించి నివారించే అవకాశాలు గణనీయంగా పెరుగుతున్నాయని రైల్వే అధికారులు తెలిపారు.

కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి

సిద్దిపేట--మనోహరాబాద్ మార్గంలో భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి:
26 జూలై 2026 (ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్‌ను కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి శనివారం ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కేంద్ర హోం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్,హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ,రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి,మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు,ఎమ్మెల్సీలు పింగిలి శ్రీపాల్ రెడ్డి మరియు సి.అంజి రెడ్డి,జనగామ ఎమ్మెల్యే డాక్టర్ వల్లా రాజేశ్వర్ రెడ్డి,స్థానిక ప్రజాప్రతినిధులు,అలాగే దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమం ప్రారంభానికి ముందు కార్గిల్ అమర వీరులకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాల పాటు

మౌనం పాటించారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు ప్రసంగిస్తూ, మనోహరాబాద్--సిద్దిపేట మార్గంలో సుమారు రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ కొత్త రైల్వే స్టేషన్ కొమురవెల్లి మల్లన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ, కొమురవెల్లి స్టేషన్ ప్రారంభం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. సికింద్రాబాద్ స్టేషన్ ఆధునీకరణ, హైదరాబాద్, కాచిగూడ, కాజీపేట, వరంగల్ స్టేషన్ల పునరాభివృద్ధి, కొత్త రైల్వే మార్గాలు, డబ్లింగ్, మూడవ లైన్ పనులు, 5 వందే భారత్ మరియు 6 అమృత్ భారత్ రైళ్ల ప్రవేశం, అలాగే తెలంగాణకు 3 హై-స్పీడ్ రైలు ప్రాజెక్టులు మంజూరు చేయడం రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. కొమురవెల్లి స్టేషన్ నుంచి ఆలయానికి షటిల్ బస్సు సేవలు తక్షణమే ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఎస్సీఆర్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ, కొత్త స్టేషన్‌లో వెయిటింగ్ హాల్, ప్లాట్‌ఫాం షెల్టర్లు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు వంటి ఆధునిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. ఇవి ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందిస్తాయని ఆయన పేర్కొన్నారు.

గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌లో మళ్లీ పందుల సంచారం..

- పట్టణ ప్రజలు ఆందోళన -14, 15వ వార్డుల్లో మళ్లీ దర్శనమిస్తున్న పందులు

-తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి

గజ్వేల్: 26 జూలై 2026 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 14, 15వ వార్డుల్లో గత కొన్ని రోజులుగా పందుల సంచారం విపరీతంగా పెరిగిపోయి, స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. వార్డుల్లో పదుల సంఖ్యలో పందులు స్వేచ్ఛగా తిరుగుతుండటంతో అపరిశుభ్రత పెరిగిపోవడమే కాకుండా, రాత్రి సమయంలో రోడ్లపై వెళ్లే వాహనదారులకు, స్థానికులకు ప్రమాదకరంగా పరిణమించాయి. సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పందుల పెంపకాన్ని ఊరి చివర లేదా జనావాసాలకు దూరంగా ఉండే ప్రాంతాలలో మాత్రమే చేపడతారు. కానీ, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ లాంటి మున్సిపాలిటీలో మాత్రం నివాస గృహాలు ఉన్న వార్డుల్లోనే పందులు సంచరిస్తుండటం విడ్డూరంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందనే భయం ప్రజలను వెంటాడుతోంది. గతంలో కూడా ఈ సమస్యపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, కొద్ది రోజులు మాత్రమే కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి, ఆ తర్వాత మళ్లీ పట్టించుకోవడం లేదని వార్డు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి, నివాస ప్రాంతాల్లో తిరుగుతున్న పందులను వెంటనే మున్సిపల్ పరిధి దాటించి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని 14, 15వ వార్డుల ప్రజలు కోరుతున్నారు.

నవంబర్‌లో సీఐఐ సదస్సు

విశాఖపట్టణం : ఆంధ్రప్రదేశ్‌కు భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, నాలెడ్జ్ హబ్‌గా మార్చేందుకు కూటమి ప్రభుత్వం సరికొత్త పంథాను ఎంచుకుంది. వచ్చే నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నం వేదికగా ప్రతిష్టాత్మక 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026 నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సన్నాహక సమీక్షా సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. ఈ సదస్సును గతానికి భిన్నంగా, వినూత్నంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈసారి భాగస్వామ్య సదస్సు కేవలం విశాఖపట్నానికే పరిమితం కాకుండా.. రాష్ట్రంలోని ఐదు ప్రధాన నగరాలైన విశాఖ, రాజమండ్రి లేదా కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతిలలో ప్రాంతీయ భాగస్వామ్య సదస్సులునిర్వహించాలని సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. కేవలం ఎంఓయూలు , పెట్టుబడుల సంతకాలే ధ్యేయం కాకుండా.. అంతర్జాతీయ స్థాయి జ్ఞానాన్ని పంచుకోవడం మీద ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. ఈ సదస్సుల ద్వారా యువతలో సరికొత్త ఆలోచనలను రేకెత్తించాలని, టెక్నాలజీ రంగంలో గ్లోబల్ ఛాంపియన్లుగా ఎదిగేలా గైడెన్స్ ఇవ్వాలని సూచించారు. విదేశీ ప్రతినిధులతో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ఈ సదస్సుకు ఆహ్వానించనున్నట్లు తెలిపారు. ప్రాంతీయ స్థాయిలో నిర్వహించే ఈ సదస్సులలో స్టార్టప్ కంపెనీలకు, సరికొత్త ఆవిష్కరణలకు అగ్రతాంబూలం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆలోచనలకు ఈ వేదికలు ఊతమివ్వాలని..నేటి తరం యువత భాగస్వామ్యాన్ని ఇందులో భారీగా పెంచాలని సూచించారు. ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్‌ను ప్రపంచవ్యాప్తంగా ప్రమోట్ చేసేందుకు జూలై నుంచి సెప్టెంబర్ వరకు దేశ, విదేశాల్లో భారీగా రోడ్ షోలు నిర్వహించనున్నారు. దేశీయంగా ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, ముంబై, కోయంబత్తూర్, అహ్మదాబాద్, హైదరాబాద్ వంటి నగరాల్లో రోడ్ షోలు నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఏయే ప్రాంతాల్లో ఏయే రంగాల పరిశ్రమలకు అనుకూలమైన అవకాశాలు ఉన్నాయో ముందే బేరీజు వేసుకుని.. ఆయా ప్రాంతీయ సదస్సులలోనే నిర్దిష్టమైన ఎంఓయూలు కుదుర్చుకునేలా ఏర్పాట్లు చేయాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. అలాగే, అమరావతిలో 'సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్'ను కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం ఈ సందర్భంగా వెల్లడించారు.పారిశ్రామిక ప్రగతితో పాటు పబ్లిక్ పాలసీలు, భవిష్యత్ ఫ్యూచరిస్టిక్ రంగాలపై ఈ సదస్సులో కీలక చర్చలు జరగాలని చంద్రబాబు ఆకాంక్షించారు. కేవలం పరిశ్రమలే కాకుండా వ్యవసాయం, ఉద్యానవన రంగం, ప్రకృతి వ్యవసాయం, సర్క్యులర్ ఎకానమీ మరియు నేటి కార్పొరేట్ ప్రపంచానికి అవసరమైన 'స్ట్రెస్ ఫ్రీ వర్క్' వంటి వినూత్న అంశాలపై గ్లోబల్ నిపుణులు, ప్రముఖ యూనివర్సిటీల ప్రొఫెసర్లు చర్చించేలా ప్లాన్ చేయాలన్నారు.

వైసీపీ బలమైన స్థానాలే టార్గెట్

విశాఖపట్టణం : అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ పోటీ రోజురోజుకు మరింత ఆసక్తికరంగా మారుతోంది. ముఖ్యంగా వచ్చే ఆంధ్రప్రదేశ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి పార్టీ తమ బలహీన, బలమైన ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి పెడుతోంది. ఈ క్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలమైన నియోజకవర్గంగా భావించే అరకు ఇప్పుడు జనసేన పార్టీ వ్యూహాల్లో కీలక స్థానం సంపాదించిందనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.అరకు ప్రాంతంలో గత కొన్నేళ్లుగా వైసీపీకి బలమైన మద్దతు ఉంది. గిరిజన ఓటర్లలో ఆ పార్టీకి మంచి పట్టుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఇప్పుడు అదే ప్రాంతంలో తన బలాన్ని పెంచుకోవాలని జనసేన భావిస్తున్నట్లు సమాచారం. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించడం, స్థానిక సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై ఆ పార్టీ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా పార్టీ విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అరకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం పొందుతోంది. కూటమి రాజకీయాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి నియోజకవర్గంలో బలమైన నిర్మాణం అవసరమని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. అందుకే స్థానిక కార్యకర్తలను మరింత చురుకుగా పనిచేయాలని సూచనలు ఇస్తున్నారని చెబుతున్నారుఅరకు పార్లమెంట్ పరిధిలో గిరిజన సమస్యలు, రహదారులు, విద్య, వైద్యం, ఉపాధి వంటి అంశాలు ఎప్పుడూ ప్రధాన చర్చగా ఉంటాయి. ఈ సమస్యల పరిష్కారంపై ప్రజల్లో విశ్వాసం కల్పించగలిగితే రాజకీయంగా ప్రయోజనం ఉంటుందని జనసేన అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం ద్వారా తమ ప్రభావాన్ని పెంచుకోవాలని పార్టీ ప్రయత్నాలు చేస్తోందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.ఇక వైసీపీ కూడా తన బలమైన ఓటు బ్యాంకును నిలబెట్టుకోవడానికి కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో లభించిన మద్దతును కొనసాగించేందుకు స్థానిక నాయకులు ప్రజలతో మరింత మమేకం అవుతున్నారని సమాచారం. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా తమ ఆధిక్యాన్ని కొనసాగించాలని ఆ పార్టీ ప్రయత్నిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.రానున్న ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అరకు రాజకీయాలు మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధాన పార్టీలతో పాటు కూటమి వ్యూహాలు కూడా ఈ ప్రాంత ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలు చూస్తే అరకు నియోజకవర్గంలో పోటీ గతంతో పోలిస్తే మరింత ఉత్కంఠభరితంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.అయితే అభ్యర్థుల ఎంపిక, స్థానిక సమీకరణాలు, ఎన్నికల నాటికి మారే రాజకీయ పరిస్థితులు కూడా ఫలితాలపై ప్రభావం చూపే అంశాలుగా ఉంటాయి. అందుకే ఇప్పటి నుంచే అన్ని పార్టీలు తమ తమ వ్యూహాలను అమలు చేస్తూ ప్రజల్లో పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్నాయి. అరకు వంటి కీలక ప్రాంతాల్లో రాజకీయ పోటీ మరింత ఆసక్తికరంగా మారుతుండటంతో రానున్న రోజుల్లో అక్కడి పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కూడా ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఆ 10 మంది ఎమ్మెల్యేలపై టీడీపీ సైలెంట్ యాక్షన్

విజయవాడ : ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటింది. అధికార తెలుగుదేశం పార్టీ లో అంతర్గత క్రమశిక్షణపై ఆ పార్టీ హైకమాండ్ అత్యంత కఠినమైన వైఖరిని అవలంబిస్తోంది. ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచిన ఉత్సాహంలో కొందరు ఎమ్మెల్యేలు రూట్ మారుస్తూ, పార్టీ గీసిన లక్ష్మణ రేఖను దాటుతుండటంపై అధినేత నారా చంద్రబాబు నాయుడు సీరియస్ యాక్షన్‌కు దిగినట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా వివాదాస్పద వ్యాఖ్యలు, సొంత క్యాడర్‌తో విభేదాలు, పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తున్న కొందరు శాసనసభ్యులను హెచ్చరించడం మానేసి.. నేరుగా దూరం పెట్టే వ్యూహాన్ని టీడీపీ అమలు చేస్తోంది. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మొదటి నుండి తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ప్రదర్శిస్తూ వచ్చారు. అయితే, ఇటీవల కాలంలో ఆయన పార్టీ హైకమాండ్ నిర్ణయాలను బహిరంగంగానే ధిక్కరిస్తూ, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సోషల్ మీడియా వేదికగా అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. పార్టీ అధిష్ఠానం పలుమార్లు అంతర్గతంగా హెచ్చరించినప్పటికీ ఆయన తన వైఖరిని మార్చుకోలేదు. దీంతో టీడీపీ అగ్రనాయకత్వం ఆయనను పూర్తిగా పక్కనబెట్టేసింది. ప్రభుత్వ కార్యక్రమాల పర్యవేక్షణను ఇప్పటికే ఇతర నేతలు చూస్తున్నారు. ఆయనను కేవలం పేరుకే ఎమ్మెల్యే అన్నట్లుగా మార్చేసింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటి వారికైనా ఇదే గతి పడుతుందనేందుకు కొలికపూడి ఎపిసోడ్ ఒక ఉదాహరణగా నిలిచింది.మరోవైపు సత్యవేడు ఎమ్మెల్యే కోనేరు ఆదిమూలం ప్రవర్తన కూడా పార్టీకి పెద్ద తలనొప్పిగా మారింది. మహిళతో వివాదాస్పదంగా ప్రవర్తించి వార్తల్లోకి ఎక్కిన ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. ఆ వివాదం సెటిల్ చేసుకున్నా ఆయనను పార్టీలో కలుపుకోలేదు. అందుకే ఆయన కుమారుడు ఇటీవల ప్రెస్మీట్ పెట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు.అయినా టీడీపీ హైకమాండ్ పట్టించుకోవడం లేదు. సత్యవేడులో క్షేత్రస్థాయిలో తెలుగుదేశం పార్టీని నమ్ముకున్న పాత కార్యకర్తలు సైతం ఆయనను ఓన్ చేసుకోవడం లేదు. ఈ విషయాన్ని ఇంటెలిజెన్స్ నివేదికల ద్వారా, సోషల్ మీడియా ఫీడ్‌బ్యాక్ ద్వారా గ్రహించిన చంద్రబాబు.. సత్యవేడులో ఎమ్మెల్యే ప్రమేయం లేకుండానే పనులు జరిగేలా ఒక ప్రత్యేక యంత్రాంగాన్ని రంగంలోకి దించారు. తద్వారా క్యాడర్‌ను కాపాడుకుంటూనే, ఎమ్మెల్యేకు గట్టి షాక్ ఇచ్చారు. వలం ఈ ఇద్దరే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు పది మందికి పైగా ఎమ్మెల్యేల జాబితాను పార్టీ ఇంటెలిజెన్స్ వింగ్ సిద్ధం చేసింది. అధికారం అండతో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించడం, ఇసుక, భూ దందాల్లో తలదూర్చడం, కూటమిలోని భాగస్వామ్య పక్షాలైన జనసేన, బీజేపీ నేతలతో సత్సంబంధాలు కొనసాగించకుండా వివాదాలు కొనితెచ్చుకోవడం వంటి నెగెటివ్ రిపోర్ట్స్ ఉన్న నేతలందరినీ ఈ లిస్టులో చేర్చారు. వీరిలో కొందరు ఉత్తరాంధ్ర, మరికొందరు రాయలసీమ ప్రాంతాలకు చెందిన వారు కూడా ఉన్నట్లుగా చెబుతున్నారు. గతంలో 2014-19 మధ్య కాలంలో కొందరు ఎమ్మెల్యేల మితిమీరిన ప్రవర్తన వల్లే పార్టీ 23 సీట్లకు పడిపోయిందనే చేదు నిజాన్ని చంద్రబాబు నాయుడు ఎప్పటికీ మర్చిపోలేదు. అందుకే, ఈసారి 135 కి పైగా సీట్ల భారీ మెజారిటీ ఉండటంతో.. ఒకరిద్దరు లేదా పది మంది ఎమ్మెల్యేలు దూరమైనా ప్రభుత్వానికి వచ్చే ముప్పేమీ లేదనే ధీమాతో హైకమాండ్ ఉంది. వ్యవస్థ ముఖ్యం, ప్రజల్లో పార్టీ ఇమేజ్ ముఖ్యం.. అంతేకానీ దారి తప్పిన ఎమ్మెల్యేల కోసం పార్టీ ప్రతిష్టను పణంగా పెట్టలేం అని లోకేష్, చంద్రబాబు ఇద్దరూ అంతర్గత సమావేశాల్లో తెగేసి చెప్పారు. మారమని హెచ్చరించడం కంటే, వారిని పక్కనబెట్టి ప్రత్యామ్నాయ నేతలను తయారు చేయడం ద్వారా సదరు ఎమ్మెల్యేల పొగరు దించే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు.టీడీపీ హైకమాండ్ తీసుకుంటున్న ఈ నిశ్శబ్ద అడుగులు.. సదరు వివాదాస్పద ఎమ్మెల్యేలకు భవిష్యత్తుపై పెద్ద హెచ్చరికగా మారాయి. ప్రస్తుతం వీరిని దూరం పెట్టడం అంటే.. వచ్చే ఎన్నికల్లో వీరికి టికెట్లు దక్కే ప్రసక్తే లేదనే సంకేతాన్ని క్యాడర్‌కు బలంగా పంపడమే. సోషల్ మీడియాలో కూడా ఈ ఐసోలేషన్ స్ట్రాటజీపై సామాన్య కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాయకులు తప్పు చేస్తే వెనకేసుకొచ్చే పాత రోజులు పోయాయని, పద్ధతి మార్చుకోకపోతే ఎంతటి సీనియర్ అయినా మాజీ అవ్వక తప్పదని టీడీపీ పంపుతున్న ఈ స్ట్రాంగ్ మెసేజ్.. మిగిలిన ఎమ్మెల్యేలను కూడా దారిలోకి తెస్తుందని భావిస్తున్నారు.

పెద్దిరెడ్డి, చెవిరెడ్డిలతో నెగ్గేదెలా?

తిరుపతి : వైసీపీ అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఆ పార్టీ బలం పుంజుకుంటున్నట్లు చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయి. ముఖ్యంగా సీనియర్ల మధ్య పెద్ద వైరం నడుస్తున్నట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం ఉంది. ముఖ్యంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఇద్దరు నేతల మధ్య ఇప్పుడు విభేదాలు పతాక స్థాయికి చేరినట్లు టాక్ నడుస్తోంది. జగన్మోహన్ రెడ్డి ఆ ఇద్దరు నేతల విషయంలో ఎటు తేల్చుకోలేకపోతున్నట్లు తాడేపల్లి వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి చిత్తూరు అంటేనే ముందుగా గుర్తొచ్చేది పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. మొన్నటి ఎన్నికల్లో ఆ జిల్లా నుంచి పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులు గెలిచారు. అదే సమయంలో రోజాతో పాటు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి లాంటి వారు ఓడిపోయారు. అయితే అధికారంలో ఉన్నప్పుడు పెద్దిరెడ్డి మాట నడిచేది చిత్తూరు జిల్లాలో. రాయలసీమలో సైతం ఆయన హవా ఉండేది. అటువంటిది ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత.. పెద్దిరెడ్డి కి వ్యతిరేకంగా చెవిరెడ్డి పావులు కదుపుతున్నట్లు ప్రచారంలో ఉంది.వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు పెద్దిరెడ్డి హవా అంతా ఇంతా కాదు. ఏకంగా కుప్పంలో చంద్రబాబును, హిందూపురంలో బాలకృష్ణను ఓడించేందుకు ఆయన చేయని ప్రయత్నం అంటూ లేదు. అదే సమయంలో సొంత పార్టీ వారు సైతం ఆయన కనుసన్నల్లో ఉండాల్సిందే. లేకుంటే ఇబ్బందికర పరిస్థితులు తప్పేవి కావు. అందుకే అప్పట్లో ఆర్కే రోజాతో పాటు చెవిరెడ్డి లాంటివారు పెద్దిరెడ్డి విషయంలో చాలా గౌరవభావంతో ఉండేవారు. దానికి ప్రధాన కారణం భయం.

అయితే ఇప్పుడు వైసీపీ ఓడిపోయిన తర్వాత పెద్దిరెడ్డి విషయంలో వైసీపీ నేతల తీరు మారింది.ప్రధానంగా ఇప్పుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తీవ్రంగా విభేదిస్తున్నట్లు తెలుస్తోంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పెద్దిరెడ్డి రాయలసీమను చూసేవారు. ఆయన కుమారుడు మిథున్ రెడ్డి జగన్మోహన్ రెడ్డి వెంట నిత్యం తాడేపల్లి కార్యాలయంలోనే ఉండేవారు. కానీ ఇప్పుడు మద్యం కుంభకోణం కేసు పుణ్యమా అని జగన్మోహన్ రెడ్డి విషయంలో పెద్దిరెడ్డి వైఖరి మారినట్లు ప్రచారంలో ఉంది. అదే సమయంలో తాడేపల్లి లో చేరారు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి. పెద్దిరెడ్డి ఫ్యామిలీ విషయంలో జగన్ చెవిరెడ్డి ఇస్తున్న సమాచారాన్ని నమ్ముతున్నారని పొలిటికల్ వర్గాల్లో ఒక ప్రచారం సాగుతోంది. దీంతో ఆ ఇద్దరు నేతల మధ్య విభేదాలు పతాక స్థాయికి చేరాయని.. ఆ ఇద్దరు నేతలను సర్ది చెప్పలేక జగన్మోహన్ రెడ్డి బాధపడుతున్నట్లు ప్రచారంలో ఉంది. మరి ఇందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

జడ శ్రావణ్ తో జాగ్రత్త పడుతున్న జగన్!

విజయవాడ : ఏపీ రాజకీయాల్లో కుల ప్రభావం అధికంగా ఉంటుంది. కులాల వారీగా ఓట్లు చీలిపోతాయి కూడా. అలా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రెడ్డి సామాజిక వర్గం అండ ఉంటుంది. మరోవైపు దళిత క్రైస్తవ ఓటర్లు కూడా అటువైపే మొగ్గు చూపుతారు. మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణ పరాజయం చవిచూసింది. కానీ దళిత క్రైస్తవులు మాత్రం ఆ పార్టీని ఆదరించారు. అయితే ఆ ఓటు బ్యాంకు పై తాజాగా గురి పెట్టారు జడ శ్రవణ్ కుమార్. గోదావరి జిల్లాలో దళిత క్రైస్తవ సభ పెట్టి.. మీరంతా జడ శ్రావణ్ తాలూకా అని చెప్పే రోజు వస్తుందని వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ మాదిరిగా ఈ రాష్ట్రానికి డిప్యూటీ సీఎం అవుతానని కూడా తేల్చి చెప్పారు. పనిలో పనిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై కూడా సున్నిత విమర్శలు చేశారు. దీంతో ఆ పార్టీలో అంతర్మథనం ప్రారంభం అయ్యింది.కూటమి ప్రభుత్వంపై బురదజల్లేందుకు జడ శ్రావణ్ కుమార్ సేవలను వాడుకోవాలని చూసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.. సాక్షి మీడియాలో ఆయన ప్రెస్మీట్లకు ఎనలేని ప్రాధాన్యం దక్కుతూ వస్తోంది. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు తో పాటు ప్రభుత్వాన్ని ఇరుక్కున పెట్టేలా జడ శ్రావణ్ కుమార్ వ్యాఖ్యలు నడిచేవి. ఒక్క మాటలో చెప్పాలంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ శ్రావణ్ కుమార్ ను ఒక అస్త్రంగా మార్చుకోవాలని చూసింది. కానీ ఇప్పుడు అదే జడ శ్రవణ్ నేరుగా జగన్మోహన్ రెడ్డికి అత్యంత కీలకమైన దళిత క్రైస్తవ ఓటు బ్యాంకుకే ఎసరు పెట్టేలా ఉన్నారు. ఏలూరులో దళిత క్రైస్తవ సమర శంఖారావం బహిరంగ సభ నిర్వహించారు. అయితే ఇది కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన సభ. కానీ వైసీపీని ఉలిక్కిపడేలా చేసేసారు శ్రావణ్ కుమార్.ఆకివీడు ఘటన నేపథ్యంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు క్రైస్తవ మతాన్ని కించపరిచారని ప్రధాన అజెండాతో ఈ సభ నడిచింది. రఘురామకృష్ణం రాజును తీవ్రస్థాయిలో టార్గెట్ చేసిన జడ శ్రావణ్ కుమార్ ఈ సభ ద్వారా దళిత క్రైస్తవులను ఒక తాటిపైకి తెచ్చే ప్రయత్నం చేశారు. తనను తాను అభినవ అంబేద్కర్ గా చూపించే ప్రయత్నం చేశారు. కేవలం వేదికలపై ఉపన్యాసాలకే పరిమితం కాకుండా.. ఇకపై రాష్ట్రంలోని దళిత

క్రైస్తవులంతా జడ శ్రావణ్ తాలూకా అని గర్వంగా చెప్పుకోవాలి అంటూ ఇచ్చిన పిలుపు వైసిపిలో సంచలనంగా మారుతుంది. ఆ పార్టీ నేతలు ఇప్పుడు శ్రావణ్ కుమార్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ పార్టీ ఓటు బ్యాంకు పైనే గురి పెడతారా అని ప్రశ్నిస్తున్నారు. తాము మీడియా మైలేజ్ ఇస్తూ.. పరోక్షంగా పాలు పోసి పెంచిన జడ శ్రావణ్.. ఇప్పుడు సొంత సామాజిక వర్గాలను చీల్చే ప్రయత్నం చేస్తుండడం పై వైసీపీ నేతలు తలలు పట్టుకుంటున్నారు.జడ శ్రావణ్ కుమార్ నేరుగా ఈసారి తాను ఉప ముఖ్యమంత్రిని అవుతానని చెబుతున్నారు. అయితే అది ఎలా సాధ్యమో తెలియడం లేదు. కానీ అనవసరంగా జడ శ్రవణ్ కుమార్ ను హైలెట్ చేశామని వైసిపి నేతలు బాధపడుతున్నారు. ఇప్పుడు ఈ అంశంతో కూటమికి ప్రయోజనం చేకూర్చేలా ఉంది పరిస్థితి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకులో చీలిక వస్తే ఆ పార్టీకి దారుణ పరాజయం తప్పదు.. జడ శ్రావణ్ నిజంగా దళిత క్రైస్తవ ఓట్లను టార్గెట్ చేసుకుంటే ప్రతి నియోజకవర్గంలో వేలాది ఓట్లకు గండి పడవచ్చు వైసీపీకి. కూటమిని దెబ్బతీయడానికి వాడిన అస్త్రం ఇప్పుడు రివర్స్ తిరిగి జగన్ సొంత సామ్రాజ్యాన్ని దెబ్బతీసేలా ఉంది.

కలకలం రేపుతున్న కుట్ర ఆరోపణలు

చెన్నై : ఏప్రిల్‌లో జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో దళపతి విజయ్ నేతృత్వంలోని టీవీకే 108 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. వివిధ పార్టీల మద్దతుతో ఆయన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు. అయితే, సర్కారు ఏర్పడిన రెండు నెలల్లోనే ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర జరిగిందనే వార్త సంచలనంగా మారింది. టీవీకే పార్టీకి చెందిన 15 మంది ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టే ప్రయత్నాలు చేశారనేది ప్రధాన ఆరోపణ. టీవీకే ఎమ్మెల్యే ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేసి.. ముగ్గుర్ని అరెస్ట్ చేశారు.తమిళనాడు రాజకీయాల్లో సంచలన పరిణామం చోటుచేసుకుంది. దళపతి జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం సర్కారును కూల్చేందుకు చేసిన కుట్రను తమిళనాడు నిఘా, పోలీస్ యంత్రాంగం భగ్నం చేసింది. టీవీకేకు చెందిన 15 మంది ఎమ్మెల్యేలతో బేరసారాలు సాగించి, వారిని ప్రలోభపెట్టిన ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ ఉన్నతాధికారితో పాటు ముగ్గుర్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు 15 మంది టీవీకే ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించడానికి కుట్ర జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి.టీవీకే ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ చేపట్టి ఓ కన్సల్టెన్సీ సంస్థ ఉద్యోగిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో డీఎంకే ఎమ్మెల్యే, మాజీ మంత్రి సెంథిల్ బాలాజీకి సంబంధాలున్నట్లు అధికారులు గుర్తించారు. ఆ తర్వాత మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. చెన్నైలో ఒకర్ని అరెస్టు చేయగా, మిగతా ఇద్దరిని కరూర్‌లో అదుపులోకి తీసుకున్నారు. కుట్ర, దాని విస్తృత నెట్‌వర్క్‌పై అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు.ఉత్తంగరై టీవీకే ఎమ్మెల్యే ఎన్ ఎలయరాజా చెన్నై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ కేసు వెలుగులోకి వచ్చింది. తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌పై అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా కన్సల్టెన్సీ సంస్థ ఐపీడీఎస్‌కు చెందిన ఓ వ్యక్తి తనకు రూ.35 కోట్లు ఇచ్చారని ఆయన ఆరోపించారు. తర్వాత తనను బెదిరించారని, దీనిపై ఎవరితోనూ చర్చించవద్దని చెప్పారని ఎమ్మెల్యే ఆరోపించారు. అరెస్టైన ముగ్గురిలో ఒకరు సెంథిల్ బాలాజీ, అతడి సోదరుడు అశోక్‌కు సన్నిహితుడని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.ఈ పరిణామానికి ముందు డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ మాట్లాడుతూ.. "త్వరలోనే టీవీకే ప్రభుత్వం కూలిపోతుందని, తమిళనాడులో ముందస్తు ఎన్నికలు రావడం ఖాయం" అంటూ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. డీఎంకే వ్యూహాత్మకంగానే విజయ్ ప్రభుత్వంపై కుట్రకు తెరలేపిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఈ వ్యవహారంపై అధికార టీవీకే, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. తమిళనాడు మంత్రి సీటీ నిర్మల్‌కుమార్ డీఎంకేపై విరుచుకుపడ్డారు. "సెంథిల్ బాలాజీతో నేరుగా సంబంధం ఉన్న వ్యక్తులు, అలాగే 'కరూర్ గ్యాంగ్'కు ఇందులో ప్రత్యక్ష పాత్ర ఉంది... పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.. ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరినీ అరెస్టు చేయాలి. ఇలాంటి నీచ కార్యకలాపాలకు ముగింపు పలకాలి"అని కుమార్ అన్నారు.తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామితో డీఎంకే కుమ్మక్కయ్యిందని మంత్రి ఆరోపించారు.

పలువురు టీవీకే ఎమ్మెల్యేలకు ఫిరాయింపుల కోసం డబ్బులు ఆఫర్ చేశారని ఆరోపించారు. "ఈపీఎస్ తదితరులు దొంగదారిన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారు... ఈరోజు దాని స్వరూపాన్ని మనం చూస్తున్నాం. ఎంకే స్టాలిన్, ఉదయనిధి ఆదేశాల మేరకు సెంథిల్ బాలాజీ వంటి డీఎంకే కీలక వ్యక్తులు మా ఎమ్మెల్యేలను సంప్రదిస్తున్నారు.

వారికి రూ.10 కోట్లు, 20 కోట్లు ఇస్తామని ఆఫర్ చేశారు" అని మంత్రి కుమార్ మండిపడ్డారు.అయితే, ఈ ఆరోపణలను డీఎంకే తోసిపుచ్చింది. టీవీకే కట్టుకథలు అల్లుతోందని ఎదురుదాడి చేసింది. దర్యాప్తు వివరాలను టీవీకే లీక్ చేసిందని డీఎంకే ఆరోపించింది. "కేవలం దర్యాప్తు వివరాలను లీక్ చేయడం ద్వారా ప్రజల్లో ఒక అభిప్రాయాన్ని సృష్టించాలని భావిస్తుంది.

శంకుస్థాపనలతో సరా.. 19 ఏళ్లలో మూడోసారి

కడప : వైఎస్సార్ కడప జిల్లా ప్రజల దశాబ్దాల కల అయిన కడప స్టీల్ ప్లాంట్ మరోసారి వార్తల్లోకి వచ్చింది. జూలై 3న ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ శంకుస్థాపన చేసేందుకు సిద్ధమవుతోంది. అయితే, 2007 నుంచి ఇప్పటివరకు వరుసగా వచ్చిన ముఖ్యమంత్రులంతా శంకుస్థాపనల మీద శంకుస్థాపనలు చేస్తూనే ఉన్నా.. క్షేత్రస్థాయిలో ఒక్క ఇటుక కూడా పడకపోవడంపై రాయలసీమ వాసుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ సారి వేయబోయే పునాది రాయి అయినా ప్రాజెక్టు పూర్తికి దారితీస్తుందా.. లేక గత చరిత్ర పునరావృతమవుతుందా? అన్న సంశయాలు వ్యక్తమవుతున్నాయి.ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం కడపలో స్టీల్ ప్లాంట్ నిర్మించాల్సిన పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. కానీ, విభజన జరిగి పన్నెండేళ్లు గడుస్తున్నా.. ప్రత్యేక హోదా, ఇతర విభజన హామీలతో పాటు కడప స్టీల్ ప్లాంట్‌పై కేంద్రం ఇచ్చిన మాటను పూర్తిగా విస్మరించిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు రాబట్టడంలో రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు విఫలమయ్యాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం చేతులెత్తేయడంతో, రాష్ట్ర ప్రభుత్వమే ఈ భారీ ప్రాజెక్టును మోయాల్సి వస్తోంది. దీంతో రాష్ట్ర ఖజానాపై వేల కోట్ల రూపాయల అదనపు భారం పడుతోంది.కడప స్టీల్ ప్లాంట్ చరిత్రను గమనిస్తే.. ఇదొక శంకుస్థాపనల రికార్డుగా నిలిచిపోతుంది. 2007లో వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో జమ్మలమడుగు వద్ద మొదటిసారి శంకుస్థాపన చేశారు. అది ముందుకు సాగలేదు. విభజన తర్వాత 2018లో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు సున్నిపెంట వద్ద శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం మారిన వెంటనే 2019 డిసెంబర్‌లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కడప స్టీల్ ప్లాంట్‌కు మూడోసారి పునాది రాయి వేశారు.ఆయా కంపెనీల బోర్డులు మారడం, శంకుస్థాపనల శిలాఫలకాలు పడటమే తప్ప ప్రాజెక్టు మాత్రం అంగుళం కూడా ముందుకు కదలలేదు. కడప స్టీల్ ప్లాంట్ విషయంలో ప్రభుత్వాల చిత్తశుద్ధిపై ప్రతిపక్షాలు మరియు ప్రజాసంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. రాష్ట్రంలోకి వచ్చే ప్రైవేట్ స్టీల్ ప్రాజెక్టులకు మరియు ఇతర పారిశ్రామిక దిగ్గజాలకు వేల కోట్ల రూపాయల విలువైన భూములు, విద్యుత్, నీటి రాయితీలను గుమ్మరిస్తున్న పాలకులు..

అమరావతి వర్సెస్ మావిగన్

బాబుది 'రెడ్ బుక్' అరాచక రాజ్యాంగం

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్వహించిన ప్రెస్ మీట్‌లో సరికొత్త అజెండాను ప్రకటించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆయన ఏపీ రాజధానిగా చంద్రబాబు ప్రతిపాదిస్తున్న అమరావతిని మరోసారి తిరస్కరించారు. తాము తెచ్చి మావిగన్ కారిడార్ అభివృద్ధి ప్రతిపాదనకే తమ పార్టీ సంపూర్ణంగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల సమరం ప్రధానంగా మావిగన్ వర్సెస్ అమరావతి మధ్యే ఉంటుందని, ఈ రెండు రాజధాని నమూనాలలో ప్రజల మద్దతు దేనికి ఉందో వచ్చే ఎన్నికల్లోనే తేలిపోతుందని జగన్ సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ మావిగన్ కారిడార్ ప్రతిపాదనను అధికారికంగా చేరుస్తామని ఆయన వెల్లడించారు.'జగన్ అమరావతికి వ్యతిరేకం' అంటూ కొందరు కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని వైఎస్ జగన్ మండిపడ్డారు. తాను అమరావతి ప్రాంతానికి గానీ, అక్కడి రైతులకు గానీ వ్యతిరేకం కాదని క్లారిటీ ఇచ్చారు. అమరావతి పేరుతో సీఎం చంద్రబాబు నాయుడు సాగిస్తున్న వేల కోట్ల రూపాయల రియల్ ఎస్టేట్ స్కామ్‌లను, అవినీతిని మాత్రమే తాను ప్రశ్నిస్తున్నానని చెప్పారు. శూన్యం నుండి అమరావతిని నిర్మించడానికి లక్షల కోట్లు ఖర్చు చేయడం రాష్ట్ర భవిష్యత్తును భ్రమల్లో నెట్టడమేనని విమర్శించారు. దానికి బదులుగా.. ఇప్పటికే ఎయిర్‌పోర్ట్, పోర్టు, జాతీయ రహదారుల వంటి మౌలిక సదుపాయాలు ఉన్న 110 కిలోమీటర్ల 'మావిగన్' ప్రాంతాన్ని రాజధాని కారిడార్‌గా మార్చడమే అత్యంత ఆచరణాత్మకమైన పరిష్కారమని, అవినీతి లేని రాజధాని కావాలనేదే తన ఆకాంక్ష అని జగన్ వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. కూటమి ప్రభుత్వం 'హాఎఖీ' పేరుతో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఓట్లను వ్యవస్థాగతంగా తొలగించే పెద్ద కుట్ర చేస్తోందన్నారు. ఓట్లను తొలగిస్తే భవిష్యత్తులో ప్రజలకు సంక్షేమ పథకాలు ఎలా వస్తాయి? అసలు ఓట్లు తీసేసి చివరికి ఈ రాష్ట్రంలో పౌరులకు సిటిజన్‌షిప్ కూడా లేకుండా చేస్తారా?" అని జగన్ నిలదీశారు. క్షేత్రస్థాయిలో ఎన్యుమరేషన్ ఫామ్స్ ఇవ్వకుండానే, ఇచ్చినట్లు రాయాలంటూ చంద్రబాబు అధికారులను ఆదేశిస్తున్నారని, ప్రతి పోలింగ్ బూత్‌లో 40 నుండి 50 వైసీపీ ఓట్లను తొలగించాలని చూస్తున్నారని, దీనిపై తమ క్యాడర్ గట్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ఆర్థిక, వ్యవసాయ పరిస్థితులపై జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో ఏ పంటకూ కనీస గిట్టుబాటు ధర లేదని విమర్శించారు. అసెంబ్లీలో మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టినా ధరల స్థిరీకరణ నిధికి అరకొర నిధులే కేటాయించారని ఎద్దేవా చేశారు. "రైతులు పంట పండిస్తే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్న గ్యారంటీ కూడా లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో పొగాకు రైతులు రోడ్డెక్కుతున్నారు, ఆక్వా రైతులు మద్దతు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మా హయాంలో తెచ్చిన 'అప్సడా' చట్టాన్ని పక్కనబెట్టి ఫీడ్ సిండికేట్లకు బాబు కొమ్ముకాస్తున్నారు" అని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారుతమ ఐదేళ్ల హయాంలో రాష్ట్రంలో నిరంతరం విద్యా, వైద్యం, ఆర్బీకేలు, పేదల సంక్షేమం గురించి చర్చ జరిగేదని.. కానీ చంద్రబాబు సీఎంగా వచ్చాక రాష్ట్రంలో కేవలం రెడ్ బుక్ రాజ్యాంగం , కస్టోడియల్ డెత్స్ మీదనే చర్చ జరుగుతోందని జగన్ దుయ్యబట్టారు. విజయవాడ పరిధిలో జరిగిన సాయికృష్ణ, క్రాంతికుమార్ మరణాల కేసుల్లో నిజాలను కప్పిపుచ్చడానికి కృష్ణలంక పీఎస్ సీసీటీవీ ఫుటేజీలను డిలీట్ చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా పూర్తిగా పక్కకుపోయి, 'రూల్ ఆఫ్ ఫియర్' రాజ్యమేలుతోందని, సాధారణ ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితులు వచ్చాయని జగన్ ఘాటుగా విమర్శించారు. చంద్రబాబు చేస్తున్న టాపిక్ డైవర్షన్లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. వీకెండ్ వచ్చింది అంటే చాలా ఎక్కడ టూర్ ప్లాన్ చేద్దామనే ఆలోచన చాలా మందిలో ఉంటుంది. ఇందులో ఎక్కువ మంది బీచ్‌ను ప్రిఫర్ చేస్తారు. అందుకే టూర్ ప్లాన్ వచ్చింది అంటే చాలా మొదట గుర్తుకు వచ్చేది గోవానే. అలాంటి పరిస్థితి లేకుండా మన దగ్గర కూడా అలాంటి ఫెసిలిటీస్‌తో బీచ్‌వ్యూ ఎంజాయ్ చేస్తూ చిల్ అవ్వొచ్చని ప్రభుత్వం చెబుతోంది. అందుకే తీరంలో బీచ్ షాక్స్ పేరుతో సరికొత్త టూరిజం డెస్టినేషన్ ఏర్పాటు చేస్తున్నారు. టూరిజం పాలసీని తీసుకొస్తూ ఏపీ బీచ్‌లలో తాత్కాలిక షాక్స్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనిపై పొలిటికల్ సర్కిల్స్‌లో మాత్రం తీవ్ర స్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. వైజాగ్ సంస్కృతి నాశనం చేస్తున్నారని జగన్ లాంటి వారంతా దుమ్మెత్తి పోస్తున్నారు.

సింపుల్‌గా చెప్పాలంటే బీచ్ షాక్స్ అంటే సముద్ర తీరంలో పర్యాటకుల కోసం తాత్కాలికంగా నిర్మించే ఎకో ఫ్రెండ్లీ రెస్టారెంట్లు, కేఫ్‌లు. ఇవి సిమెంట్, ఇటుకలతో కాకుండా కోస్టల్ రెగ్యులేషన్ జోన్ నిబంధనలకు లోబడి వెదురు, కలప, తాటి ఆకులు, కాన్వాస్ క్లాత్‌లతో డిజైన్ చేస్తారు. గోవా, కేరళ వంటి అంతర్జాతీయ పర్యాటక ప్రాంతాల్లో ఈ షాక్స్ అత్యంత ప్రజాదరణ పొందాయి. పర్యాటకులు ఇసుక తిన్నెలపై ఏర్పాటు చేసే సన్‌బెడ్స్, గొడుగుల కింద రిలాక్స్ అవుతూ, సముద్రపు గాలిని ఆస్వాదిస్తూ స్థానిక ఆహారాన్ని ఎంజాయ్ చేయడానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తాయి. పర్యాటక రంగంలో రెవెన్యూ జనరేట్ చేయడానికి, విదేశీ టూరిస్టులను ఆకర్షించడానికి ఇవి ఒక పవర్‌ఫుల్ టూల్‌గా ఉపయోగపడతాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రీసెంట్‌గా అధికారికంగా గెజిట్ విడుదల చేస్తూ జీవో నెంబ్ 362 ద్వారా కొన్ని రూల్స్ పెట్టింది. దీని ప్రకారం టూరిజం ప్రమోషన్ కోసం ప్రాథమికంగా మూడేళ్ల కాలానికి లైసెన్సు ముంజూరు చేస్తారు. మొదటి విడతలో భాగంగా కేవలం బాపట్లలోని సూర్యలంక బీచ్, విశాఖ బీచ్‌లలో మాత్రమే వీటిని ప్రయోగాత్మకంగా అనుమతి ఇస్తారు. ప్రతి షాక్ సుమారు వెయ్యి నుంచి 1500 వందల చదరపు అడుగుల వైశ్యాల్యంలో, సరైన కిచెన్, ఫెన్సింగ్, శానిటేన్ సౌకర్యాలతో ఉండాలి.

ఈ షాక్స్‌లో కేవలం తక్కువ ఆల్కాహోలిక్ బెవరేజెస్ అంటే బీర్ వైన్, రెడీ టు డ్రింక్ పానీయాలు మాత్రమే సర్వ్ చేయడానికి అనుమతి ఉంటుంది. ఎలాంటి హార్డ్ లిక్కర్ విక్రయించడానికి లేదు. మద్యపాన సేవలు ఉదయం పది గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయి. అయితే ఆహార సేవలు రాత్రివేళల్లో కూడా కొనసాగించవచ్చు. మూడు సంవత్సరాల కోసం ప్రాథమిక అప్లికేషన్ ఫీజు రెండు లక్షల రూపాయలు, సైలెన్స్ కోసం పదివేల రూపాయలు చెల్లించాలి. మొదటి సంవత్సరానికి వార్షిక రిటైల్ ఎక్సైజ్ టాక్స్ ఏడు లక్షల 50 వేల రూపాయలు ఉంటుంది. దీన్ని ఏటా పది శాతం పెంచుతుంటారు.ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో మండిపడుతోంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విమర్శల దాడి చేశారు. టూరిజం నెపంతో ఆంధ్రప్రదేశ్‌ను క్రమంగా లిక్కర్ హబ్‌గా మారుస్తున్నారని, పవిత్రమైన విశాఖను మందుబాబులు అడ్డాగా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సముద్ర తీరాల్లో బహిరంగంగా మద్యం విక్రయాలు జరపడం వల్ల లా అండ్ ఆర్డర్ సమస్యలు వస్తాయని, వైజాగ్ బీచ్ రోడ్డుకు వచ్చే ఫ్యామిలీస్, మహిళల భద్రత గాలిలో కలుస్తుందని ఆరోపించారు. 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం వైజాగ్‌లో బీచ్ లవ్ ఫెస్టివల్ పెట్టాలని చూస్తే మహిళా సంఘాలు అడ్డుకున్న విషయాన్ని వైసీపీ గుర్తు చేస్తుంది. "బీచ్‌షాక్స్ పేరుతో తీరంలో మద్యం అమ్మితే కుటుంబంతో మొత్తం కలిసి బీచ్‌కు ఎలా వెళ్తారు. దీని వల్ల బహిరంగ ప్రదేశాలు విశ్రాంతి కోసం వెళ్లే ఫ్యామిలీలు ఆలోచించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. " అని జగన్ విమర్శించారు. వైజాగ్ ఒక అంతర్జాతీయ ఐటీ పర్యాటక నగరంగా ఎదుగుతోందని ఇక్కడికి వచ్చే టూరిస్టులకు కనీస వినోద సౌకర్యాలు లేకపోవడం వల్ల రాష్ట్ర రెవెన్యూ గోవా, కేరళ వంటి పొరుగు రాష్ట్రాలకు తరలిపోతుందని నేతలు అంటున్నారు. బీచ్ షాక్స్ చుట్టూ లాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉండేందుకు సీసీటీవీ సర్వైలెన్స్, స్పెషల్ పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు హోంమంత్రి అనిత హామీ ఇచ్చారు. పర్యావరణవేత్తల ఆందోళన పరిగణలోకి తీసుకొని సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించడంతోపాటు శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ పద్ధతులను అమలు చేయాలని యాజమానులకు ఆదేశాలు జారీ చేశారు.

మావిగన్ అంటూ వెళ్తే సున్నాకే పరిమితం

అమరావతి: వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రాజధానుల పేరుతో ఎన్నికలకు వెళ్తే వైసీపీకి 11 సీట్లు వచ్చాయని.. ఇప్పుడు మావిగన్ అనే పిచ్చిచేష్టలతో ఎన్నికలకు వెళ్తే సున్నాకే పరిమితం అవుతారంటూ వ్యాఖ్యానించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేయాలనే లక్ష్యంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మూడు రాజధానుల పేరుతో ఒక్క ఇటుక కూడా పెట్టకుండా.. రూ.450 కోట్లు ఖర్చుపెట్టి తన కోసం ప్యాలెస్ నిర్మించుకున్నారని ఆరోపించారు. అమరావతి నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చూసి ఓర్చుకోలేక జగన్ విషం కక్కారని మంత్రి వ్యాఖ్యానించారు. అమరావతిపై తనకు ఎటువంటి వ్యతిరేకతలేదని.. 33000 ఎకరాలు కావాలని చెప్పిన వ్యక్తి జగన్ అని గుర్తుచేశారు. అమరావతిలోనే ఇల్లు కట్టుకున్నానని ఆనాడు ప్రజల్ని నమ్మించారన్నారు. అందుకే ప్రజలు బుద్ధి చెప్పి వైసీపీని 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు సాధించేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలూ కష్టపడుతున్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.

నా వెంట నడిచిన వారిని ఎప్పటికీ మరిచిపోను: మంత్రి లోకేశ్

అమరావతి : తన యువగళం పాదయాత్రలో వెంట నడిచిన తెలుగుదేశం కార్యకర్తలను ఎప్పటికీ మరిచిపోనని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. తిరుపతిలో జరిగిన కమ్మ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను లోకేశ్ ఆశీర్వదించారు. కార్యక్రమంలో యువగళం బృంద సభ్యులను ఆప్యాయంగా పలకరించిన ఆయన, పాదయాత్ర రోజుల జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. సుమారు 15 నిమిషాల పాటు కార్యకర్తలతో లోకేశ్ ముచ్చటించారు. యువగళం విజయవంతం కావడంలో టీడీపీ కేడర్ పాత్ర కీలకమని ప్రశంసించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఎదురైన అణచివేతలు, ఇబ్బందులను ధైర్యంగా ఎదుర్కొని పాదయాత్రను విజయవంతం చేసిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. 'కార్యకర్తే అధినేత' అనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ కేడర్ సాధికారతకు నిరంతరం కృషి చేస్తున్నామని లోకేశ్ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని లోకేశ్ పేర్కొన్నారు. ఏపీలో 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా చర్యలు చేపట్టామని తెలిపారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా జాబ్ క్యాలెండర్ విడుదల, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, కానిస్టేబుల్ నియామకాలు వంటి అంశాల్లో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివరించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా యువగళం ద్వారా ఏర్పడిన బంధం శాశ్వతమని, కార్యకర్తలతో తన అనుబంధం ఎప్పటికీ కొనసాగుతుందని మరోసారి స్పష్టం చేశారు. మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపగా, యువగళం పాదయాత్రతో ఏర్పడిన అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

ఎవరైనా పచ్చగా ఉంటే చూడలేని మనస్తత్వం జగన్‌ది

కృష్ణా జిల్లా: వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొల్లు రవీంద్ర ఫైర్ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎలా ముందుకు తీసుకెళ్లాలా అని చూస్తుంటే, జగన్ మాత్రం అభివృద్ధిని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆగ్రహించారు. రాష్ట్రాభివృద్ధి కోసం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చంద్రబాబు ముందుకెళ్తుంటే, జగన్ కుట్రపూరితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సైకో ఆలోచనలు కలిగిన వ్యక్తి ఏ విధంగా ఉంటాడనే దానికి జగన్ మాట్లాడిన మాటలే నిదర్శనమన్నారు. జగన్ కాసేపు అమరావతే రాజధాని అని అంటారని.. మరికాసేపు 'లేదు, మా స్టాండ్ మావిగన్' అని మాట్లాడతారని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఫ్యాన్ పార్టీ అధినేత ఆలోచనా విధానాలు ఏ విధంగా ఉన్నాయో అందరూ గమనించాలని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ముందేమో వారిది అమరావతి స్టాండ్ అని చెప్పారన్నారు. ఎన్నికల ముందు, గెలిచిన తర్వాత మూడు రాజధానుల పేరిట ఆటలాడారని మండిపడ్డారు. మూడు రాజధానులని చెప్పి ఎన్నికల్లోకి వెళ్లగా, ప్రజలు 11 సీట్లకే ఆయనను పరిమితం చేశారని అన్నారు. ఈ రోజు మళ్లీ వచ్చి 'మావిగన్' అని మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎవరైనా పచ్చగా ఉంటే చూడలేని మనస్తత్వం ఉన్నవాడినే సైకో అంటారని పేర్కొన్నారు. ఏం మాట్లాడుతారో, ఏం చేస్తారో తెలియని పరిస్థితి జగన్‌దని ఎద్దేవా చేశారు. జగన్ మొన్న తన మనుషులను పంపించి రాజధానిలో సీఆర్‌డీఏ పరిరక్షణ కమిటీ పేరుతో కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. దీంతో అక్కడి రైతులు, ప్రజలు వారిని తరిమి తరిమి కొట్టారని ఎద్దేవా చేశారు. ఇంకా ఈ దొంగ డ్రామాలు, నాటకాలు ఆడుతూ ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టాలా? అని జగన్‌ని కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. మనుషులు, కులాలు, మతాల మధ్య వైషమ్యాలు సృష్టించాలని కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజలందరూ పరిస్థితిని దయచేసి గమనించాలని మంత్రి కొల్లు విజ్ఞప్తి చేశారు. జగన్ గతంలో మూడు రాజధానులని చెబుతూ ఎన్నికలకు వెళ్లగా.. 11 సీట్లకే పరిమితం అయ్యారని అన్నారు. 'మావిగన్'తో రేపు సున్నా సీట్లకే ఆయనను ప్రజలు పరిమితం చేస్తారని వ్యాఖ్యానించారు.

వర్షం పడితే ముంపే

జాతీయ రహదారిపై నిలిచిపోతున్న నీరు

కాలువలకు వెళ్లే మార్గం లేక నిల్వ - ఏటా వానాకాలంలో తప్పని కష్టాలు

రణస్థలం: సాధారణంగా జాతీయ రహదారి అంటే ప్రయాణం సాఫీగా సాగిపోవాలి. కానీ, జిల్లాలో మాత్రం హైవేపై ప్రయాణం నరకమే. వర్షం పడితే జాతీయ రహదారిపై ప్రయాణించేవారికి, సమీపంలో నివాసితులకు ఇబ్బందులు తప్పడం లేదు. రహదారి నిర్మాణ సమయంలో లోపాలు, పూర్తిస్థాయి నిర్వహణ లేకపోవడంతో వర్షాలకు కొన్నిచోట్ల రోడ్డు నీట మునుగుతుంది. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రమాదాలూ జరుగుతున్నాయి.

ఇదీ పరిస్థితి.. జిల్లాలో పైడిభీమవరం నుంచి ఇచ్ఛాపురం వరకూ 196 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. పైడిభీమవరం నుంచి నరసన్నపేట వరకూ ఆరు వరుసలుగా 54 కిలోమీటర్ల రోడ్డు ఉంది. అక్కడ నుంచి ఇచ్ఛాపురం మాత్రం నాలుగు వరుసలుగా 85 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. మధ్యలో రణస్థలం మండల కేంద్రంలో ఇప్పుడు ఫ్లైఓవర్ నిర్మిస్తున్నారు. జిల్లాలో జాతీయ రహదారిపై 30 వంతెనలు ఉన్నాయి. 80 కిలోమీటర్ల మేర సైడ్ కాలువలు ఉన్నాయి. అయితే ఇరువైపులా సర్వీసు రోడ్లు, పై వంతెనలు, కాలువలు కూడా ఉన్నాయి. కానీ వర్షంపడితే కొన్నిచోట్ల నీరు నిలిచిపోతోంది. నిర్మాణ సమయంలో సరైన ప్రణాళిక, నిబంధనలు పాటించకపోవడంతో ఇప్పుడు ఇబ్బందులు తప్పడం లేదు. ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు రావడం, అధికారులు హడావుడి చేయడం, తరువాత మరిచిపోవడం పరిపాటిగా మారింది.

కానరాని పర్యవేక్షణ.. జిల్లాలో జాతీయ రహదారుల నిర్వహణ బాధ్యతను టోల్ వసూలు చేసే కాంట్రాక్ట్ సంస్థలు చూడాలి. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలి. గతుకులు, గుంతలు ఉన్న ప్రాంతంలో మరమ్మతులు చేయడం, మొక్కల పరిరక్షణ, విద్యుద్దీపాలంకరణ, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టడం వంటివి చేయాలి. కానీ, జిల్లాలో మాత్రం తూతూమంత్రంగా జరుపుతున్నట్టు విమర్శలున్నాయి. సర్వీసు రోడ్లకు ఇరువైపులా ఉన్న కాలువల్లో పూడికతీత పనులు చేపట్టడం లేదు. దీంతో వరద నీరు వెళ్లే మార్గం లేక సర్వీసు రోడ్లపై నీరు నిల్వ ఉండిపోతోంది. అటువైపుగా వెళ్లే వాహనాలపై వరద నీరు పడుతుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రమాదాలకు కూడా ఇవే కారణాలు అవుతున్నాయి. అయితే సమస్య తలెత్తిన చోట తాత్కాలికంగా పనులు చేపట్టి చేతులు దులుపుకొంటున్నారు. దీంతో ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ఏడాదైనా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

సక్రమంగా లేని కాలువలు.. రణస్థలం మండలం పైడిభీమవరం, కోష్ఠ, పతివాడపాలెం, నెలివాడ కూడళ్లలో ఫ్లైఓవర్ల వద్ద సర్వీసు రోడ్లను సక్రమంగా నిర్మించలేదు.

ఇక్కడ కాలువలు కూడా సక్రమంగా లేవు. నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో వర్షపు నీరు పూర్తిగా నిలిచిపోతోంది. లావేరు మండలం సుభద్రాపురం జంక్షన్, ఎచ్చెర్ల మండలం అరిణాం అక్కివలస, చిలకపాలెం, కేశవరావుపేట, నవభారత్ జంక్షన్ వద్ద కూడా అదే పరిస్థితి. నరసన్నపేట మండల కోమర్తి, సింగుపురం జంక్షన్ వద్ద సైతం వరద నీరు పోటెత్తుతోంది. అయితే ఇంత జరుగుతున్నా హైవే అధికారులు తాత్కాలిక చర్యలతోనే సరిపెడుతున్నారు.

వెలగని విద్యుత్ లైట్లు.. జాతీయ రహదారికి సంబంధించి 30 వంతెనల వద్ద, గ్రామాలకు వెళ్లే సర్వీసు రోడ్ల వద్ద దాదాపు 900 విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేశారు. వాటికి ఎల్ఈడీ విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు. ప్రారంభంలో ఇవి బాగానే వెలిగాయి. కానీ తరువాత నిర్వహణ బాగా లేకపోవడంతో వెలగడం మానేశాయి. రణస్థలంలో అయితే రోడ్డు మధ్యలో వేసిన విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగిపోయింది. ఎప్పుడు రోడ్డుపై పడుతుందో తెలియని పరిస్థితి. బుడుమూరు, సుభద్రాపురం, తాళ్లవలస, ఎచ్చెర్ల, శ్రీకాకుళం సింహద్వారం, పెద్దపాడు, సింగుపురం, మడపాం వద్ద పూర్తిస్థాయిలో విద్యుత్ లైట్లు వెలగడం లేదు.

ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఇచ్చే స్థాయికి రావాలి

అనంతపురం : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతతో చేపట్టిన 'వికసిత్ భారత్ 2047' స్ఫూర్తితో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'స్వర్ణాంధ్ర-2047' లక్ష్యం దిశగా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. విద్య, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలను సృష్టించడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్తుకు సంసిద్ధమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని ఆయన స్పష్టం చేశారు. అనంతపురంలోని ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవం నేడు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ విద్యార్థులను ఉద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో వేదిక పంచుకోవడం గొప్ప భాగ్యమని లోకేశ్ అన్నారు. ఆమె జీవితం తరగతి గదుల్లో నేర్చుకోలేని ఒక గొప్ప పాఠమని అభివర్ణించారు. "ఒక చిన్న గిరిజన గ్రామంలో పుట్టి, ఎన్నో వ్యక్తిగత విషాదాలను ఎదుర్కొని, విశ్వాసం కోల్పోకుండా ముందుకు సాగారు. ఉపాధ్యాయురాలిగా, శాసనసభ్యురాలిగా, గవర్నర్‌గా పనిచేసి, నేడు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి రాష్ట్రపతిగా మన ముందున్నారు. ఆమె ప్రయాణం ప్రతి ఒక్కరికీ ఒక సత్యాన్ని బోధిస్తుంది. మన నేపథ్యం మన గమ్యాన్ని నిర్ధారించదు, మన ధైర్యమే మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ఆమె జీవితం లక్షలాది మంది భారతీయ యువతకు నిరంతరం స్ఫూర్తినిస్తుంది" అని లోకేశ్ వివరించారు. ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీ మొదటి స్నాతకోత్సవంలో పాల్గొనడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని మంత్రి తెలిపారు. "ప్రతి స్నాతకోత్సవం ప్రత్యేకమైనదే అయినా, మొదటిది ఎప్పటికీ చారిత్రాత్మకం. చరిత్ర ఒక్కసారే లిఖించబడుతుంది. రాబోయే ఏళ్లలో వేలమంది ఇక్కడి నుంచి పట్టాలు అందుకుంటారు. కానీ, మొదటి బ్యాచ్ ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఆ వారసత్వం మీకే చెందుతుంది" అంటూ పట్టభద్రులకు, స్వర్ణ పతక విజేతలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మారుతున్న ప్రపంచంలో యువత ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారిగా కాకుండా, అవకాశాలను సృష్టించే వారిగా మారాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "కేవలం ఉద్యోగార్థులుగా ఉండకండి, ఉద్యోగ సృష్టికర్తలుగా మారండి. సంస్థలను, ఆవిష్కరణలను, పరిష్కారాలను నిర్మించండి. ఎప్పుడూ సౌకర్యవంతమైన మార్గాన్ని ఎంచుకునే వారికి విజయం దక్కదు. కఠినమైన, తక్కువ మంది ప్రయాణించే మార్గాన్నే ఎంచుకోండి. అవే అద్భుతమైన విజయాలకు దారితీస్తాయి. వైఫల్యాలను తట్టుకుని నిలబడే ధైర్యం, మళ్లీ పుంజుకునే సంకల్పం కలిగి ఉండాలి" అని ఆయన సూచించారు.

స్నాతకోత్సవంతో విద్య ముగిసిపోదని, ఇది జీవితకాల అభ్యసనకు నాంది మాత్రమేనని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌ను ఇన్నోవేషన్, మ్యానుఫ్యాక్చరింగ్, టెక్నాలజీ రంగాలకు గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని లోకేశ్ తెలిపారు. సాంకేతికత, తయారీ, పరిశోధన, వైద్యం, వ్యవసాయం వంటి రంగాల్లో యువతకు అపారమైన అవకాశాలు రానున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. "ఈ ప్రాంగణం నుంచి వెళ్తున్న మీరు మీ విజ్ఞానాన్ని ఆత్మవిశ్వాసంతో, విలువలను వినయంతో, కలలను ధైర్యంతో ముందుకు తీసుకువెళ్లండి. మీ కుటుంబం, మీ విశ్వవిద్యాలయం, ఈ దేశం గర్వపడేలా గొప్ప వారసత్వాన్ని సృష్టించండి" అని లోకేశ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ శంకర్ ఆచార్య, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి సుంకర జ్ఞానేశ్వరి ఎక్కడ?

కాకనాడ : కాకినాడ జిల్లా తుని మండలం సీహెచ్ అగ్రహారం గ్రామానికి చెందిన చిన్నారి సుంకర జ్ఞానేశ్వరి అదృశ్యమై 25 రోజులు గడుస్తున్నా ఆచూకీ దొరకలేదు. బతికుందా, చనిపోయిందా తెలికపోవడం మరింత బాధాకరం. కిడ్నాప్ చేశారా, అడవి జంతువులు తినేశాయా అని చాలా కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసును ఛేదించేందుకు పోలీసులు 12 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి చిన్నారి ఆచూకీ కోసం దర్యాప్తు జరుపుతున్నారు. అయినప్పటికీ, చిన్నారికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు దొరకకపోవడంతో కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. జ్ఞానేశ్వరి కేసు దర్యాప్తును వేగవంతం చేయడానికి పోలీసులు సరికొత్త వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. చిన్నారి చిత్రంతో పోస్టర్లను ముద్రించి, చుట్టుపక్కల జిల్లాలతో పాటు రాష్ట్రంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో విస్తృతంగా అతికించారు. చిన్నారి గురించి సమాచారం అందించిన వారికి రూ. 1 లక్ష నగదు పారితోషికం అందజేస్తామని పోలీసులు అధికారికంగా ప్రకటించారు. తుని చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసులో దర్యాప్తు సాగుతున్న కొద్దీ ఏ పురోగతి లేదు. 25 రోజుల కిందట తుని మండలం సీహెచ్ అగ్రహారం గ్రామానికి చెందిన సుంకర జ్ఞానేశ్వరి అనే చిన్నారి అకస్మాత్తుగా అదృశ్యమైంది. మొదట చిన్నారి, ఆమె వెనుక కుక్క వెళ్తున్న సీసీటీవీ ఫుటేజీ మాత్రమే లభ్యమైంది. తల్లిదండ్రుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోయింది. ఈ క్రమంలో మూడు రోజుల తరువాత కుక్క ఇంటికి తిరిగొచ్చింది. కుక్క సాయంతో చిన్నారి ఆచూకీ కోసం తీవ్రంగా శ్రమించినా ప్రయోజనం లేకపోయింది. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని గాలింపు కోసం ఏకంగా 12 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అనుమానితులను విచారిస్తూ, చుట్టుపక్కల వందల కిలోమీటర్ల మేర క్షుణ్ణంగా వెతికినా లాభం లేకపోయింది. కుక్క ఆచూకీ కోసం దాని మెడల్ ట్రాకర్ కూడా అమర్చారు. ఆ తరువాత తోటలు, అడవిలోకి వెళ్లిన కుక్క యజమాని ఇంటికి తిరిగొచ్చింది. కానీ ఈ కేసులో ఒక పెంపుడు కుక్క మృతి చెందడం సరికొత్త మలుపు తిప్పింది. జ్ఞానేశ్వరి అదృశ్యమైన సమయంలో వెంట వెళ్లిన ఒక కుక్క అనుమానాస్పద స్థితిలో చనిపోయింది.

ఈ కేసుతో ఆ కుక్క మృతికి ఏమైనా సంబంధం ఉందేమోనన్న అనుమానంతో పోలీసులు దానికి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం వివరాల ప్రకారం.. ఆ కుక్కది సహజ మరణం అని తేల్చారు.

యూనిట్లు 198.. దరఖాస్తులు 658

- మినీ ట్రాక్టర్లు, పవర్ వీడర్లకు పోటీ

మెళియాపుట్టి : ప్రభుత్వం సబ్సిడీపై అందించే వ్యవసాయ యంత్రాలు, పరికరాలకు విపరీతమైన డిమాండ్ నెలకొంది. వీటి కోసం అధికారులు ఏప్రిల్ నెలాఖరు వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. అయితే, గతంలో స్ప్రేయర్లు వంటి వాటికి డిమాండ్ ఉం దేది. ఇప్పుడు భారీగా సబ్సిడీ ఉండడంతో ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్లు, పవర్ వీడర్లకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. వీటి కోసం వేలాది దరఖాస్తులు వచ్చాయి.

సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఈ ఏడాది దరఖాస్తులు అధికంగా రావడంతో ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు ఉన్నవారికే అధికారులు ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. కొన్ని జిల్లాల్లో లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ సీతంపేట ఐటీడీఏలో మాత్రం సిఫారసు లేఖలు ఇచ్చిన వారికే యంత్రాలు కేటాయించినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. చిన్న ట్రాక్టర్‌కు రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు రాయితీ ఉండడంతో అధికంగా రైతులు పోటీ పడుతున్నారు.

యూనిట్లు తక్కువ.. దరఖాస్తులు ఎక్కువ..

సీతంపేట ఐటీడీఏ పరిధిలో 198 యూనిట్లు మంజూరు కాగా, దరఖాస్తులు మాత్రం 658 వరకు వచ్చినట్లు అధికారులు తెలుపుతున్నారు. పవర్ వీడర్స్ 53 యూనిట్లకు 253 దరఖాస్తులు, ఆయిల్ ఇంజన్లు 80 యూనిట్లకు 93 దరఖాస్తులు, పవర్ టిల్లర్లు 28 యూనిట్లకు 184 దరఖాస్తులు, మల్టీ క్రాప్ ట్రాక్టర్ 12 యూనిట్లకు ఏడు దరఖాస్తులు, మినీ ట్రాక్టర్లు 25 యూనిట్లకు 121 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, యూనిట్లు తక్కువ దరఖాస్తులు ఎక్కువ రావడంతో అధికారులు సైతం ఏమీ చేయలేక తర్జనభర్జన పడుతున్నారు. ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు ఇచ్చిన వారికి యంత్రాలు కేటాయిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఈ విషయమై సీతంపేట ఐటీడీఏ హార్టికల్చర్ ప్రాజెక్టు అధికారి ఎస్‌వీ గణేష్‌ను వివరణ కోరగా.. 'గత ఆరేళ్ల నుంచి వ్యవసాయ యాంత్రీకరణ కోసం నిధులు మంజూరు జరగలేదు. ప్రస్తుతం ఇస్తున్న పరికరాలకు సంబంధించి గత వైసీపీ ప్రభుత్వంలో 2018-19 బడ్జెట్‌లో నిధులు కేటాయింపు జరిగింది.

ఇంకా రాజధాని లొల్లే..

విజయవాడ : రాజకీయాల్లో ఎపుడూ దూకుడు అవసరమే. అదే సమయంలో ప్రజలను దృష్టిలో పెట్టుకుని ప్రతీ అడుగూ పడాలి. ఇక చెప్పాలీ అంటే విపక్షంలో ఉన్న వారికి బోలెడు అడ్వాంటేజెస్ ఉంటాయి. వారు ఏమైనా చెప్పవచ్చు. తాము అధికారంలోకి వస్తే కొండ మీద కోతిని అయినా తీసుకుని వస్తామని అనవచ్చు. అయితే ఇలాంటి వాటికి హద్దులు లేకపోయినా కొన్ని కీలక పాలసీల విషయంలో మాత్రం పరిమితంగానే చేయాల్సి ఉంటుంది. అలాగే కొన్ని సెంటిమెంట్ల విషయంలో ఆచీ తూచీ ముందుకు సాగాల్సి ఉంటుంది. అంటే సంక్షేమ పథకాల విషయంలో కానీ కొన్ని నూతన నిర్ణయాల విషయంలో కానీ జనాలను తమ వైపునకు తిప్పుకునేందుకు విపక్షానికి అధికార పక్షానికి లేని వెసులుబాటు ఉంటుంది కానీ అదే సమయంలో విధానపరమైన నిర్ణయాల విషయంలో మాత్రం అంతగా అవకాశం ఉండదు అని అంటున్నారు. ఎప్పటి రాజధాని చర్చ, రాజకీయ రచ్చగా అదెప్పటికి తీరెను అన్నది జనంలో ఉన్న వేదన. అయితే వైసీపీ మాత్రం అమరావతి విషయంలో ప్రతీ ఎన్నికలోనూ తన విధానాలను మార్చేసుకుని ముందుకు పోతోంది. 2014 ఎన్నికల్లో జగన్ బ్రహ్మాండమైన రాజధాని అని హామీతో జనం ముందుకు వచ్చారు. బహుశా వైసీపీకి ఆనాడు ఆలోచనలు ఒంగోలు జిల్లా సమీప ప్రాంతంలో కోస్తాకు గ్రేటర్ రాయలసీమ జిల్లాలకు మధ్య రాజధాని నిర్మాణం చేద్దామని అయి ఉండొచ్చు. దొనకొండ వద్ద రాజధాని అని కూడా అప్పట్లో వైసీపీ చాయిస్ గా వినిపించింది. కానీ తొలి చాన్స్ మాత్రం టీడీపీకి దక్కింది. దాంతో అమరావతి పేరుతో టీడీపీ ప్రభుత్వం తన ప్రతిపాదనలను ఆచరణలో పెట్టేందుకు వీలు కలిగింది. ఇక దాని మీద విపక్ష నేతగా అసెంబ్లీలో జగన్ అమరావతికి మద్దతు ప్రకటించారు. అయితే పూర్తిగా ప్రభుత్వ భూములలోనే అన్న కండిషన్ తమ మద్దతులో అని తరువాత చెప్పారు వైసీపీ నేతలుఇక 2019 కి వచ్చేసరికి అమరావతి రాజధానిగా గుర్తిస్తున్నట్లుగా వైసీపీ నేతలు ప్రకటించారు. జగన్ ఏకంగా అక్కడ ఇల్లు కట్టుకున్నారని వారంతా గట్టిగానే చెప్పారు. దాంతో టీడీపీ హయంలో మందగమనంలో సాగుతున్న రాజధాని జగన్ హయాంలో పుంజుకుంటుంది అని భావించే ఆయనకు మద్దతుగా రాజధాని ప్రాంతంతో సహా అంతా ఓటెత్తారు అని విశ్లేషణ ఉంది. అందుకే 151 సీట్లు దక్కాయని కూడా చెబుతారు. ఇక 2019 నుంచి 2024 మధ్యలో అయిదేళ్ల కాలమంతా మూడు రాజధానుల నినాదంతో గడిపారు. ఇక 2024 ఎన్నికల వేళ వైసీపీ మూడు రాజధానులకు జనాలు వ్యతిరేకమని స్పష్టం అయింది అన్నట్లుగా తీర్పు వెలువరించింది. దాంతో మూడు రాజధానులు అనడం వైసీపీ తగ్గించింది. కానీ



దానికి ఆల్టర్నేషన్ ని చూసుకోవడానికి వైసీపీకి రెండేళ్ళ కాలం పట్టింది. 2026 ఏప్రిల్ 1న జగన్ ప్రెస్ మీట్ పెట్టి మావిగన్ పేరుతో ఒక సంచలన ప్రకటన చేశారు. దాంతో ఇది పెద్ద చర్చగా మారింది. ఇక 2029 ఎన్నికలకు జగన్ మావిగన్ రాజధానిగా తాము జనంలోకి వెళ్తామని అంటున్నారు. పైగా ఎన్నికల మేనిఫెస్టోలో దానిని పెడతామని ఆయన అంటున్నారు. అమరావతికి వ్యతిరేకం కాదంటూనే కొత్త ఆల్టర్నేషన్ ని తీసుకుని వచ్చారు. దాంతో వైసీపీ రాజధాని స్టాండ్ ఏంటి అన్న ప్రశ్నకు క్లియర్ గా జవాబు వచ్చినట్లు అయింది. అది కూడా ఎన్నికలకు మూడేళ్ళు సమయం ఉండగానే. ఒక విధంగా వైసీపీ ఈ విషయంలో రిస్క్ చేస్తోందా అన్న చర్చ కూడా సాగుతోంది. ఎందుకంటే ముందే చెప్పుకున్నట్లుగా రాజధాని అన్నది ఒక సెంటిమెంట్. ఇక 2024 లో కూటమి అధికారంలోకి వచ్చాక అమరావతి కేంద్రంగా నిర్మాణం పనులు జోరుగా సాగుతున్నాయి. అక్కడ అవినీతి అక్రమాలు జరిగాయి అంటే వాటి మీద వైసీపీ పోరాడవచ్చు, అంతే కాదు ఏపీలో కొత్తగా తాము ఇతర నగరాలను అభివృద్ధి చేస్తామని కూడా వైసీపీ చెప్పుకోవచ్చు. కానీ రాజధాని అంటూ మావిగన్ ని తీసుకుని రావడం మాత్రం సాహసంతో కూడిన అంశంగానే చూస్తున్నారు. ఇది టీడీపీతో వైసీపీ రాజకీయ సమరం అనే దాని కంటే ప్రజల రాజధాని సెంటిమెంట్ మీదనే వైసీపీ కొత్త చాన్స్ తీసుకుంటున్నట్లుగా విశ్లేషిస్తున్నారు. బహుశా వైసీపీకి ఇంతకంటే ఆల్టర్నేషన్ లేదని అనుకోవాలా అన్నది కూడా ఉంది. మరి దీని మీద టీడీపీ మాత్రమే కాదు న్యూట్రల్ జనాలు ఏ విధంగా రియాక్ట్ అవుతారు అన్న దాని మీదనే వైసీపీ మావిగన్ ఇష్యూ ఆధారపడి ఉంటుంది.

టూ టైర్ సిటీస్ లో విల్లా కల్చర్

కాకినాడ : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా స్థిరాస్తి మార్కెట్ ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా స్థిరమైన వృద్ధి రేటుతో దూసుకుపోతోంది. ముఖ్యంగా రాజమండ్రి రూరల్ పరిసర ప్రాంతాలతో పాటు కాకినాడ అచ్యుతాపురం ఎకనామిక్ జోన్ వైపు వెళ్లే ప్రధాన రహదారుల వెంబడి రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. పారిశ్రామిక విస్తరణ, మౌలిక వసతుల కల్పన వేగవంతం కావడంతో ఈ కారిడార్‌లోని ల్యాండ్ మార్కెట్ వైపు మదుపరులు భారీగా ఆకర్షితులవుతున్నట్లు ఈ వారం పత్రికల బిజినెస్ పేజీలు ప్రత్యేక విశ్లేషణాత్మక కథనాలను ప్రచురించాయి. ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ ఇంతలా పుంజుకోవడానికి ప్రధాన బలం గోదావరి జిల్లాల్లోని సంపన్న వర్గాల నుంచి వస్తున్న పెట్టుబడులేనని మార్కెట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లాలో అత్యంత లాభదాయకంగా సాగుతున్న ఆక్వా రంగానికి చెందిన ప్రముఖులు, స్థానిక పారిశ్రామికవేత్తలు తమకు వస్తున్న లాభాలను సురక్షితమైన ఇన్వెస్ట్‌మెంట్ మార్గంగా భావించి భూములపై పెడుతున్నారు. షేర్ మార్కెట్, ఇతర వ్యాపారాల కంటే స్థిరాస్తి రంగానికే దీర్ఘకాలంలో తిరుగులేని లాభాలు వస్తుండటంతో, వీరంతా గ్రూపులుగా ఏర్పడి మరీ కనెక్టింగ్ రోడ్ల వెంబడి వందల ఎకరాలను కొనుగోలు చేస్తున్నారు. రాజమండ్రి రూరల్ పరిధిలోని శాటిలైట్ సిటీ పరిసరాలు, కడియం, జేగురుపాడు వైపు వెళ్లే మార్గాలతో పాటు.. కాకినాడ నుంచి అచ్యుతాపురం సెజ్ కనెక్టివిటీ ఉన్న రహదారుల ఇరువైపులా కొత్త కొత్త వెంచర్లు వెలుస్తున్నాయి. డీటీసీపీ అనుమతులతో మౌలిక వసతులు కల్పిస్తూ రియల్టర్లు వేస్తున్న లేఅవుట్లకు హాట్ కేకుల్లా డిమాండ్ ఏర్పడింది. మధ్యతరగతి వర్గాలు సొంత ఇంటి కల కోసం ఓపెన్ ప్లాట్లను ఎంచుకుంటుంటే, హైవే ఫేసింగ్ ఉన్న బిట్లను కమర్షియల్ అవసరాల కోసం కొనుగోలు చేసేందుకు పెద్ద ఎత్తున పోటీ నడుస్తోంది. స్థానిక పారిశ్రామిక వేత్తల అండదండలు, నిరంతర నగదు సరఫరా పుష్కలంగా ఉండటంతో ఇక్కడి స్థిరాస్తి వ్యాపారానికి ఎటువంటి ఢోకా లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. అటు ఐటీ, ఇటు పారిశ్రామికంగా కాకినాడ-రాజమండ్రి జంట నగరాల మధ్య రీజినల్ గ్రోత్ కారిడార్ వేగంగా విస్తరిస్తుండటంతో రాబోయే రోజుల్లో ఇక్కడ చదరపు గజం ధరలు మరింతగా పెరగడం ఖాయమని, ఫలితంగా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల ఆదాయం కూడా భారీగా పెరుగుతోందన్న అంచనాలున్నాయి.

హోం మంత్రిగారి మౌనమెందుకో..

విజయవాడ : ఏపీ హోం మినిస్టర్ వంగలపూడి అనిత యమా యాక్టివ్‌గా ఉంటారు. పొలిటికల్ ప్రత్యర్థులపై ఓ రేంజ్‌లో విరుచుకుపడుతుంటారు. ప్రతిపక్ష నేత జగన్‌ను ఉద్దేశించి పులివెందుల ఎమ్మెల్యే అని సెటైరికల్‌గా మాట్లాడ్డం ఆమెతోనే మొదలైందని చెప్పుకుంటాయి రాజకీయవర్గాలు. అంతవరకు సరే.. రాజకీయ వ్యవహారాల్లో ఎవరి లెక్కలు వారికి ఉంటాయి. కానీ, మంత్రి హోదాలో ఉండి సంబంధింత శాఖ వ్యవహారాల గురించి పట్టించుకోకుండా అనిత కేవలం పొలిటికల్ స్టేట్‌మెంట్స్‌కే పరిమితం అవుతున్నారా అన్నది చాలా మందికి వస్తున్న లేటెస్ట్ డౌట్. ఎందుకంటే.. రాష్ట్రాన్ని కుదిపేసిన సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసుపై హోం మినిస్టర్ సక్రమంగా స్పందించలేదన్నది రాజకీయవర్గాల విస్తృతాభిప్రాయం. ఆ వ్యవహారానికి సంబంధించి ఇప్పటివరకు ఒకే ఒక్కసారి స్పందించారామె. అదీ కూడా కేవలం ఐదు సెకన్ల రియాక్షన్. సాధారణంగా పొలిటికల్ స్టేట్‌మెంట్స్ విషయంలో అనర్గళంగా మాట్లాడే అనిత అత్యంత కీలకమైన కేసు విషయంలో కేవలం ఐదు సెకన్లకే ఎందుకు పరిమితం అయ్యారన్నది బిగ్ క్వశ్చన్. రాష్ట్ర హోం మంత్రిగా అంత సీరియస్ సమస్య మీద సరిగా స్పందించకపోవడంపై వివిధ వర్గాల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయట. కస్టోడియల్ డెత్ కేసు విషయంలో ఎందుకొచ్చిన గొడవ అనుకుంటూ మంత్రే మాట్లాడ్డం లేదా? లేక స్పందించవద్దని ఆమెకు ఆదేశాలున్నాయా అన్న చర్చలు సైతం పెరుగుతున్నాయి. ఇదే విషయాన్ని విపక్షాలు సైతం నిలదీస్తున్నాయి. అత్యంత ముఖ్యమైన కేసు విషంలో హోం మంత్రి స్పందన అత్యంత పేలవంగా ఉండటం ఏంటి? హోం మంత్రి నోరు కట్టేస్తోంది ఎవరో తేల్చాలంటూ డిమాండ్ చేస్తున్నారు ప్రతిపక్ష నాయకులు. ఈ కేసుకు సంబంధించి హోం మంత్రి రియాక్షన్‌పై రాజకీయవర్గాలతో పాటు సామాన్యుల్లో సైతం రకరకాల డౌట్స్ పెరుగుతున్నాయట. రాష్ట్రానికి చెందిన మాజీ మంత్రి ఒకరు హోం మినిస్టర్ మేకప్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే.. అంతా ఖండించారు. అలాంటిది ఒక ప్రాణం విషయంలో ఆ స్థాయిస్పందన లేకపోవడం ఏంటన్న మాటలు వినిపిస్తున్నాయి. పై నుంచి వచ్చిన ఆదేశాలతోనే అనిత అలా వ్యవహరిస్తున్నారా అన్న సందేహాలు చాలామందిలో వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయంలో సంబంధిత మంత్రికంటే ఎక్కువగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్పందించారు. అయినాసరే ఆమె నుంచి నో రియాక్షన్ అంటే దీన్నెలా అర్థం చేసుకోవాలంటూ క్వశ్చన్ మార్క్ ఫేస్ పెడుతున్నారు పరిశీలకులు. ఇదే సమయంలో చాలామంది ఇప్పుడు డిప్యూటీ సీఎం వ్యాఖ్యలను కోట్ చేస్తున్నారట. నేనే హోమ్ మంత్రి అయిఉంటే పరిస్థితి వేరే విధంగా ఉండేదని పవన్ వ్యాఖ్యానించడం..అనిత విషయంలో సరిగ్గా సరిపోతుందా అనే చర్చలు సైతం నడుస్తున్నాయి. పవన్‌కళ్యాణ్ ఏ ఉద్దేశ్యంతో అలాంటి వ్యాఖ్యలు చేశారోగానీ.. వాతావరణం మాత్రం అలాగే కనిపిస్తోందని అభిప్రాయపడుతున్నారు కొందరు. కారణం ఏదైనాసరే.. రాష్ట్రంలో ఇంత పెద్ద ఘటన జరిగితే హోమ్ మంత్రి నోరు మెదపక పోవడం మాత్రం తీవ్ర చర్చనీయాంశం అయింది.

వై నాట్ 174.. టీడీపీ నినాదమా...

శ్రీకాకుళం : తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన చింతకాయల విజయ్ తాజాగా ఘాటైన వ్యాఖ్యలు చేశారు. నర్సీపట్నంలో తనకు జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ ని దమ్మున్న నాయకుడిగా కొనియాడారు. లోకేష్ తనది కాని నియోజకవర్గంలో టీడీపీకి అంతగా విజయావకాశాలు లేని సీట్లో గెలిచి చూపించారు అని విజయ్ గుర్తు చేశారు. మంగళగిరిలో ఒకసారి ఓటమి పాలు అయినా పట్టు వీడకుండా లోకేష్ మళ్లీ అదే స్థానం నుంచి గెలిచారు అంటే అదే లోకేష్ సత్తా అని అన్నారు. కానీ విపక్ష నేత జగన్ మాత్రం పులివెందుల దాటి బయటకు వచ్చి ఎక్కడైనా పోటీ చేసే సత్తా ఉందా అని విజయ్ ప్రశ్నించారు. జగన్ పులివెందులకు మాత్రమే పరిమితం అని విజయ్ ఎద్దేవా చేసారు. తెలుగుదేశం పార్టీకి సమర్థుడు అయిన నాయకుడు నారా లోకేష్ అని అన్నారు. ఆయన చేతుల్లోనే టీడీపీకి మంచి భవిష్యత్తు ఉందని విజయ్ అన్నారు. లోకేష్ నాయకత్వాన్ని ప్రతీ కార్యకర్త పూర్తి స్థాయిలో బలపరుస్తున్నారని కూడా విజయ్ చెప్పారు. లోకేష్ తన కుటుంబంగానే పార్టీలోని అందరినీ చూసుకుంటారు అని ఆయన తమ కుటుంబం మీద చూపించే అభిమానం ఆప్యాయతలు ఎంతో గొప్పవని అని విజయ్ చెప్పారు. ఇందుకు గానూ తాను లోకేష్ కి రుణపడి ఉంటాను అని విజయ్ చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు గురించి విజయ్ చెబుతూ ఆయనను నమ్ముకుంటే చాలు అందరికీ న్యాయం తప్పకుండా జరుగుతుందని అన్నారు. తాను మూడు సార్లు అనకాపల్లి ఎంపీ సీటు కోసం ప్రయత్నం చేశాను అని విజయ్ చెప్పారు. అయితే ఆ మూడు సార్లు నిరాశ ఎదురైంది అని అన్నారు. అయితే అదే సమయంలో చంద్రబాబు తనను పిలిచి నన్ను నమ్ము విజయ్ నీకు మంచి స్థానం ఇస్తాను అని చెప్పేవారు అని విజయ్ గుర్తు చేసుకున్నారు. ఇపుడు బాబు ఏకంగా తనకు రాజ్యసభ సీటు ఇచ్చి తన మాటను నిలబెట్టుకున్నారు అని బాబుకు సదా కృతజ్ఞతలు అని విజయ్ చెప్పారు. తమ కుటుంబానికి మొదటి నుంచి చంద్రబాబు ఆదరణ మద్దతు ఉందని విజయ్ చెప్పారు. తాను తెలుగుదేశం పార్టీకి జెండా కూలీగా పనిచేస్తాను అని విజయ్ చెప్పారు. పార్టీ ఆదేశాలు తుచ తప్పకుండా పాటిస్తాను అని ఆయన స్పష్టం చేశారు.

తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఏ అన్యాయం జరిగినా తాను ముందు ఉంటాను అని విజయ్ హామీ ఇచ్చారు. తాను పార్టీ కోసం ఎంతైనా చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. నర్సీపట్నంలో అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీగా తన వంతుగా కష్టపడి పనిచేస్తాను అని విజయ్ చెప్పారు. నర్సీపట్నంలో సృష్టి క్షేత్రం పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోడీని ఆహ్వానిస్తామని విజయ్ తెలిపారు. సృష్టి క్షేత్రంలో ప్రపంచంలోనే ఎత్తైన పార్వతీపరమేశ్వరుల విగ్రహాలను నెలకొల్పుతామని విజయ్ చెప్పారు. నర్సీపట్నంలో అభివృద్ధి పనులకు ఎవరు ఆటంకం కలిగించినా సహించేది లేదని విజయ్ స్పష్టం చేశారు. మొత్తానికి చూస్తే అయ్యన్నపాత్రుడు వారసుడిగా విజయ్ సింహ గర్జన చేశారు. రానున్న రోజుల్లో అయ్యన్న ప్లేస్ లో పూర్తి స్థాయి రాజకీయానికి విజయ్ సిద్ధపడుతున్నారు అనడానికి తాజా సభ ఒక నిదర్శనంగా చెబుతున్నారు.

మావిగన్ అయితే... విశాఖ సంగతేంటీ ?

విశాఖపట్టణం : విశాఖ మన రాజధాని అని వైసీపీ అధినేత జగన్ గతంలో చెప్పారు. తాను 2024లో మరోసారి గెలిస్తే విశాఖ నుంచే ప్రమాణం చేస్తాను అని కూడా చెప్పారు. విశాఖలో అన్నీ ఉన్నాయి అది సహజసిద్ధమైన రాజధాని అని వైసీపీ నేతలు పలు మార్లు చెప్పుకొచ్చారు. అయితే 2024 ఎన్నికల్లో చేదు ఫలితాలు దక్కిన తరువాత కానీ వైసీపీ నేతలకు తత్వం బోధపడలేదని అంటున్నారు. అందుకే కొన్నాళ్ళ పాటు సైలెంట్ గా ఉండి ఇపుడు దాదాపుగా టీడీపీ రూట్లోనే వెళ్తున్నారు అని అంటున్నారు. టీడీపీ కూడా అమరావతి రాజధాని అన్నది. విజయవాడ గుంటూరులకు దూరంగా కొత్త నగరం నిర్మించే పనిలో టీడీపీ ఉంది. అయితే వైసీపీ మాత్రం రెడీ మేడ్ గా మావిగన్ అని అంటోంది. అంటే విశాఖకు బదులుగా మావిగన్ తెచ్చినా రెడీ మేడ్ సిటీ విషయంలో మాత్రం వైసీపీ పక్కకు జరగలేదు అన్నది స్పష్టం అవుతోంది. ఇక విశాఖ రాజధాని అన్నారు. బీచ్ రోడ్డులో రుషికొండ మీద టూరిజం రిసార్ట్స్ ని తొలగించి అక్కడ సీఎం క్యాంప్ ఆఫీసు అని నివాసం అని దాని పేరుతో భారీ భవనాలు కట్టారు. నాలుగు వందల కోట్ల రూపాయలు దాని కోసం ఖర్చు చేశారు. విశాఖలో సముద్రం ఉంది, రైల్ రోడ్డు ఎయిర్ కనెక్టివిటీ ఉందని కూడా చెప్పారు. ఉత్తరాంధ్రా వెనకబాటుతనం అంతా పోయేలా విశాఖ క్యాపిటల్ ద్వారా అభివృద్ధి సాగుతుందని కూడా ప్రకటించారు. కానీ ఇపుడు విశాఖను వెనక్కి తీసుకున్నారు. ఆశ పెట్టి తగ్గిపోయారు అని అంటున్నారు. మరి దీని మీద ఉత్తరాంధ్రా వైసీపీ నేతల రియాక్షన్ ఎలా ఉంటుంది అన్నది కూడా చర్చకు వస్తోంది. ఇక విశాఖ రాజధాని అన్నపుడు మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు వంటి వారు గట్టిగా సమర్ధించారు. మా ప్రాంతం బాగు పడవద్దా అని కూడా ప్రశ్నించారు. మాకు రాజధాని వస్తూంటే టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారు అని కూడా విమర్శించారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అలాగే బొత్స సత్యనారాయణ వంటి వారు కూడా విశాఖ రాజధానికి జై కొట్టారు. మరి ఇపుడు వైసీపీ అయితే మావిగన్ అని తన రూట్ మార్చి ప్లేట్ తిప్పేసింది. దాంతో ఈ మాజీ మంత్రులు ఇంకా వైసీపీలోని కీలక నేతలు సీనియర్ నేతలు ఏమంటారు అని ప్రశ్నలు వస్తున్నాయి. అలాగే విశాఖ రాజధాని అని వైసీపీ నేతలు ఎంత గట్టిగా చెప్పినా మరెంత ఆర్భాటం చేసినా జనాల మద్దతు అయితే ఏ కోశానా లేదని తేలిపోయింది. విశాఖ రాజధాని అన్న తరువాతనే 2023లో ఉత్తరాంధ్రా ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగితే ప్రజలు యువత ఉద్యోగులు విద్యావంతులు అంతా కలసి టీడీపీకే ఓటేశారు. ఆ తరువాత 2024లో విశాఖ జిల్లా మొత్తం ఒక్క సీటూ వైసీపీకి లేకుండా చేశారు. ఇంతే కాదు గత అయిదేళ్లలో వైసీపీ విశాఖ రాజధాని అని ఎంతగా చెప్పినా జనాల నుంచి పాజిటివ్ రియాక్షన్ అయితే పెద్దగా రాలేదని గుర్తు చేస్తున్నారు. అందుకే వైసీపీ కూడా తన నిర్ణయం మార్చేసుకుంది అని అంటున్నారు. అయితే చెప్పుకోవడానికి ఈ రీజన్ బాగుంది కానె విశాఖ సహా ఉత్తరాంధ్రా అభివృద్ధి మీద వైసీపీ చిత్తశుద్ధి ఇంతేనా అన్న చర్చ కూడా మరో వైపు సాగుతోంది. మరి వైసీపీ ఏ విధంగా దీని మీద జనాలకు చెప్పుకుంటుందో చూడాల్సి ఉంది.

కమలం వైపు నేతల చూపు

నెల్లూరు : ఏపీలోని అధికార, ప్రతిపక్ష పార్టీల్లోని కీలక నాయకులు కొందరు బీజేపీ వైపు చూస్తున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. వీరిలో అధికార పార్టీ ఎమ్మెల్యేలుగా , ఎంపీలుగా ఉన్న ఒకరిద్దరు నాయకుల పేర్లు కూడా తరచుగా వినిపిస్తున్నాయి. 'ఏమో.. వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితులు ఎలా ఉంటాయో.. తప్పేముంది. ఈ పార్టీ కాకపోతే.. మరొకటి. నాకు సత్తా ఉంది. ఆ పార్టీకి చేర్చుకునేందుకు అవకాశం ఉంది.' అని క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన ఓ కీలక నాయకుడు ఆఫ్ ది రికార్డుగా వ్యాఖ్యానించారు. ఇక, ఎంపీల విషయంలోనూ ఇదే తరహా వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి కోస్తా జిల్లాల్లోని ఓ ఎంపీ గత ఎన్నికలకు ముందు చివరి నిమిషంలో టీడీపీ బీ ఫాం దక్కించుకున్నారు. కానీ, ఆయన పార్టీపరంగా కంటే.. జాతీయస్థాయి నేతలతోనే ఎక్కువగా టచ్‌లో ఉంటున్నారు. దీనికి కారణం.. అవసరమైతే.. వచ్చే ఎన్నికల్లో మార్పు కోసమేనని ఆయన చెబుతున్నారు. ఇది వినేందుకు చిత్రంగా ఉన్నా.. ఎవరికి వారు అప్పుడే కర్చీఫ్‌లు రెడీ చేసుకుంటున్నారు. ఇక, వైసీపీలోనూ కొందరు ఎమ్మెల్యేలు ఇదే బాటలో ఉన్నారన్న చర్చ కూడా ఉంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఓ సీనియర్ నాయకుడు బీజేపీతో టచ్‌లోకి వెళ్లారు. అయితే.. ఆయన కీలక పదవిని ఆశించారని.. ఆ పదవి ఇచ్చే విషయంలో బీజేపీ వెనక్కి తగ్గడంతో ఆయన మౌనంగా ఉన్నారని వైసీపీలోనే చర్చ సాగుతోంది. ఇక, ఓ ఎంపీ అయితే.. నేరుగా బీజేపీ నేతలతోనే కలివిడిగా ఉంటున్నారు. ఢిల్లీలోనే ఎక్కువ సమయం గడిపేస్తున్నారు. బీజేపీ మంత్రుల కార్యాలయాల్లోనూ ఆయన కనిపిస్తున్నారు. ఎంపీగా పనులు చేయించుకునేందుకు వచ్చానని సదరు పార్లమెంటు సభ్యుడు సెలవిస్తున్నారు. అయితే.. ఇదంతా ఎందుకంటే.. అధికార పార్టీకి చెందిన నాయకుల్లో టికెట్ల బెంగ కనిపిస్తోంది. వారిపై చేయిస్తున్న సర్వేల్లో మార్కులు తగ్గడం... వచ్చే ఎన్నికల్లో టికెట్లు దక్కుతాయోలేదోనన్న బెంగ వెంటాడుతుండడంతో సదరు నేతలు ముందుగానే వచ్చే ఎన్నికలకు ప్రిపేర్ అవుతున్నారు. ఇక, వైసీపీ నాయకుల్లో వచ్చే ఎన్నికలపై పెద్దగా ఆశలు లేకుండా పోతున్నాయన్న వాదన ఉంది. ఏమో మళ్లీ విపక్షంలో కూర్చునే పరిస్థితి వస్తుందేమోనని వారు బెంగ పెట్టుకున్నారని అంటున్నారు.

కళ్యాణదుర్గం మండలంలో నాణ్యమైన వేరుశెనగ విత్తనాల పంపిణీ

కళ్యాణదుర్గం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటున్నామని మార్కెట్ యార్డ్ చైర్మన్ లక్ష్మి రమేష్,టీడీపీ మండల కన్వీనర్ గోళ్ల వెంకటేశులు పేర్కొన్నారు. కళ్యాణదుర్గం శాసనసభ్యులు గౌరవనీయులు శ్రీ అమిలినేని సురేంద్ర బాబు గారి ప్రత్యేక చొరవ మరియు సూచనల మేరకు, కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామంలో రైతులకు సకాలంలో నాణ్యమైన వేరుశెనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు సకాలంలో సాయం-వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే నాణ్యమైన వేరుశెనగ విత్తనాలను పంపిణీ చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. "ఇది రైతుల ప్రభుత్వం, రైతుల కష్టాలను గుర్తించి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు మాకు ఎంతో ధైర్యాన్నిస్తున్నాయి" అని పలువురు రైతులు తమ ఆనందాన్ని పంచుకున్నారు.

హోళగుంద లో ఫుడ్ కమీషన్ చైర్మన్ ఆకస్మిక తనిఖీ

ఆహార భద్రత సేవల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి

హోళగుంద : మండల కేంద్రంలో గురువారం కేజీబీవీ హాస్టల్,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,అంగన్వాడీ మరియు చౌక దుకాణాల ద్వారా ప్రజలకు అందుతున్న ఆహార భద్రతా సేవల పై రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ విజయ ప్రతావ్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కేజీబీవీ హాస్టల్ నందు వంట శాల పరిశుభ్రత, త్రాగునీటి సౌకర్యం, ఆహార నిల్వ గదులు, ఆహార నాణ్యత, సరుకుల వినియోగం రికార్డులను పరిశీలించారు. మరియు విద్యార్థులకు అందుతున్న గుడ్ల సైజ్ మరియు తూకం తక్కువ ఉండడంతో వాటిని సత్వరమే మార్చి నాణ్యమైన గుడ్లను సరఫరా చేయాలని ఏజెన్సీని ఆదేశించారు. అనంతరం హాస్టల్ నందు నాణ్యమైన ఆహారం మెనూ ప్రకారంగా అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని. అయితే విద్యార్థులు చేయవలసినది శ్రద్ధగా చదువుకుని, ఉత్తమ పౌరులుగా ఎదిగి రాష్ట్రానికి ఉపాధ్యాయులకు, తల్లితండ్రులకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. భోజనం నాణ్యత వసతి గృహంలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. మరియు విద్యార్థులు మాకు ఉప్మా వద్దు అన్ని చెప్పడంతో దానికి బదులుగా ఎగ్ ఫ్రైడ్ రైస్ విద్యార్థులకు అందజేయాలని మెనూ పుస్తకంలో మార్పు చేశారు. తదనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని ఆస్వాదించారు. మరియు ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో ఎక్కడ కూడా రాజీ పడవద్దని చెప్పారు.

అదేవిధంగా పీడీఎస్ రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా బియ్యం, పప్పులు,చక్కెర తదితర నిత్యావసర సరుకుల నిల్వలు పంపిణీ విధానం,స్టాక్ రిజిష్టర్,ఈ-పాస్ యంత్రాల ద్వారా పంపిణీ వివరాలను పరిశీలించారు. రేషన్ డీలర్ షాపుల్లో ప్రభుత్వ స్కానర్ ఏర్పాటు చేసి తద్వారా డబ్బు చెల్లింపునకు దోహదపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు అందిస్తున్న ఎక్కడ ఎలాంటి పొరపాటు జరిగినా ఏపీ ఫుడ్ కమిషనర్ సహించేది

లోకల్ బాడీ ఎలక్షన్స్ గురి...

విజయవాడ : వైసీపీ అధినేత జగన్ పార్టీ నియోజకవర్గాల ఇంచార్జ్‌లు, మాజీ ఎమ్మెల్యేలతో భేటీ అవుతున్నారు. ఈ సందర్భంగా పార్టీపరంగా కొన్ని దిశానిర్దేశాలు చేస్తున్నారు. ఇదే సమయంలో స్థానిక ఎన్నికలకు సంబంధించి కూడా వారికి సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ముఖ్యంగా గత ప్రభవం తిరిగి తీసుకురావాలన్నదే జగన్ లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే.. ఇది సాధ్యమేనా? అనేది ప్రశ్న. ఎందుకంటే.. ఎవరు అధికారంలో ఉంటే వారే స్థానికంగా విజయం దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అసలు పోటీ నుంచే తప్పుకొంది. అయినా.. కొందరు టీడీపీ నాయకులు పోటీ చేశారు. ఇక, ఇప్పుడు వైసీపీ స్థానికంలో అయినా.. గెలుపు గుర్రం ఎక్కి. విజయం దక్కించుకుని గత ఎన్నికల్లో జరిగిన పరాభవం నుంచి బయట పడేందుకు ప్రయత్నాలు చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. కానీ, క్షేత్రస్థాయిలో కూటమి ప్రభుత్వంపై ఉన్న సానుకూలత వైసీపీకి కలసి వచ్చేలా లేదు. పింఛన్ల పంపిణీ నుంచి గ్రామీణ స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి వంటివి వైసీపీకి వ్యతిరేకతను కొనసాగిస్తున్నాయి. నాడు వైసీపీ పనులు చేసి ఉంటే ఇప్పుడు చెప్పుకొనేందుకు అవకాశం ఉండేదని కూటమి నాయకులు కూడా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ఈ ఎఫెక్ట్ ఎక్కువగా పడే ప్రభావం ఉందని అంటున్నారు. దీనికితోడు క్షేత్రస్థాయిలో నాయకుల మధ్య ఐక్యత కూడా కనిపించడం లేదు. జగన్ రావాలి.. పార్టీని పట్టించుకోవాలని అనే నాయకుల సంఖ్య ఎక్కువగా ఉందే తప్ప.. వ్యక్తిగతంగా బాధ్యత తీసుకుని ముందుకు సాగాలన్న లక్ష్యంతో నాయకులు ముందుకు కదలడం లేదు. మరోవైపు.. కూటమికి ఉన్న బలమైన వాయిస్ కూడా వైసీపీకి లేదనే చెప్పాలి. టీడీపీ, జనసేన అధినేతలు..తమ బలమైన గళంతో ప్రజల మధ్యకు వెళ్తుంటే.. వైసీపీ అధినేత మీడియా సమావేశాలకు.. చూసి చదువుతున్న స్క్రిప్టులకు మాత్రమే పరిమితం అవుతున్నారు. ఇవన్నీ.. వైసీపీని ఇరకాటంలో నెడుతున్నాయి. ట్రోల్స్‌కు గురయ్యేలా కూడా చేస్తున్నాయి.

అల్లిబాబుకు నివాళులర్పించిన ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్..

తల్లాడ జులై 26(ప్రజా కలం న్యూస్):

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన తల్లాడ మండలంలోని బిల్లుపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ బేగ్ అల్లిబాబుకు సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ నివాళులర్పించారు. ఆదివారం ఆయన చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన సతీమణిని ఓదార్చి, కుమారుడు బేగ్ నాగులు మీరాను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎనిక కృష్ణవేణి, కాంగ్రెస్ నాయకులు జక్కంపూడి కిషోర్, సామినేని రామ అప్పారావు, జానీమియా, జక్కంపూడి రమేష్, తదితరులు ఉన్నారు.

గురుకుల ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలి: ఆర్ టి యు.

ఖమ్మం జులై 26(ప్రజా కలం న్యూస్)

మహాత్మా జ్యోతిరావు పూలే తెలంగాణ బిసి గురుకుల పాఠశాల అధ్యాపకుల ఉపాధ్యాయుల గెస్ట్ ఉపాధ్యాయుల అధ్యాపకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పిఆర్టియు జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు . జిల్లా పిఆర్టియు భవన్లో మహాత్మా జ్యోతిరావు పూలే బిసి

గురుకుల ఉపాధ్యాయుల అధ్యాపకుల సదస్సు స్థానిక పీఆర్టీ భవన్లో నిర్వహించబడింది . ముఖ్యంగా జీరో వన్ జీరో ద్వారా ఉపాధ్యాయులకు వేతనాలు ఇప్పించాలని , గురుకుల ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు వెంటనే అందజేయాలని హాలిడే డ్యూటీ చేసిన వారికి సిసిఎల్ మంజూరు చేయాలని అతిథి బోధకులకు 12 నెలల వేతనం చెల్లించాలని తీర్మానం చేశారూ . అనంతరం పి ఆర్ టి యు అనుబంధ బీసీ గురుకుల కమిటీని నియమించారు . కమిటీ కన్వీనర్ గా ఆర్ రాము , ప్రిన్సిపాల్ ఎంజిబిటి రఘునాధపాలెం బాయ్స్ కో కన్వీనర్ గా బి లక్ష్మీనారాయణ , ఎం జి బి టి వైరా మరో కో కన్వీనర్ గా బీ మహేష్ , రఘునాధ పాలెం మహిళా ప్రతినిధిగా రాణి ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది . ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రంగారావు , పిఆర్టియు మాజీ అధ్యక్షులు మోత్కూరు మధు , వై వి , జిల్లా అసోసియేట్ అధ్యక్షులు టి రత్నకుమార్ , జిల్లా ఉపాధ్యక్షులు పి చంద్రశేఖర్ , ఎల్ సతీష్ , సోమల పత్రిక ఉపసంపాదకులు రమణ , రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు రాయల్ నరసరావు , రఘునాధపాలెం మండల అధ్యక్షుడు గుర్రం కేశవరావు , అర్బన్ మండల అధ్యక్షుడు రవి కిరణ్ , మధిర మండల అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి , జిల్లా నాయకులు రవికుమార్ , ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన సుమారు 200 మంది గురుకుల ఉపాధ్యాయులు పాల్గొన్నారు .

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

-సిఐటియు డిమాండ్

ప్రజా కలం జులై 26 (గద్వాల ప్రతినిధి)

గ్రామపంచాయతీ కార్మికులకు మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ డిమాండ్ చేశారు.ఆదివారం రాజోలి మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు అదనపు పని భారాన్ని మోపి మల్టీపర్పస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించకుండా, సక్రమంగా వేతనాలు చెల్లించకుండా మల్టీపర్పస్ పేరుతో శ్రమ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. గ్రామపంచాయతీ కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ క్యాజువల్ వారాంతపు సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులకు రెండవ పి ఆర్ సి ని ప్రకటించిన కనీస వేతనం 26,000గా నిర్ణయించాలని పిఆర్సి లో నిర్ణయించిన వేతనాలను మున్సిపల్ కార్మికులకు యధాతధంగా కేటగిరీల వారికి అమలు చేయాలని 60 సంవత్సరాలు పైబడిన అనారోగ్యం పాలైన ప్రమాదం జరిగి మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో రాజోలి గ్రామ పంచాయతీ కార్మికులకు పంచాయతీ తీర్మానం చేసి 2200 వేతనాన్ని పెంచినప్పటికీ వాటిని గ్రామపంచాయతీ కార్మికుల ఖాతాలో జమ చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో రాజోలి మండల గ్రామపంచాయతీ వర్కర్స్ జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మణ్, మండల అధ్యక్షుడు తిక్కన్న, కార్మికులు సౌల్ రాజ్,మెహబూబ్ పాషా కృష్ణ నరసన్న రవి నరసన్న రాజు తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

-ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్రస్థాయి సభ్యుల సమావేశంలో పిలుపు

హైదరాబాద్ జూలై 26 (ప్రజా కలం ప్రతినిధి)

మానవ హక్కుల పరిరక్షణలో ప్రతి సభ్యుడు బాధ్యతాయుతంగా వ్యవహరించి బాధితులకు న్యాయం అందించేలా కృషి చేయాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అభిలాష్ బోలుగూరి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని లక్డికాపూల్ వాసవి సేవా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

సంస్థ బలోపేతంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా విస్తరణకు కార్యాచరణ ప్రణాళికపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ప్రతి జిల్లాకు రాష్ట్ర ఇన్‌చార్జ్‌లను నియమించి, అనంతరం నియోజకవర్గాలు, మండల స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

మానవ హక్కులు అంటే కేవలం చట్టాల్లోని నిబంధనలు మాత్రమే కాదని, ప్రతి వ్యక్తి స్వేచ్ఛగా, గౌరవంగా, భయరహితంగా జీవించే హక్కేనని అభిలాష్ బోలుగూరి పేర్కొన్నారు. కులం, మతం, ప్రాంతం, లింగ భేదాలు లేకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించడమే సంస్థ లక్ష్యమన్నారు.

రాష్ట్రంలో అణగారిన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలు, మహిళలపై దాడులు, కార్మికుల హక్కుల ఉల్లంఘన వంటి సమస్యలపై సంస్థ చురుకుగా స్పందిస్తుందని తెలిపారు. బాధితుల పక్షాన నిలబడి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి సంస్థ సేవలను విస్తరించే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లో రాష్ట్ర కార్యాలయం ఏర్పాటు చేయడానికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. అలాగే ప్రతి నెల జిల్లా ఇన్‌చార్జ్‌లు, బోర్డు సభ్యులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

సమావేశంలో రాష్ట్ర ఇన్‌చార్జ్ ఎవుసం గంగాధర్, రాష్ట్ర కన్వీనర్ ఎం.డి. నజీర్ అహ్మద్, స్టేట్ అబ్జర్వర్ ఎన్. వాసుదేవ్ సింగ్, పబ్లిక్ సేఫ్టీ ఆఫీసర్ మహ్మద్ అమీర్ అలీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్‌చార్జ్ లాకావత్ కిరణ్, వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ కారంగుల సురేష్ బాబు, నేషనల్ బోర్డ్ మెంబర్ శ్రీనివాసరావు, పబ్లిక్ సేఫ్టీ ఆఫీసర్ తోట అరవింద్, కోలా రామకృష్ణ, చిలువేరి మురళీకృష్ణ, మధుకర్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల సభ్యులు పాల్గొన్నారు. సమావేశాన్ని విజయవంతం చేసిన సభ్యులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

జూరాల ప్రాజెక్టుకు పెరుగుతున్న వరద ప్రవాహం

సోమశిల లో పర్యాటకుల నిలిపివేత సంగమేశ్వర దర్శనం

(గద్వాల ప్రతినిధి) ప్రజా కలం జులై 26

ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల మహారాష్ట్ర నుంచి నారాయణపూర్ ఆల్మట్టి డ్యాం పూర్తిగా నిండిపోవడంతో దిగువకు వదులుతున్న మీరు ప్రవాహం వల్ల జోగులాంబ గద్వాల జిల్లా సమీపంలోని జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతుంది. రెండు రోజుల్లో

జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండే అవకాశాలు కనిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. జూరాలకు ప్రస్తుతం 32 27 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నట్లు పూర్తిస్థాయి నీటిమట్టం 318. 516 మీటర్లు కాగా ప్రస్తుతం 316. 09 మీటర్లు ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు పూర్తిస్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలకు గాను ప్రస్తుతం 5.318 టిఎంసిలు నీరు ఉన్నట్లు తెలిపారు. ఈ వరద ప్రవాహం వల్ల ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల నాగర్ కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ సమీపంలో గల ప్రముఖ పుణ్యక్షేత్రం సోమశిల సంగమేశ్వర బోటింగ్ సేవలు నిలిపి వేసినట్లు అధికారులు తెలిపారు. వరద ప్రవాహం వల్ల ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటూ జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వరద జలాలు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా పర్యాటకులు ఎవరు సంగమేశ్వర దర్శనం కోసం రావద్దని తెలిపారు. ఈ విషయం పర్యాటకులు గమనించాలని పర్యాటకశాఖ అధికారి కల్వరాల నరసింహ తెలిపారు.

ఖమ్మం గాంధీచౌక్ వరప్రదాత షిర్డిసాయి మందిరంలో సాయి సత్య వ్రతం.

ఖమ్మం జులై 26(ప్రజా కలం న్యూస్)

ఖమ్మం నగరంలోని ఆదివారం గాంధీచౌక్ వరప్రదాత షిర్డిసాయి మందిరం 16వ గురుపౌర్ణమి వేడుకలలో భాగంగా ఆదివారం శ్రీ సాయినాధునికి గోధుమలతో అభిషేకం , శ్రీ సాయి సత్య వ్రతం నిర్వహించారు . భక్తిశ్రద్ధలతో సుమారుగా 200 మంది జంటలు శ్రీ సాయి సత్య వ్రతం లో కూర్చున్నారు . జ్ఞాన సరస్వతి పుట్టపర్తి చాగంటి శ్రీ వెంపల అన్నాజి సాయిరాం చే (పుట్టపర్తి) ఆధ్యాత్మిక ప్రవచనములు జరిగాయి . ఈ కార్యక్రమానికి భద్రాద్రి బ్యాంక్ చైర్మన్ శ్రీ చెరుకూరి కృష్ణమూర్తి , రాజ్యలక్ష్మి అతిథులుగా వచ్చారు . ఈ కార్యక్రమం మొత్తం మందిర చైర్మన్ శ్రీ వేములపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగాయి . మందిర

ప్రధాన పూజారులు కిరణ్ శర్మ , జనార్ధన చార్యులు , అర్వపల్లి నిరంజన్ , పివిడి ప్రసాద్ , కురు వేళ్ళ జగన్ మోహన్ రావు , వేల్పురి సత్యనారాయణ , డాక్టర్ వేములపల్లి నరేష్ , గన్నవరపు నాగేశ్వరరావు , సిమెంట్ మురళి, ఖమ్మం పుర ప్రముఖులు డాక్టర్స్ పాల్గొన్నారు .

వడ్లకొండ దీక్షిత భౌతిక కాయానికి నివాళులర్పించిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

బొమ్మలరామారం, జూలై 26 (ప్రజా కలం)

యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మలరామారం మండలం, మైలారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వడ్లకొండ ఆనంద్ చారి కుమార్తె డాక్టర్ వడ్లకొండ దీక్షిత అకాల మరణం చెందడం పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రగాఢ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ వడ్లకొండ దీక్షిత భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం దుఃఖసంతప్త కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ భగవంతుడు కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని, దివంగత డాక్టర్ వడ్లకొండ దీక్షిత ఆత్మకు శాంతి చేకూరాలని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రార్థించారు. వీరితోపాటుగా భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి, పలువురు ప్రముఖులు భౌతిక కాయానికి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు

కూసుమంచి ప్రజల కంటి వెలుగుకు ఉచిత వైద్య శిబిరం

సర్పంచ్ కొండా కృష్ణవేణి మహిపాల్ ప్రారంభం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు.

పాలేరు , జూలై 26(ప్రజా కలం న్యూస్)

కూసుమంచి మండల కేంద్రంలోని ఆదివారం గ్రామ పంచాయతీ

కార్యాలయంలో 8వ వార్డు సభ్యుడు గుండా ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మ్యాక్సీ విజన్ కంటి ఆసుపత్రి వారి ఉచిత కంటి వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ శ్రీమతి కొండా కృష్ణవేణి మహిపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఇటువంటి అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని కంటి పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన వైద్య సేవలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చెరుకుపల్లి వీరయ్య, అంతోటి వెంకన్న, అర్వపల్లి ఉపేందర్, గోపే వరలక్ష్మి, గ్రామ మాజీ సర్పంచ్ గుండా దామోదర్ రెడ్డి, తంగెళ్ల చంద్రయ్య, రాజారావు, మ్యాక్సీ విజన్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది శరత్‌తో పాటు పలువురు గ్రామ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

దండోరా ఉద్యమ నాయకుడు సగుర్తి కోటేశ్వరరావుకు ఘన నివాళి,కుటుంబ సభ్యులను పరామర్శించిన డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్.

ఖమ్మం జూలై 26 (ప్రజా కలం న్యూస్)

ఇల్లందు నియోజకవర్గంలోని కామేపల్లి మండలం జాస్తిపల్లి గ్రామంలో దండోరా ఉద్యమ నాయకుడు, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా (టీఎంహెచ్డీ) ఖమ్మం జిల్లా అధికార ప్రతినిధి సగుర్తి కోటేశ్వరరావు దశదినకర్మల సందర్భంగా టీఎంహెచ్డీ రాష్ట్ర అధ్యక్షుడు, దళితరత్న డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్, అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, కోటేశ్వరరావు ఆశయాలను కొనసాగించే బాధ్యత అందరిదేనని పేర్కొన్నారు. డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, కోటేశ్వరరావు తెలంగాణ మాదిగ హక్కుల దండోరా ఉద్యమాన్ని గ్రామీణ స్థాయిలో బలోపేతం చేయడంలో విశేష కృషి చేశారని కొనియాడారు. ఉద్యమానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొంటూ, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎంహెచ్డీ వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను కనకరాజు మాదిగ, కోటేశ్వరరావు కుమారులు సగుర్తి సురేందర్, రాజేందర్, వంశీ, వినోద్, ప్రమోద్, కుటుంబ సభ్యులు, అలాగే టీఎంహెచ్డీ నాయకులు కొండపల్లి మధు, కొమ్ము రామారావు, పగిడిపల్లి కాటయ్య, ప్రభాకర్, రఘుపతి, రమేష్, వెంకన్న, ముక్కాలం ప్రసాద్, రవి మోహన్‌రావు, లచ్చయ్య తదితరులు పాల్గొని కోటేశ్వరరావుకు ఘనంగా నివాళులర్పించారు.

అమరావతిలో రిటర్నబుల్ రెసిడెన్షియల్

కమర్షియల్ ప్లాట్ల 'రీ-సేల్' లావాదేవీలు

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంతంలో రియల్ ఎస్టేట్ రంగానికి మళ్లీ అద్భుతమైన పూర్వవైభవం వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి నిర్మాణ పనులను దాదాపు రూ. 48 వేల కోట్లతో వేగవంతం చేయడం, ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధుల విడుదల వంటి సానుకూల పరిణామాలు మార్కెట్‌కు కొత్త బూస్ట్ ఇచ్చాయి. రిటర్నబుల్ రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్ల 'రీ-సేల్' లావాదేవీలు ప్రస్తుతం రికార్డు స్థాయిలో ఊపందుకున్నాయి.రాజధాని కోర్ ఏరియా పరిధిలోకి వచ్చే తుళ్లూరు, మంగళగిరి, మందడం, వెలగపూడి పరిసర ప్రాంతాల్లోని భూములకు ఇప్పుడు ఇన్వెస్టర్ల నుంచి భారీ డిమాండ్ ఏర్పడింది. ఒకప్పుడు వెలవెలబోయిన సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు ఇప్పుడు కొనుగోలుదారులు, రియల్టర్ల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లతో నిత్యం హడావుడిగా మారుతున్నాయి. ముఖ్యంగా తుళ్లూరు పరిసరాల్లో ఐదేళ్ల క్రితం చదరపు గజం రూ. 12,000 నుంచి రూ. 15,000 పలికిన సీఆర్డీయే ప్లాట్ల ధరలు, ఇప్పుడు డిమాండ్‌ను బట్టి గజం రూ. 35,000 నుండి ఏకంగా రూ. 55,000 మార్కును తాకాయి. పక్కా లీగల్ క్లియరెన్స్, ప్రభుత్వ గుర్తింపు ఉండటంతో హైదరాబాద్, బెంగళూరు సహా ఎన్ఆర్ఐ ఇన్వెస్టర్లు ఇక్కడి ప్లాట్లను కొనుగోలు చేయడానికి పోటీ పడుతున్నారు.రాజధాని కోసం నాడు భూములిచ్చిన రైతులకు సీఆర్డీయే ఇటీవలే వీధిపోట్లు, వాస్తు లోపాలు లేని ప్లాట్లను లాటరీ ద్వారా కేటాయించి ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేసింది. ల్యాండ్ పూలింగ్ ప్లాట్ల తొలి విడత రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం ఎటువంటి ఫీజు వసూలు చేయకపోవడంతో రైతులు వేగంగా ప్రక్రియ ముగిస్తున్నారు. అలా రిజిస్ట్రేషన్ పూర్తయిన ప్లాట్లను సొంత అవసరాల కోసం, ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా రైతులు ఓపెన్ మార్కెట్‌లో విక్రయిస్తుండటంతో క్రయవిక్రయాల సర్కిల్ వేగంగా తిరుగుతోంది. టైటిల్ పక్కాగా ఉండటం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుండటంతో ఎలాంటి లీగల్ రిస్క్ లేని ఈ ప్లాట్లను కొనేందుకు బయ్యర్లు ఎగబడుతున్నారు. మరో వైపు ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఇందుకు పూర్తి భిన్నమైన, విచిత్రమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. సొంత యువత భవిష్యత్తు కోసం, పక్క రాష్ట్రాల రాజధానులపై ఆధారపడే అవసరం లేకుండా ప్రభుత్వం ఎంతో ప్రణాళికాబద్ధంగా నిర్మిస్తున్న సొంత రాజధాని అమరావతిపై.. సొంత రాష్ట్రానికి చెందిన వారే కుట్రలు చేయడం, దాన్ని కొంతమంది సమర్థించడం నవ్యాంధ్రకు పట్టిన పెద్ద దౌర్భాగ్యం. ఈ వైఖరి ఎలా ఉందంటే.. "నా కన్ను పోయినా పర్వాలేదు.. ఎదుటివారికి శకునం కాకూడదు" అన్న చందంగా, మన కొంపను మనమే తగులబెట్టుకున్నట్లు ఉంది. "వ్యక్తిగతంగా మాకు ఎలాంటి లాభం లేదు కాబట్టి, అమరావతితో మాకేం పని?" అని భావించే కొంతమంది అమాయకులను, స్వార్థపరులను అడ్డం పెట్టుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, దాని అనుకూల శక్తులు కుట్రలకు తెరలేపుతున్నాయిఐదేళ్ల కాలంలో జగన్ మోహన్ రెడ్డి అమరావతిని పూర్తిగా పాడుబెట్టి, ఒక అడవిలా మార్చేసిన వైనాన్ని రాష్ట్రం చూసింది.ఆ 'జంగిల్' క్లియర్ చేయడానికే కొత్త ప్రభుత్వానికి దాదాపు ఆరు నెలల కాలం పట్టిందంటే విధ్వంసం ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు. ఆ అవరోధాలన్నింటినీ దాటుకుని, గత ఏడాదిన్నర కాలంగా శ్రమించి రాజధాని పనులను మళ్లీ పట్టాలెక్కించిన తరుణంలో.. ఇప్పుడు మళ్లీ బెంగళూరు వేదికగా కుట్రల పర్వం ప్రారంభం కావడం ఘోరం. రాజధాని అనేది కేవలం ఒక ప్రాంతానికి సంబంధించిన భూముల వ్యవహారం కాదు.అది కోట్లాదిమందిఆంధ్రుల ఆత్మగౌరవం, రాబోయే తరాల ఉపాధి కేంద్రం. ఇటువంటి మహోన్నత ప్రాజెక్టును రాజకీయ కక్ష సాధింపుల కోసం దెబ్బతీయాలని చూడటం రాష్ట్ర ద్రోహమే అవుతుంది.

బెజవాడలో అన్నదమ్ముల మధ్య సవాల్

విజయవాడ : విజయవాడలో అన్నా దమ్ముల రాజకీయ సమరం జోరుగా సాగుతోంది. ఒకరు ఎంపీగా ఉన్నారు. మరొకరు మాజీ ఎంపీ. ఈ ఇద్దరి మధ్యన చిచ్చు రాజుకుంది. ఎత్తులు పై ఎత్తులతో అన్నదమ్ముల పాలిటిక్స్ సాగుతోంది. తాజాగా చూస్తే కేశినేని నాని ఎంపీ చిన్ని మీద ఏకంగా భూకబ్జా ఆరోపణలతో అతి పెద్ద బాంబునే వేశారు. కేశినేని చిన్ని ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నం చేశారంటూ కేశినేని నాని గట్టిగానే టార్గెట్ చేశారు. దీంతో విజయవాడ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కిందివిజయవాడ ఎంపీ కేశినేని చిన్ని హైదరాబాద్ దగ్గరలోని షంషిగూడలో 112.72 ఎకరాల ప్రభుత్వ భూమిని భారీగా కబ్జా చేసేందుకు ప్రయత్నించారని కేశినేని నాని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈసారి ఆయన నేరుగా తెలంగాణా ముఖ్యమంత్రినే మధ్యలోకి తీసుకుని వచ్చారు. తాను ఈ భూకబ్జా యత్నం విషయంలో రేవంత్ రెడ్డికే బహిరంగంగా విజ్ఞప్తి చేస్తున్నాను అని అన్నారు. ఈ భూమిని నిజానికి టీజీ ఐఐసీ ఐటీ పార్క్ కోసం కేటాయించింది అని నాని పేర్కొన్నారు. అయితే విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఆయనకు సంబంధించిన సంస్థలు అయితే ఒక మోసపూరితమైన న్యాయపరమైన ఒప్పందం ద్వారా ఆ భూమిని అక్రమంగా తీసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాయని నాని విమర్శించారు.ఇక ఇది పక్కాగా ప్రభుత్వం భూమి అని ప్రైవేట్ వ్యక్తులకు సంస్థలకు ఎలాంటి యాజమాన్యం హక్కులు లేనే లేవని ఆ జిల్లా కలెక్టర్ కూడా సమర్పించిన అఫిడవిట్ లో స్పష్టం చేసారు అని నాని తెలిపారు. అందువల్ల ఈ ఆరోపితమైన ఆక్రమణను అడ్డుకోవాలని ఆయన కోరారు. అంతే కాదు ఇందులో ఎవరి ప్రమేయం ఉందో వారి మీద క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవాలని ఆయన తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డికి డైరెక్ట్ గానే వినతి చేసారు. అంతే కాదు ఒక ప్రభుత్వ భూమిని రక్షించే విషయంలో హైడ్రా అలాగే ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ కూడా జోక్యం చేసుకోవాలని కూడా కేశినేని నాని కోరడం విశేషం.కేశినేని నాని ఈ ఆరోపణలు చేస్తూ ఊరుకోలేదు. తన సోషల్ మీడియా ద్వారా చేసిన ఆ ఆరోపణలతో కూడిన ట్వీట్ ని ఆయన తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు, అలాగే ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా అగ్ర నేతలు అందరికీ ట్యాగ్ చేయడం విశేషం. చిన్ని రియాక్షన్ : ఇదిల ఉంటే తన మీద సోదరుడు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు అని ఇప్పటికే కేశినేని చిన్ని లీగల్ నోటీసులు జారీ చేశారు. అంతే కాదు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఇపుడు ఏకంగా వేల కోట్ల రూపాయల విలువలైన ప్రభుత్వ భూమిని చిన్ని ఆక్రమించడానికి ప్రయత్నం చేస్తున్నారు అని నాని ఆరోపణలు చేయడంతో చిన్ని ఏమి చేస్తారు అన్న చర్చ సాగుతోంది. మొత్తం మీద చూస్తే కేశినేని బ్రదర్స్ ల మధ్య రచ్చ ఇప్పట్లో ఆగేలా కనిపించడం లేదు అని అంటున్నారు.

రెండు ఎమ్మెల్సీ సీట్లకు 10 మంది పోటీ

విజయవాడ : కూటమి నేతలకు నామినేటెడ్ పదవులు ఊరిస్తున్నాయి. రాజ్యసభ ఎన్నికల సందడి ముగిసిన వెంటనే, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ రేసు మొదలైంది. వచ్చేనెలలో ఇద్దరు ఎమ్మెల్సీల పదవీకాలం ముగియనుంది. ఈ ఇద్దరూ గవర్నర్ కోటాలో ఎంపికైన వారే కావడంతో ఆ రెండు స్థానాలను అధికార కూటమి దక్కించుకునే పరిస్థితి ఉందని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత రెండు ఎమ్మెల్సీ స్థానాలను భర్తీ చేసే చాన్స్ రావడంతో కూటమి నేతలు ఎవరికి చాన్స్ ఇస్తారనేది ఆసక్తికరంగా మారింది. రెండేళ్లుగా పదవుల కోసం ఎదురుచూస్తున్న పలువురు నేతలు ఈ సారైనా అధిష్టానం తమకు అవకాశం ఇస్తుందా? లేక ఈ సారి కూడా 'సారీ' అంటూ చేతులు దులుపుకుంటుందా? అని టెన్షన్ పడుతున్నారు.వచ్చేనెల 27తో శాసనమండలిలో గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా ఎంపికైన జకియా ఖానం, పండుల రవీంద్రబాబు పదవీకాలం ముగియనుందని శాసన మండలి రికార్డులు ద్వారా తెలుస్తోంది. దీంతో ఆ రెండుస్థానాల భర్తీకి జులైలో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని అంటున్నారు. జూన్ లో 4 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరిగితే, పలువురు ఆశావహులు పోటీ పడ్డారు. కానీ, రకరకాల సమీకరణాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ నలుగురు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ సమయంలో పలువురు ఆశావహులకు ఎమ్మెల్సీ అవకాశం ఇస్తామని హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. దీంతో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులపై వారు ఆశ పెట్టుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా మంది ఎమ్మెల్సీ పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో గత ఎన్నికల సమయంలో సీట్లు కోల్పోయిన త్యాగరాజులే ఎక్కువగా ఉన్నారు. ఇలా ఎమ్మెల్సీ పదవులు కోరుకుంటున్న వారిలో టీడీపీ నేతలే ఎక్కువగా ఉన్నారు. వీరిలో ప్రధానంగా మాజీ మంత్రి, సీనియర్ నేత దేవినేని ఉమాతోపాటు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, బుద్ధా వెంకన్న, వంగవీటి రాధాకృష్ణ, మహాసేన రాజేశ్ వంటి వారి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఈ ఐదుగురికి ఎమ్మెల్సీ పదవులు ఇస్తామని 2024 ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ హామీ ఇచ్చినట్లు గుర్తు చేస్తున్నారు.సాక్ష్యంగా నిలిచిన మరో వ్యక్తి ఉప ముఖ్యమంత్రి పవన్ కోసం టికెట్ వదులుకున్న పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ విషయంలో పార్టీ కేడర్ కూడా ఉత్కంఠగా ఎదురుచూస్తోందని అంటున్నారు. తాజాగా ఆయనను నియోజకవర్గ ఇంచార్జి బాధ్యతల నుంచి కూడా తప్పించారు. దీంతో వర్మ త్యాగం నిష్ఫలం అయిందని అసంతృప్తి కేడర్ లో వ్యక్తమవుతోందని అంటున్నారు. అయితే వర్మకు తగిన న్యాయం చేయాలని ముఖ్య నేతలు ఇద్దరూ భావిస్తున్నారని చెబుతున్నారు. దీంతో ఈ సారి ఎమ్మెల్సీ చాన్స్ ఇస్తారా? లేదా? అన్నది ఆసక్తి రేపుతోంది.నిందితుడికి మరణ దండన ఖాయం చేసిన కోర్టు మరోవైపు మైలవరం సీటు వదులుకున్న దేవినేని ఉమా, విజయవాడ పశ్చిమ సీటును త్యాగం చేసిన బుద్ధా వెంకన్న, పి.గన్నవరం నుంచి పోటీకి అవకాశం దక్కినా, చివరి నిమిషంలో అధిష్టానం సూచనతో వెనక్కి తగ్గిన మహాసేన రాజేశ్ కూడా ఎమ్మెల్సీ ఆశావహులుగా గట్టి పోటీ ఇస్తున్నారని చెబుతున్నారు. ఇక పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేసిన మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా పేరు కూడా చాలాసార్లు తెరపైకి రావడం, ఆ తర్వాత మరుగున పడిపోవడం జరుగుతోందని చెబుతున్నారు. దీంతో ఆయన పేరు ఈ సారి అయినా పరిశీలిస్తారా? లేదా? అన్నది చూడాల్సివుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం కాపు సామాజిక వర్గం కేంద్రంగా రాజకీయం నడుస్తున్ననేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే రాధా పేరు పరిశీలించే అవకాశం ఉందని అంటున్నారు. మొత్తానికి మరో నెల రోజుల్లో భర్తీ అయ్యే గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులు కూటమిలో ఆసక్తికర రాజకీయానికి తెరతీశాయని అంటున్నారు. ఈ విషయంలో ప్రధాన నేతలు ఇద్దరు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేదే ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.ఇ

అలా ముగిసిన శ్రీ లక్ష్మి ముగింపు

విజయవాడ : సీనియర్ ఐఏఎస్ అధికారిణి వై.శ్రీలక్ష్మి రిటైర్ అయ్యారు. ఈ నెల 25న ఆమెకు పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రెండేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత రిటైర్మెంటుకు ఐదు రోజుల ముందు పోస్టింగ్ ఇచ్చినా, వరుసగా మూడు రోజులు సెలవు కావడంతో శ్రీలక్ష్మి కేవలం రెండు రోజులు మాత్రమే విధులకు హాజరయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇందులో ఒక రోజు బాధ్యతలు తీసుకోవడానికి సరిపోగా, రెండో రోజు రిటైర్మెంటు ఉత్తర్వులు తీసుకున్నారు. ఈ విధంగా ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి ఎలాంటి ప్రాధాన్యం లేని పోస్టులో రిటైర్ అవ్వడం హాట్ టాపిక్ అవుతోంది. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డితో ఉన్న సంబంధాలు కారణంగా ప్రభుత్వం శ్రీలక్ష్మిని రెండేళ్లుగా వెయిటింగులో పెట్టిందని అంటున్నారు. ఇక రిటైర్మెంటును దృష్టిలో పెట్టుకుని న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా శ్రీలక్ష్మికి పోస్టింగు ఇచ్చిందని అంటున్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారిణి వై.శ్రీలక్ష్మి ఉద్యోగ జీవితానికి కూటమి ప్రభుత్వం విలక్షణమైన ముగింపు చెప్పిందని అంటున్నారు. కేంద్ర కేబినెట్ కార్యదర్శి హోదాలో రిటైర్ కావాల్సిన శ్రీలక్ష్మి ఎటువంటి గుర్తింపు లేని పోస్టులో రిటైర్ కానుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 22 ఏళ్లకే సర్వీసులోకి వచ్చిన శ్రీలక్ష్మి ఉమ్మడి రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ కేడర్ కు వెళ్లిపోయారు. అయితే గత ప్రభుత్వంలో తెలంగాణ కేడర్ నుంచి ఏపీకి మారిన శ్రీలక్ష్మి మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పనిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోస్టింగుకు నోచుకోక రెండేళ్లుగా వెయిటింగులో ఉన్నారు. అంతా సక్రమంగా ఉంటే ఆమె ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేదా కేంద్ర కేబినెట్ కార్యదర్శి ర్యాంకులో రిటైర్ కావాల్సివుందని అంటున్నారు. కానీ, ఆమెపై ఉన్న కేసుల కారణంగా ఆలిండియా సర్వీసుల్లోని అత్యున్నత పోస్టులకు అర్హత కోల్పోయారని వ్యాఖ్యానిస్తున్నారు.ఇక 1988లో సర్వీసులోకి వచ్చిన శ్రీలక్ష్మి దాదాపు 38 ఏళ్లపాటు ఐఏఎస్ అధికారిణిగా వివిధ హోదాల్లో పనిచేశారు. అయితే ఉమ్మడి రాష్ట్రంలో గనుల శాఖ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ఓబుళాపురం మైనింగ్ స్కాంలో ఇరుక్కుని కెరీర్ లో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారని చెబుతున్నారు. ఓబుళాపురం మైనింగ్ స్కాం నిందితుల జాబితాలో శ్రీలక్ష్మిని సీబీఐ చేర్చడంతో 2011లో అరెస్టు అయ్యారు. ఆ తర్వాత ఈ కేసు విషయమై న్యాయపోరాటం చేస్తూ పలుమార్లు జైలుకు వెళ్లడం, బెయిలుపై రావడం ద్వారా ఆమె కెరీర్ తీవ్ర ఇబ్బందుల్లో పడిపోయిందని అంటున్నారు. ఈ వ్యవహారం వల్లే పెద్ద పోస్టింగులకు నోచుకోలేకపోయారని అంటున్నారు. చివరికి రిటైర్మెంట్ సమయంలోనూ ఓబుళాపురం మైనింగ్ స్కాం భూతంలా వెంటాడంతో సాధారణ పరిపాలన శాఖలో జీపీఎం అండ్ ఏఆర్ విభాగంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సరిపెట్టుకోవాల్సి వచ్చిందని అంటున్నారు. సాక్ష్యంగా నిలిచిన మరో వ్యక్తి యంగ్ అండ్ డైనమిక్ ఆఫీసర్ గా కెరీర్ ప్రారంభించిన శ్రీలక్ష్మి.. ఉమ్మడి రాష్ట్రంలో ఓబుళాపురం మైనింగ్ ద్వారా అత్యంత వివాదాస్పద అధికారిణిగా ముద్రపడ్డారని అంటున్నారు. అంతేకాకుండా ఆ కేసు ద్వారా ప్రస్తుత విపక్ష నేతలతో ఆమెకు బలమైన సంబంధాలు

పీవీ సునీల్ రిటైర్మెంట్ అనుహ్యం

విజయవాడ : సుదీర్ఘకాలం పాటు వివాదాలకు కేంద్రీకృతంగా మారిన సీనియర్ ఐపీఎస్ అధికారి, ఏపీ సీఐడీ మాజీ అడిషనల్ డీజీ పీవీ సునీల్‌కు మార్‌కు కూటమి ప్రభుత్వం ఊహించని గట్టి షాక్ ఇచ్చింది. ఈ నెలాఖరున ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే ఆయనను జూన్ 30న "సేవల నుంచి కేవలం రిలీవ్" చేస్తూ అత్యంత సంచలన ఉత్తర్వులు జారీ చేసింది ప్రభుత్వం. ఆల్ ఇండియా సర్వీస్ నిబంధనలను పక్కాగా అమలు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు ఐపీఎస్ వర్గాలతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.సాధారణంగా ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా ఎలాంటి మచ్చ లేకుండా తన సుదీర్ఘ సర్వీసును ముగిస్తే, ప్రభుత్వం పూర్తి రిటైర్మెంట్ ప్రయోజనాలతో గౌరవంగా వంపిస్తుంది. కానీ, సునీల్‌కుమార్ వ్యవహారంలో సర్కార్ చట్టబద్ధమైన వీడ్కోలుకు బదులు పోలీస్ ఎస్కేప్ రూట్ ను క్లోజ్ చేసే వ్యూహాన్ని ఎంచుకుంది. ఆయనపై ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యం, ల్యాండ్ గ్రాబింగ్, ఫోర్జరీ మరియు క్రిమినల్ కేసులపై సాగుతున్న విచారణలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా ఉండేందుకే ఈ రిలీవింగ్ అస్త్రాన్ని ప్రయోగించింది. ఆయన విధుల్లోంచి తప్పుకున్నప్పటికీ, నిందితుడిగా ఆయనపై ఉన్న దర్యాప్తు సంస్థల విచారణలు సివిల్ వ్యక్తిగా యథాతథంగా కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.ఈ తాజా ఉత్తర్వుల వల్ల పీవీ సునీల్‌కుమార్‌కు తక్షణమే భారీ ఆర్థిక, సాంకేతిక షాక్‌లు తగలనున్నాయి. ఆల్ ఇండియా సర్వీసెస్ రూల్స్ ప్రకారం.. ఇలా విచారణలు పెండింగ్‌లో ఉంచి రిలీవ్ చేసినప్పుడు, సదరు అధికారికి అందాల్సిన పూర్తి స్థాయి రిటైర్మెంట్ బెనిఫిట్స్ పూర్తిగా నిలిచిపోతాయి. ఆయనకు కేవలం బతుకుదెరువుకు అవసరమైన తాత్కాలిక ప్రొవిజనల్ పెన్షన్ మాత్రమే అందుతుంది. రేపు విచారణ ముగిసి కోర్టులో కానీ, శాఖా పరంగా కానీ ఆయన దోషిగా తేలితే.. ఈ పెన్షన్‌ను కూడా శాశ్వతంగా రద్దు చేసే లేదా భారీగా కోత విధించే సర్వాధికారాలు ప్రభుత్వానికి లీగల్‌గా సంక్రమిస్తాయి.ఏపీ ప్రభుత్వం తదుపరి కఠిన చర్యల కోసం రాష్ట్ర డీజీపీకి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. జూన్ 30న సాయంత్రం ఆయన ఆఫీస్ నుంచి రిలీవ్ అయిన వెంటనే, ఆయనపై ఉన్న క్రిమినల్ కేసుల దర్యాప్తును మరింత వేగవంతం చేయాలని, చట్టపరమైన చర్యల కోసం అవసరమైన చార్జ్‌షీట్లను కోర్టుల్లో దాఖలు చేయాలని సూచించింది. గత వైసీపీ హయాంలో రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న సునీల్‌కుమార్.. పదవీ విరమణతోనైనా కేసుల నుంచి విముక్తి లభిస్తుందని ఆశించినా, కూటమి ప్రభుత్వం నిబంధనల ఉచ్చుతో వేసిన పక్కా స్కెచ్‌తో ఆయన భవిష్యత్తు ఇప్పుడు పూర్తిగా అంధకారంలో పడిపోయింది.

భోగాపురం లో కేంద్ర విద్యాశాఖ

మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పర్యటన

భోగాపురం : కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో కలిసి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ విజయనగరం జిల్లా భోగాపురం లోని పీఎంశ్రీ ఏపీ మోడల్ స్కూల్ ను సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలలో ఆధునిక విద్యా బోధ న, మౌలిక వసతులను మంత్రులు పరిశీలించారు. విద్యార్థులు, ఉపా ధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ముందుగా పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సి.పార్వతి, విద్యార్థులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. ఈ సంద ర్భంగా విద్యార్థులు, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిం చారు.పాఠశాల మొత్తం కలియ తిరిగిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ వసతు లను పరిశీలించారు. ముందుగా జాదు పిటారా కిట్ ను కేంద్ర మంత్రి పరిశీలించారు. జాదు పిటారా కిట్ గురించి సిబ్బంది, మంత్రి లోకేష్ కేంద్ర మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ శాల విద్యాశాఖ అందిస్తున్న స్టూడెంట్ ప్రోగ్రెస్ కార్డ్, అసెస్ మెంట్ బుక్ లెట్ ను కేంద్ర మంత్రికి లోకేష్ చూపించారు. విలువల విద్య కోసం ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలతో రూపొందించిన పుస్తకాల గురించి మంత్రి లోకేష్ విశదీకరించారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ ను ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పరిశీలించారు.

వైసీపీ టార్గెట్ పోలీస్

గుంటూరు : ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న తాజా రాజకీయ వ్యూహాలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ప్రజాక్షేత్రంలో తమ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన ప్రధాన ప్రతిపక్షం, శాంతిభద్రతలను కాపాడే పోలీసు వ్యవస్థనే తమ ప్రధాన ప్రత్యర్థిగా మార్చుకున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల ఆ పార్టీ సీనియర్ నేత పేర్ని నాని ఒక పోలీసు అధికారిని ఉద్దేశించి "మూడేళ్ల తర్వాత నీ సంగతి చూస్తానురా " అంటూ బహిరంగంగానే హెచ్చరించడం, మరోవైపు సాయికృష్ణ ఇష్యూను సాకుగా చూపిస్తూ మొత్తం పోలీసు శాఖనే నిందితులుగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం ఇందులో భాగమే.రాజకీయ ప్రయోజనాల కోసం పదే పదే పోలీసులపై ఇలాంటి ఒత్తిళ్లు తీసుకురావడం పక్కా ప్రణాళిక ప్రకారమే జరుగుతోందనే అనుమానాలు బలపడుతున్నాయి.వైసీపీ ఇలా పద్ధతి ప్రకారం పోలీసుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయాలని చూడటం వెనుక ఒక లోతైన వ్యూహం దాగి ఉంది. శాంతిభద్రతలను పర్యవేక్షించే వ్యవస్థను మానసికంగా భయపెట్టడం ద్వారా, క్షేత్రస్థాయిలో తమ అరాచక రాజకీయాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగించవచ్చనేది ఆ పార్టీ అగ్రనాయకత్వం ఆలోచనగా కనిపిస్తోంది. తాము అధికారంలో లేనప్పటికీ.. రేపు రాబోయే రోజుల్లో తామే వస్తామంటూ హెచ్చరికలు జారీ చేయడం ద్వారా, విధుల్లో ఉన్న అధికారులు చట్టప్రకారం కఠిన నిర్ణయాలు తీసుకోకుండా వెనకడుగు వేసేలా 'ఫియర్ సైకాలజీ'ని ప్రయోగిస్తున్నారు.ఇలాంటి ధోరణి ప్రజాస్వామ్య వ్యవస్థల మనుగడకే ప్రమాదకరంగా మారుతోంది. చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసులపైనే భౌతిక దాడులకు దిగడం, లేదా వారిని వ్యక్తిగతంగా, సామాజికంగా బద్నాం చేయడం వల్ల క్షేత్రస్థాయిలో ఉన్న కానిస్టేబుల్స్ నుంచి ఉన్నతాధికారుల వరకు తీవ్ర అసంతృప్తి నెలకొనే అవకాశం ఉంది. పోలీసుల రక్షణకే ముప్పు వాటిల్లితే, రేపు సామాన్య ప్రజల భద్రతకు ఎవరు గ్యారెంటీ ఇస్తారనే ప్రశ్న తలెత్తుతోంది. ప్రతిపక్షం చేస్తున్న ఈ వ్యూహాత్మక దాడులను కేవలం ఒక రాజకీయ ప్రక్రియగా వదిలేస్తే, అది భవిష్యత్తులో మరింత శాంతిభద్రతల క్షీణతకు కారణమవుతుందిఈ అరాచక, బెదిరింపు రాజకీయాలను నిర్వీర్యం చేయాల్సిన బాధ్యత ఇప్పుడు పోలీసు యంత్రాంగంపైనే ఉంది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని, విధులకు ఆటంకం కలిగిస్తూ పోలీసుల స్థైర్యంపై దాడి చేస్తున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టకూడదని మేధావులు అభిప్రాయపడుతున్నారు. పార్టీలతో సంబంధం లేకుండా, చట్టాన్ని ఉల్లంఘించే నాయకులకు చట్టపరంగానే సరైన 'షాక్ ట్రీట్‌మెంట్' ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే వ్యవస్థల పట్ల ప్రజలకు నమ్మకం పెరుగుతుందని, పోలీసుల ఆత్మస్థైర్యం చెక్కుచెదరకుండా నిలబడుతుందని పౌర సమాజం గట్టిగా ఆకాంక్షిస్తోంది.

మైండ్ గేమ్...ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ అన్ని ప్రధాన విషయాల్లోనూ అధికార పార్టీని ట్రాప్ లోకి లాగే ప్రయత్నం చేస్తుంది. ప్రజలకు అవసరమైన అంశాలతో పాటు సామాజికపరమైన అంశాలను కూడా తమకు అనుకూలంగా మలచుకుంటూ, అధికార పార్టీని ఇబ్బందులపాలు చేయడానికి ప్రయత్నిస్తుంది. వైసీపీ ట్రాప్ లో కొంత వరకూ టీడీపీ పడుతున్నట్లే కనిపిస్తుంది. ఆ ఒక్కటి చాలదూ.. అన్నట్లు ఇక వైసీపీ నాయకత్వం వేగం పెంచింది. పాలిటిక్స్ లో హీట్ తగ్గకుండా ప్రతి రోజూ వార్తల్లో నిలిచి ఉండేలా చూసుకుంటూ అధికార పార్టీని ఇబ్బందుల పాలు చేయడానికి వేస్తున్న ప్లాన్ ఎంత వరకూ ఫలిస్తుందో తెలియదు కానీ, కొంత వరకూ సక్సెస్ అయినట్లే కనిపిస్తుంది... విజయవాడలో సాయికృష్ణ అదృశ్యం కేసులోనూ వైసీపీ వెంటనే రియాక్ట్ అయి బాధిత కుటుంబాన్ని జగన్ పరామర్శించిన తర్వాతనే ప్రభుత్వం వేగంగా స్పందించిందని, తొలుత విచారణకు ఆదేశించి, ఆ తర్వాత సిట్ ను నియమించిందని వైసీపీ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటుంది. నిజానికి అప్పటి వరకూ విజయవాడలోని టీడీపీ నేతలు కూడా దీనిని పట్టించుకోలేదు. కానీ ప్రధాన సామాజికవర్గాన్ని లక్ష్యంగా చేసుకుని వైసీపీ ప్రయత్నించడంతో తాము వెనకబడి పోతామన్న భయంతో టీడీపీ పరుగులు పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందన్న కామెంట్స్ సొంత పార్టీ సోషల్ మీడియాలోనే వినిపిస్తున్నాయి. దీనిని పూర్తిగా కొట్టిపారేయలేని పరిస్థితి. మరొకవైపు నిన్న వైసీపీ నేతలు రాజధాని అమరావతి పర్యటన పెట్టుకోవడం కూడా అందులో భాగమే. అమరావతికి వెళ్లేందుకు వైసీపీ నేతలు చేసిన ప్రయత్నాలను టీడీపీ నేతలు అడ్డుకుంటారని తెలుసు. కానీ కావాలనే వైసీపీ నేతలు అమరావతి పర్యటనకు బయలుదేరారు. వారు ఊహించినట్లుగానే టీడీపీ నేతలు దాడికి దిగారు. దీంతో కానిస్టేబుల్ కు గాయాలయ్యాయి. అంతే కాదు.. తమ పార్టీకి కావాల్సిన మైలేజీ లభించిందని వైసీపీ తన రాజధాని ప్రయాణాన్ని మానుకుంది. ఇలా అనేక విషయాల్లో వైసీపీ అధికార పార్టీని ట్రాప్ లో లాగడం, తమ వల్లనే ఇదంతా జరిగిందని ప్రచారం

శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం
నూతన చైర్మన్ నల్ల చిన్న మల్లయ్య నియామకం

భుదాన్ పోచంపల్లి జులై 26 (ప్రజా కలం)

శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ నూతన అధ్యక్షులుగా నల్ల చిన్న మల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భుదాన్ పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నాలుగో వార్డ్ ఇందిరా నగర్ కాలనీ లో కొలువై ఉన్న శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఉదయం మాజీ చైర్మన్లు, కాలనీ పెద్దల సమక్షంలో

నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులు గురు దానయ్య, ప్రధాన కార్యదర్శి బిక్షపతి, డైరెక్టర్లు పోతగల నరహరి, పోతగల రాజు, కరగల్ల రాములు, కుక్క బాలరాజ్, నల్ల శ్రీను, పెద్దల బాలయ్య, చెరుకు వెంకటేశం, కొమ్ము ఉషయ్య, ఎడ్ల లింగస్వామి, ఓరుగంటి రాకేష్, మూటపురం రవి ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బహుజన ప్రజాశక్తి రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్, మాజీ చైర్మన్ లు పేదల నరసింహ, కుక్క మారయ్య, పేదల యాదయ్య, పోతగల బాలరాజ్, కరగల్ల కుమార్, చెరుకు నరసింహ, నాలుగో వార్డ్ కౌన్సిలర్ పేదల చక్రపాణి, కాంగ్రెస్ పార్టీ నాలుగో వార్డ్ ఇంచార్జ్ నల్ల నాగేష్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పేదల సుధాకర్, మాజీ అధ్యక్షులు పోతగల లింగస్వామి, ఎర్ర శంకర్, పోతగల శ్రీనివాస్, పోతగల నరసింహ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి
మట్ట సరితకు ఘన సన్మానం
సీనియర్ సివిల్ జడ్జిగా ప్రమోషన్

ధర్మారం, జూలై 26 (ప్రజా కలం):

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల పరిధిలోని నంది మేడారం జూనియర్ సివిల్ జడ్జి

మట్ట సరిత సీనియర్ సివిల్ జడ్జిగా ప్రమోషన్ పొందిన సందర్భంగా, స్థానిక అడ్వకేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆమెను ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి బొట్ల లక్ష్మీనరసయ్యలు జడ్జి సరిత గారికి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. న్యాయవ్యవస్థలో ఆమె అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కోశాధికారి నూనె సత్యనారాయణ, సభ్యులు భీమవరం సంపత్, పురాణం సందీప్, రజిత, బల్ల సరిత, ఆఖరి రాజేశం, కోర్టు సిబ్బంది మరియు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని బొడ్రాయికి జలాభిషేకం

వలిగొండ జూలై 26 ప్రజాకలం:

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం రెడ్లరేపాక గ్రామంలో వర్షాలు కురవాలని,ఆదివారం గ్రామ మహిళలు నీటి బిందెలతో బొడ్రాయికి

జలాభిషేకం చేశారు.ముందుగా బతుకమ్మలు పేర్చి వరుణదేవునిపై పాటలు పాడారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ, గత కొన్ని రోజులుగా వర్షాలు కురవకపోవడంతో,గ్రామాలలో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని,ఆవేదన వ్యక్తం చేశారు.కొద్ది రోజుల క్రితం కురిసిన వర్షానికి రైతులు విత్తనాలు వేసి,నార్లు పోసినప్పటికీ,ఇప్పటి వరకు వర్షాలు కురవకపోవడంతో రైతులు నిరీక్షిస్తున్నారని పేర్కొన్నారు.దీనికోసం గ్రామస్తులతో కలిసి సాంప్రదాయబద్ధంగా భగవంతుని ప్రార్థిస్తూ, గ్రామంలోని బొడ్రాయికి నీరు పోసి,ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామం పచ్చదనంతో ఉండి చెరువులు,కుంటలు, నిండాలని,పంటలు బాగా పండాలని,రైతుల కళ్ళల్లో ఆనందం చూడాలని,కోరుతూ పూజలను చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దేశబోయిన బాలస్వామి యాదవ్,వార్డు సభ్యురాలు నల్ల మల్లమ్మ,భవాని శంకర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ చెవ్వ బిక్షపతి,జువ్వగాని సుమన్,మార్క సత్యనారాయణ,పంతంగి కిష్టయ్య,నడికుడి బిక్షపతి,సిరికొండ బిక్షపతి, బోదాసు బాలరాజు,పంతంగీ వెంకటేష్,పాశం రాజు,పంతంగి శ్రీను,మార్క వెంకటేష్, కాటెపల్లి పోషయ్య,గ్రామ మహిళలు,ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన సర్వేతోనే హక్కుల సాధన
-వలస వెళ్లిన వారి పేర్లూ సెన్సస్‌లో నమోదు చేయాలి
-ఎల్లాపు సంఘం హైపర్ కమిటీ చైర్మన్ తూం భీంసేన్ రావు

హనుమకొండ,
జూలై 26:(ప్రజా కలం ప్రతినిధి)

సమాజ అభ్యున్నతికి,మన హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలి.కష్టకాలంలోనూ మన మంతా ఒకేతాటిపై నిలబడి సంఘాన్ని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది అని రాష్ట్ర ఎల్లాపు సంఘం హైపర్ కమిటీ చైర్మన్ తూం భీంసేన్ రావు పిలుపునిచ్చారు.ఆదివారం హనుమకొండ ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన ఎల్లాపు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా సంఘం హైపర్ కమిటీ చైర్మన్ తూం భీంసేన్ రావు మాట్లాడుతూ కులగణన సర్వే పూర్తయిన వెంటనే సమగ్ర వివరాలను రెవెన్యూ అధికారులకు అందజేస్తామని, కలెక్టర్ల సిఫారసుతో ప్రతి ఎమ్మార్వో కార్యాలయం ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా కుల ధృవీకరణ పత్రాలు సులభంగా అందేలా ఏర్పాట్లు చేస్తున్నామని స్పష్టం చేశారు.ప్రస్తుతం గ్రామాల్లో అందుబాటులో లేకపోయినా,ఉపాధి,ఉద్యోగ,వ్యాపారాల నిమిత్తం ముంబై,ఢిల్లీ లేదా అమెరికా వంటి దూర ప్రాంతాలకు వలస వెళ్లిన కుటుంబ సభ్యుల పేర్లను కూడా సెన్సస్‌లో విధిగా నమోదు చేయాలని సూచించారు.దీనివల్ల భవిష్యత్తులో వారికి సర్టిఫికేట్లు పొందే సమయంలో ఎలాంటి న్యాయపరమైన లేదా అధికారిక ఇబ్బందులు తలెత్తవని పేర్కొన్నారు.ఇక సర్వే ప్రక్రియ ముగిసిన తర్వాత,ప్రతి గ్రామం యూనిట్‌గా సభ్యులే స్వయంగా ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని,ఎవరూ ఎలాంటి అపోహలకు,గందరగోళానికి గురికావద్దని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా తన విద్యార్థి దశలో వరంగల్ సెంట్రల్ జైలుతో ఉన్న జ్ఞాపకాలను,ఉమ్మడి జిల్లాతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు.

అందరి ఐక్యతతోనే సంఘం బలోపేతం -రాష్ట్ర ఎల్లాపు సంఘం అధ్యక్షులు వీర్ల వెంకటేశ్వర్ రావు

కులంలో ఐక్యత పెరగాలని,ప్రతి ఒక్కరూ తమ కుల గుర్తింపుపై గర్వపడాలని రాష్ట్ర ఎల్లాపు సంఘం అధ్యక్షులు వీర్ల వెంకటేశ్వర్ రావు పిలుపునిచ్చారు.కుల గణనను విజయవంతం చేసి,మన హక్కులను కాపాడుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

ఆదివారం హనుమకొండ ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన ఎల్లాపు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆత్మీయ సమావేశానికి రాష్ట్ర ఎల్లాపు సంఘం అధ్యక్షులు వీర్ల వెంకటేశ్వర్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గత కొద్ది రోజుల క్రితం అల్లిబాద గ్రామంలో పర్యటించి స్థానిక కుల సభ్యులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు.పర్యటనలో భాగంగా ఎల్లాపు సంఘం ప్రముఖ కాంట్రాక్టర్ రత్నాకర్ రావు,రాష్ట్ర ఎల్లాపు సంఘం హైపర్ కమిటీ చైర్మన్ తూం భీంసేన్ రావుని కలిసి తమ సమస్యలను వివరించినట్లు ఆయన తెలిపారు.పట్టణాలు మరియు గ్రామీణ ప్రాంతాల్లో ఎల్లాపు కుల బంధువులు ఎంతమంది ఉన్నారనే సరైన సమాచారం ప్రస్తుతం మన దగ్గర లేదని ఆందోళన వ్యక్తం చేశారు.ముందుగా ప్రతి ఒక్కరూ ఎల్లావు లుగా గర్వంగా భావించాలని,ఆర్థికంగా ఏ వర్గీకరణకు చెందిన వారమైనా ఎలాంటి సంకోచానికి, మొహమాటానికి గురికావద్దని స్పష్టం చేశారు.కులంలో ఐక్యత పెరగాలని,ఇతర కులాలవారితో అనవసర సంబంధాలు పెట్టుకోవడం మానుకుని మన కులాన్ని మనం కాపాడుకోవాలని హితవు పలికారు.గ్రామాల్లో రెండేసిసార్లు పేర్లు నమోదు కాకుండా పకడ్బందీగా వివరాలు సేకరించి ప్రతి ఒక్కరూ కుల గణనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన కమల్ మనోహర్ రావు,రత్నాగర్ రావు లకు రాష్ట్ర కమిటీ వక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మునుముందు ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎల్లాపు సంఘం రాష్ట్ర ప్రదాన కార్యదర్శులు మల్క రాంమోహన్ రావు,సాయిని నర్సింగారావు,ఆకిరెడ్డి వెంకటేశ్వర్ రావు,రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నల్వాజి వెంకటేశ్వర్ రావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకులు పుప్పాల విక్రమసింహారావు తోపాటు రాష్ట్ర మరియు జిల్లా కార్యవర్గ సభ్యులు,ఉమ్మడి వరంగల్ జిల్లా ఎల్లాపు కుల బంధువులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సింహం
ఎర్ర సత్యం
-బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక
- ఒక ప్రజానాయకుడి జీవనగాథ

మహబూబ్ నగర్
ప్రజా కలం ప్రతినిధి జూలై 26:

చరిత్రలో కొందరు నాయకులు పదవుల వల్ల గుర్తింపు పొందుతారు. మరికొందరు ప్రజల ప్రేమ వల్ల చిరస్థాయిగా నిలుస్తారు. కానీ చాలా అరుదుగా కొందరు మాత్రమే ప్రజల ఆశగా, ఆత్మగౌరవానికి ప్రతీకగా, పోరాటానికి చిహ్నంగా మారతారు. పాలమూరు నేలపై అలాంటి అరుదైన ప్రజానాయకుడిగా నిలిచిన పేరు ఎర్ర సత్యం ముదిరాజ్.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చరిత్రను తిరగేస్తే కరువు, వలసలు, పేదరికం, సామాజిక అసమానతలు ప్రతి పుటలో కనిపిస్తాయి. ఈ నేలపై రైతు చెమట చిందించాడు, కూలీ ఆకలితో వలసబాట పట్టాడు, వెనుకబడిన వర్గాలు అవకాశాల కోసం దశాబ్దాల తరబడి పోరాడాయి. అలాంటి కాలంలోనే పేదవాడి బాధను తన బాధగా భావించిన ఒక యువకుడు ప్రజల మధ్య నుంచి నాయకుడిగా ఎదిగాడు. అతడే ఎర్ర సత్యం.

1957 జూలై 25న నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని పెద్ద చింతకుంట గ్రామంలో కమలమ్మ, వేణుగోపాల్ ముదిరాజ్ దంపతులకు జన్మించిన మరారి సత్యనారాయణ ముదిరాజ్, తరువాత కాలంలో ప్రజల నోట “ఎర్ర సత్యం అన్న”గా మారిపోయారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడైన తండ్రి నుంచి నిజాయితీ, క్రమశిక్షణ, విద్య విలువలను నేర్చుకున్నారు. తల్లి నుంచి మానవత్వం, కరుణ, పంచుకునే మనస్తత్వాన్ని పొందారు.

వారి కుటుంబం సంపన్నం కాకపోయినా విలువల్లో సంపన్నం. అదే విలువలు ఆయన జీవితమంతా కనిపించాయి.

పెద్ద చింతకుంటలో ప్రాథమిక విద్యను అభ్యసించిన ఆయన, చాటికోటలో తదుపరి చదువులు కొనసాగించి, మహబూబ్‌నగర్‌లో పదో తరగతి పూర్తి చేశారు. అనంతరం ఇంటర్మీడియట్, బీఎస్సీ చదివారు.

చదువుతో పాటు వ్యవసాయ పనుల్లో పాల్గొనడం వల్ల రైతు జీవితం ఆయనకు పుస్తకాల కన్నా ఎక్కువ పాఠాలు నేర్పింది. పొలంలో రైతు చెమట, కూలీ ఆకలి, ప్రకృతి అనిశ్చితి---ఇవన్నీ ఆయనలో సామాజిక బాధ్యతను పెంచాయి. వ్యాయామం, కుస్తీలపై ఆయనకు ఉన్న ఆసక్తి కేవలం శారీరక బలం కోసం కాదు. “బలం బలహీనుడిని రక్షించడానికి ఉపయోగపడాలి” అనే భావనను ఆయన జీవితాంతం ఆచరించారు.

యువకుడిగా ఉన్నప్పుడు మహబూబ్‌నగర్ పట్టణంలో యువతులను వేధిస్తున్న కొందరిని తన మిత్రులతో కలిసి ధైర్యంగా అడ్డుకున్న సంఘటన ఆయన జీవితానికి మలుపు తీసుకొచ్చింది. ఆ రోజు నుంచి ఆయన తన వ్యక్తిగత జీవితాన్ని పక్కన పెట్టి, సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కోవడమే తన జీవన ధ్యేయంగా నిర్ణయించుకున్నారు. అనేక మంది జీవితంలో కుటుంబం మొదటి బాధ్యత అవుతుం ది. కానీ ఎర్ర సత్యం తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేయాలని సంకల్పించి వివాహం చేసుకోలేదు. ఆయనకు కుటుంబం అంటే తనను ఆశ్రయించిన ప్రతి పేదవాడే.

క్రమంగా మహబూబ్‌నగర్ పట్టణంలో ఒక మాట వినిపించడం ప్రారంభమైంది---“సమస్య ఉంటే సత్యం అన్న దగ్గరకు వెళ్లండి.”

ఈ మాట యాదృచ్ఛికంగా పుట్టలేదు. భూ వివాదాలు, కుటుంబ తగాదాలు, మహిళలపై అన్యాయాలు, పేదల సమస్యలు---ఏ అంశమైనా ఆయన న్యాయబద్ధంగా పరిష్కరించడానికి కృషి చేసేవారు. ఆయన వద్దకు వచ్చిన వారిని కులం, మతం, రాజకీయ అనుబంధం ఆధారంగా చూడలేదు; సమస్య ఆధారంగా చూశారు. ఈ న్యాయబద్ధతే ఆయనకు అపారమైన ప్రజాదరణ తెచ్చిపెట్టింది.ఆ కాలంలో పాలమూరు ప్రాంతంలో బడుగు బలహీన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం పరిమితంగానే ఉండేది. అలాంటి పరిస్థితుల్లో ఎర్ర సత్యం వారికి కేవలం ఓ నాయకుడు కాదు; “మనవాడు” అనే భావనను కలిగించారు.

గ్రామ సభల్లో ఆయన మాట్లాడితే ప్రజలు శ్రద్ధగా వినేవారు. రైతు కష్టాన్ని రైతు భాషలో, కూలీ బాధను కూలీ మనసుతో, యువత ఆశలను యువత ఉత్సాహంతో చెప్పగలిగిన నాయకుడు ఆయన.

ఇలా ప్రజల మధ్య ఎదిగిన నాయకత్వమే తరువాత రాజకీయాల్లో ఆయనకు బలమైన పునాది అయింది.ప్రజా ఉద్యమాలు -- తెలుగుదేశం పార్టీలో ఎదుగుదల -- జడ్చర్లలో చారిత్రక విజయం

ప్రజల విశ్వాసం ఒక రోజులో ఏర్పడదు. ఎన్నో సంవత్సరాల సేవ, నిస్వార్థ పోరాటం, న్యాయం కోసం నిలబడే ధైర్యం కలిసి ఒక నాయకుడిని ప్రజల హృదయాల్లో నిలబెడతాయి. ఎర్ర సత్యం ముదిరాజ్ ఎదుగుదల కూడా అలాంటి ప్రజా విశ్వాసానికి ప్రతిఫలం.

మహబూబ్‌నగర్ పట్టణంలోనూ, పరిసర గ్రామాల్లోనూ ఆయన పేరు క్రమంగా ఒక వ్యక్తి పేరుగా కాకుండా, న్యాయం కోసం ఆశ్రయించే చిరునామాగా మారింది. పేద రైతు తన సమస్యతో వచ్చినా, కూలీ తన బాధతో వచ్చినా, మహిళ తనకు జరిగిన అన్యాయం గురించి చెప్పినా---వారిని ఓపికగా విని, సాధ్యమైన పరిష్కారం చూపేందుకు ఆయన కృషి చేసేవారు.

ఆ కాలంలో అనేక గ్రామాల్లో చిన్న చిన్న వివాదాలు సంవత్సరాల తరబడి పరిష్కారం కాకుండా ఉండేవి. ఎర్ర సత్యం మాత్రం ఇరువర్గాల మాటలు విని రాజీ కుదిరేలా ప్రయత్నించేవారు. ఆయనకు న్యాయం అంటే కేవలం చట్టపరమైన తీర్పు కాదు; సమాజంలో శాంతి నెలకొనే పరిష్కారం.

ఈ సేవా తత్వం వల్లే ప్రజలు ఆయనను “సత్యం అన్న” అని ఆప్...

కేజీఎఫ్ తర్వాత యష్ కు అసలైన పరీక్ష!

భారతీయ సినీ పరిశ్రమలో ఒక బ్లాక్‌బస్టర్ సినిమా స్టార్ కెరీర్‌ను పూర్తిగా మార్చేసిన సందర్భాలు చాలా ఉన్నాయి. అయితే ఆ సక్సెస్‌ను నిలబెట్టుకోవడం మాత్రం అంత ఈజీ కాదు. ఒక సినిమా ఇచ్చిన గుర్తింపు తర్వాత వచ్చే ప్రతి ప్రాజెక్ట్‌పై అంచనాలు ఎన్నో రెట్లు పెరుగుతాయి. అలాంటి కీలక దశలోనే ప్రస్తుతం కన్నడ స్టార్ యష్ నిలిచారు. కెరీర్‌లో అత్యంత భారీ సక్సెస్ ను అందుకున్న తర్వాత ఆయన వేస్తున్న ప్రతి అడుగు ఇప్పుడు ప్రత్యేకంగా పరిశీలించబడుతోంది. ూశ్రీంశీ =ఘఎ – ఇండియాలో సెంచరీ కొట్టిన ఒడిస్సీ! చరిత్రను పరిశీలిస్తే, ఒక భారీ సక్సెస్ కేవలం హీరోకే కాదు, మొత్తం ఇండస్ట్రీ ఇమేజ్‌ను కూడా మార్చిన ఉదాహరణలున్నాయి. తెలుగు సినిమాను ప్రపంచవ్యాప్తంగా నెక్స్ట్ లెవెల్ కు తీసుకెళ్లిన బాహుబలి ఎలాంటి ప్రభావం చూపిందో, కన్నడ చిత్రసీమకు కొత్త మార్కెట్‌ను తెరిచిన కేజీఎఫ్ కూడా అదే తరహా మార్పును తీసుకొచ్చింది. ఆ సినిమా తర్వాత కన్నడ ఇండస్ట్రీపై దేశవ్యాప్తంగా మాత్రమే కాదు, విదేశీ మార్కెట్లలో కూడా ఆసక్తి పెరిగింది. దీంతో యష్ పర్సనల్ స్టార్‌డమ్‌తో పాటు ఆయన భుజాలపై ఇండస్ట్రీ ప్రతిష్ఠ కూడా చేరింది. అయితే ఇదే పరిస్థితి ఇప్పుడు ఆయనకు పెద్ద పరీక్షగా మారింది. ఒక భారీ హిట్ తర్వాత వచ్చే సినిమాకు ఆడియన్స్ అంచనాలు పూర్తిగా మారిపోతాయి. ఈ సినిమాతో ఫ్యాన్స్ మరో సక్సెస్ ను మాత్రమే కాకుండా, అంతకుమించిన ఎక్స్‌పీరియెన్స్‌ని కోరుకుంటారు. రెగ్యులర్ కమర్షియల్ హిట్ కూడా చాలదనే పరిస్థితి ఏర్పడుతుంది. అందుకే మొదటి సక్సెస్ ను మించి మరోసారి అదే రేంజ్ ఇంపాక్ట్ ను చూపించడం ప్రతి పాన్ ఇండియా స్టార్‌కు కఠినమైన సవాల్‌గా మారుతోంది. ప్రస్తుతం యష్ చేతిలో ఉన్న టాక్సిక్ మరియు రామాయణ వంటి భారీ ప్రాజెక్టులు ఈ పరీక్షలో కీలక పాత్ర పోషించనున్నాయి. ఈ రెండు సినిమాలు ఆశించిన ఫలితాన్ని అందుకుంటే, ఆయనను కేవలం కన్నడ స్టార్‌గా కాకుండా ఇండియన్ సినిమా గ్లోబల్ ఫేసెస్ లో ఒకరిగా నిలబెట్టే అవకాశం ఉంది. అదే సమయంలో అంచనాలకు తగ్గ ఫలితం రాకపోతే, భారీ సక్సెస్ తర్వాత కెరీర్‌ను కొనసాగించడం ఎంత క్లిష్టమో మరోసారి డిస్కషన్ కు వస్తుంది. వాస్తవానికిది యష్ ఒక్కరికే పరిమితమైన సిట్యుయేషన్ కాదు. బాహుబలి తర్వాత ప్రభాస్, పుష్ప తర్వాత అల్లు అర్జున్ వంటి ప్రతి పాన్ ఇండియా స్టార్ కూడా ఇదే తరహా ప్రెజర్ ను ఎదుర్కొన్నారు. ఒకసారి దేశవ్యాప్తంగా మార్కెట్ ఏర్పడిన తర్వాత ప్రతి సినిమా రిలీజ్ జాతీయ స్థాయి అంచనాల మధ్యే జరుగుతోంది. దీంతో కథల ఎంపిక నుంచి రిలీజ్ ప్లాన్ వరకు ప్రతి డెసిషన్ మరింత కీలకంగా మారింది. అందుకే యష్ కెరీర్‌లో ప్రస్తుతం మొదలవుతున్న దశను సాధారణ సినీ జర్నీగా చూడలేం. ఇదొక స్టార్ తన సెన్సేషనల్ సక్సెస్ ను పర్మినెంట్ బ్రాండ్‌గా మార్చుకునే జర్నీనా, లేక ఒక్క సినిమా ప్రభావాన్ని దాటి కొత్త అధ్యాయాన్ని రాసే ప్రయత్నమా అన్న ప్రశ్నకు సమాధానం చెప్పే సమయంగా చూస్తున్నారు. రాబోయే రెండు సినిమాల రిజల్ట్స్ కేవలం యష్ ఫ్యూచర్‌నే కాదు, పాన్ ఇండియా స్టార్‌డమ్‌కు కొత్త ప్రమాణాలను కూడా డిసైడ్ చేసే అవకాశముంది.

గీత గోవిందం మ్యాజిక్ ఎక్కడ ఆగింది?

ఒక సినిమా.. ఒక దర్శకుడి కెరీర్ ను ఒక్కసారిగా మార్చేస్తుంది. అదే సినిమా తర్వాత వచ్చే అంచనాలు మాత్రం అతడికి పెద్ద సవాల్ గా మారతాయి. టాలీవుడ్ లో ఇలాంటి జర్నీకి ఎగ్జాంపుల్ గా దర్శకుడు పరశురామ్ పేరు చెప్పుకోవచ్చు. గీత గోవిందం మూవీతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆ డైరెక్టర్.. ఆ తర్వాత అదే స్థాయి విజయాన్ని అందుకోవడానికి చేసిన ప్రయత్నాలు మాత్రం అనుకున్నంతగా సక్సెస్ అవ్వలేదు. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా తెరకెక్కిన గీత గోవిందం 2018లో విడుదలై సంచలన విజయం సాధించింది. చిన్నగా కనిపించిన ప్రేమకథను కుటుంబ ప్రేక్షకులకు నచ్చేలా తెరకెక్కించడం, ఎంటర్టైన్మెంట్ ను యాడ్ చేయడం పరశురామ్ ప్రత్యేకతగా నిలిచింది. ఆ సినిమాతో ఆయనకు దర్శకుడిగా భారీ డిమాండ్ వచ్చింది. స్టార్ హీరోలు కూడా ఆయనతో సినిమా చేయడానికి ఆసక్తి చూపించే స్థాయికి వెళ్లారు. అయితే ఒక భారీ విజయాన్ని అందుకున్న తర్వాత అదే స్థాయి మ్యాజిక్ ను మళ్లీ క్రియేట్ చేయడం ప్రతి దర్శకుడికీ అంత ఈజీ కాదు. పరశురామ్ విషయంలోనూ అదే జరిగింది. సూపర్ స్టార్ మహేష్ బాబుతో తెరకెక్కించిన సర్కారు వారి పాటపై భారీ అంచనాలు ఉన్నా.. సినిమా ప్రేక్షకులను పూర్తిగా మెప్పించలేకపోయింది. ఆ తర్వాత విజయ్ దేవరకొండతో వచ్చిన ఫ్యామిలీ స్టార్ కూడా ఆశించిన ఫలితాన్ని అందుకోలేదు. ఇక్కడే అసలు పరీక్ష మొదలైంది. గీత గోవిందం మూవీ తర్వాత పరశురామ్ నుంచి ఆడియన్స్ మరింత స్ట్రాంగ్ స్టోరీలను ఆశించారు. కానీ ఒక దర్శకుడికి విజయంతో పాటు అంచనాల భారం కూడా పెరుగుతుంది. గతంలో చిన్న కథతో ఆకట్టుకున్న దర్శకుడు.. స్టార్ హీరోలతో సినిమా చేసే సమయంలో అదే రేంజ్ లో స్టోరీ, స్కేల్, ఎమోషన్ ను బ్యాలెన్స్ చేయాల్సిన పరిస్థితి వస్తుంది. సినిమా ఇండస్ట్రీలో దర్శకుడి ప్రయాణం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఒక హిట్ తో అవకాశాలు వరుసగా వస్తే.. కొన్ని డిజాస్టర్లు వచ్చిన తర్వాత మళ్లీ తనను తాను నిరూపించుకోవాల్సిన సమయం వస్తుంది. ప్రస్తుతం పరశురామ్ అలాంటి స్టేజ్ లోనే ఉన్నారని చెప్పొచ్చు. ప్రస్తుతం ఆయన కొత్త సినిమా కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. గతంలో స్టార్ హీరోలతో కాంబినేషన్లు చర్చకు వచ్చినా.. ఇప్పుడు సరైన కథ, సరైన హీరో కాంబినేషన్ కోసం అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకప్పుడు గీత గోవిందంతో తనలో ఉన్న టాలెంట్ ను నిరూపించిన పరశురామ్.. మరోసారి అదే రేంజ్ విజయాన్ని అందుకుంటారా అన్నదే ఆసక్తికరంగా మారింది. ఎందుకంటే సినీ ఇండస్ట్రీలో ఒక ఫ్లాప్ దర్శకుడి కెరీర్ ను ముగించదు.. కానీ ఒక కంబ్యాక్ హిట్ మాత్రం రేంజ్ ను మళ్లీ మార్చేస్తుంది. ఇప్పుడు పరశురామ్ ముందున్న టార్గెట్ కూడా అదే. గీత గోవిందం మ్యాజిక్ ను మరోసారి తెరపై చూపించి తన మార్క్ తిరిగి నిలబెట్టుకోవడమే. మరి ఇపట్టికే పలు వార్తలు వస్తున్నా.. నెక్ట్ ఎవరితో పరశురామ్ వర్క్ చేస్తారో అంతా వేచి చూడాలి.

సాయి పల్లవికిది సరైన సమయమేనా?

టాలీవుడ్ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న సహజ నటి సాయిపల్లవి కెరీర్‌లో అత్యంత కీలకమైన దశలో ఉంది. డ్యాన్స్, అభినయం, కథల ఎంపికలో ప్రత్యేకత చాటుకుంటూ ముందుకు సాగుతున్న పల్లవికి సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. దర్శకుడు కిషోర్ తిరుమల బలమైన లేడీ ఓరియేంటెడ్ స్క్రిప్ట్‌తో సాయిపల్లవిని సంప్రదించారని.. ఆమె కూడా ప్రాజెక్ట్‌పై సానుకూలంగా స్పందించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ సినిమాపై ఆమె ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని సమాచారం. ఈ నేపథ్యంలో సాయిపల్లవి కెరీర్ గ్రాఫ్ .. మార్కెట్ స్థాయిని బట్టి చూస్తే లేడీ ఓరియేంటెడ్ సినిమా చేయడం సరైన నిర్ణయమేనా అనే చర్చ జోరుగా సాగుతోంది. సాధారణంగా స్టార్ హీరోయిన్లు కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడు కమర్షియల్ చిత్రాలకు ప్రాధాన్యత ఇస్తుంటారు. కానీ సాయిపల్లవి మొదటి నుంచీ గ్లామర్ పాత్రల కంటే నటనకు ఆస్కారం ఉన్న, ప్రాధాన్యత ఉన్న పాత్రలకే ప్రాధాన్యత ఇస్తూ వస్తున్నారు. మరోవైపు బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న రామాయణం చిత్రంలో మాత సీత పాత్రలో సాయిపల్లవి నటిస్తున్న సంగతి తెలిసిందే. నితీశ్ తివారీ దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్, యష్ వంటి దిగ్గజ నటులతో కలిసి నటిస్తోన్న గ్లోబల్ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. రామాయణం చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధిస్తే సాయిపల్లవి పాన్-ఇండియా స్థాయిలో తిరుగులేని స్టార్‌డమ్‌ను సొంతం చేసుకోవడం ఖాయం. ఆ స్థాయి గ్లోబల్ ఇమేజ్ వచ్చే సమయంలో ఇలాంటి ప్రాంతీయ, లేడీ ఓరియేంటెడ్ సినిమాలు చేయడం సాయి పల్లవికి ఏ మేరకు ప్లస్ అవుతుందనే కోణంలో చర్చ జరుగుతోంది. మరో కోణంలో చూస్తే సాయిపల్లవి బలం గ్లామర్ కాదు. నటనపై ఉన్న నమ్మకమే ఆమెను ఈ స్థాయికి చేర్చింది. గ్లోబల్ ప్రాజెక్ట్‌లతో పాటు తనను నటిగా మరింత నిరూపించుకోవడానికి ఇలాంటి ఎమోషనల్ లేడీ ఓరియేంటెడ్ కథలుఎంతో దోహదపడతాయని అభిమానులు భావిస్తున్నారు. కిషోర్ తిరుమల తీసేయాల్సిన దర్శకుడు కాదు. నేను శైలజ లాంటి సినిమాతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు దక్కించుకున్నాడు. ఆ తర్వాత చేసిన కొన్ని సినిమాలు యావరేజ్ గా ఆడాయి. అయితే భారీ విజయం మాత్రం ఇంకా అతడి ఖాతాలో నమోదవ్వలేదు. లేడీ ఓరియేంటెడ్ సినిమాలు చేసిన అనుభవం కూడా లేదు.ఈ నేపథ్యంలో సాయిపల్లవికాస్త రిస్క్ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఇలాంటి సాహసాలు ఆమెకు కొత్తేం కాదు. కథ నచ్చిదంటే దర్శకుడి అనుభవంతో పనిలేకుండా ముందుకెళ్తుంది. అలాంటి ప్రయోగాలు కొన్ని తమిళ సినిమాలతో చేసారు. కానీ అవి ఆశించిన ఫలితాలివ్వలేదు. నటిగా తన వరకూ పాస్ అయినా? ఫలితాలు ఆశించిన విధంగా రాకపోవడంతో ఆ తర్వాత మళ్లీ లేడీ ఓరియేంటెడ్ అటెంప్ట్ చేయలేదు. పూర్తిగా కమర్షియల్ సినిమాలకే పరిమితమయ్యారు. మరి తాజా సమీకరణాల నేపథ్యంలో సాయి పల్లవి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది చూడాలి.

టాలీవుడ్‌లో బాలల సినిమాలకు ప్రాధాన్యత తగ్గిందా?

తెలుగు చలనచిత్ర పరిశ్రమ (టాలీవుడ్) చరిత్రలో బాలల చిత్రాలకు ఎప్పుడూ ఒక ప్రత్యేక స్థానం ఉంటుంది. అయితే జాతీయ చలనచిత్ర పురస్కారాల స్థాయిలో ఉత్తమ బాలల చిత్రం విభాగంలో అవార్డు దక్కించుకోవడం అనేది చాలా అరుదుగా జరిగే అద్భుతం. దశాబ్దాల టాలీవుడ్ చరిత్రలో చాలా తక్కువ సినిమాలు మాత్రమే ఈ అత్యున్నత జాతీయ గౌరవాన్ని అందుకుని చరిత్ర పుటల్లో నిలిచాయి. గత రెండు దశాబ్దాల కాలాన్ని పరిశీలిస్తే..టాలీవుడ్‌లో బాలల చిత్రాల నిర్మాణం పెరిగినా జాతీయ స్థాయిలో ఉత్తమ బాలల చిత్రంగా నిలవడం సవాలుగా మారింది. సినిమా చరిత్రలోనే కొన్ని దశాబ్దాల వ్యవధిలో వేళ్లమీద లెక్కపెట్టదగిన చిత్రాలకు మాత్రమే ఈ ప్రతిష్టాత్మక పురస్కారం లభించింది. ఈ నేపథ్యాన్ని గమనిస్తే... జాతీయ స్థాయిలో ప్రతిభను చాటుకోవడం ఎంత కష్టమో అర్థమవుతుంది. గతంలో గుణశేఖర్ దర్శకత్వంలో అందరూ చిన్నారులతో తెరకెక్కించిన బాల రామాయణం చిత్రం జాతీయ స్థాయిలో ఉత్తమ బాలల చిత్రంగా అవార్డును గెలుచుకుని సంచలనం సృష్టించింది. ఆ తర్వాత సుదీర్ఘ కాలం పాటు టాలీవుడ్‌కు ఈ విభాగంలో జాతీయ అవార్డు దక్కలేదు. సరిగ్గా 30 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత మళ్లీ 35 చిన్న కథ కాదు చిత్రానికి ఉత్తమ బాలల చిత్రంగా జాతీయ అవార్డు రావడం నిజంగా మామూలు విషయం కాదు. ఇంతటి ఘనతను సాధించిన 35 చిన్న కథ కాదు సినిమా వెనుక నిర్మాతలు సృజన, సిద్ధార్థ్‌ల కృషి ఎంతో ఉంది. వీరు అత్యంత వైవిధ్యమైన ఆలోచనలు ఉన్న నిర్మాతలు. ఒక వైవిధ్యమైన, చిన్న పిల్లల కథాంశంతో కూడిన సినిమాను నమ్మి.. దానికి నిర్మాణ రూపం ఇవ్వాలంటే ఎంతో ధైర్యం కావాలి. వారి నమ్మకానికి, ధైర్యానికి ప్రతిఫలంగానే ఈరోజు ఈ జాతీయ పురస్కారం దక్కింది. ఈ జాతీయ అవార్డు సాధించిన ఉత్సాహంతోనే చిన్న కథ కాదు అనే ఊతపదం ఈరోజు దేశవ్యాప్తంగా మార్మోగుతోంది. ఇది కేవలం ఒక సినిమా సాధించిన విజయం మాత్రమే కాదు... మొత్తం తెలుగు చలనచిత్ర పరిశ్రమకే దక్కిన గొప్ప గౌరవం. చిన్న సినిమాలకు, వైవిధ్యమైన కథాంశాలకు ఈ అవార్డు కొత్త ఊపిరి పోసిందనడంలో సందేహం లేదు. యాక్షన్ సీక్వెన్సెస్, గ్లోబల్ మార్కెట్ వెనుకే పడుతున్నారు. పిల్లల సినిమాలకు కమర్షియల్‌గా పెద్దగా వసూళ్లు రావు అనే అపోహ లేదా రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడకపోవడం కూడా ఈ విభాగంపై శ్రద్ధ పెట్టకపోవడానికి ప్రధాన కారణం. గ్రావిటీకి అందని స్టంట్లు.. భారీ విజువల్ ఎఫెక్ట్స్ మాత్రమే థియేటర్లకు జనాన్ని రప్పిస్తాయనే భావన పెరిగిపోయింది. అయితే పాన్ ఇండియా వెల్లువలో కొట్టుకుపోకుండా.. ఏడాదికి కనీసం అరడజను చిత్రాలు అయినా బాలలపై తెరకెక్కితే అవార్డులలోను వికసించే అవకాశం ఉంటుందని కొందరు విశ్లేషకులు సూచిస్తున్నారు.

ఇండియాలో సెంచరీ కొట్టిన ఒడిస్సీ!

ప్రపంచ ప్రఖ్యాత దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన తాజా చిత్రం ది ఒడిస్సీ బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా భారీ అంచనాల మధ్య విడుదలైన చిత్రం వాటిని సంచలనాలు చేయడంలో ఏమాత్రం తగ్గలేదు. నోలన్ కెరీర్‌లోనే అత్యంత విజయవంతమైన చిత్రంగా నిలుస్తోంది. తొలి వారం ముగిసేసరికి ఒడిస్సీ ప్రపంచవ్యాప్తంగా అంచనాలను తలకిందులు చేస్తోంది. భారతీయ సినీ మార్కెట్‌లో హాలీవుడ్ చిత్రాలకు లభిస్తున్న ఆదరణ మరోసారి నిరూపితమైంది. విడుదలైసన మొదటి వారంలోనే 'ది ఒడిస్సీ' భారతదేశంలో 100 కోట్ల గ్రాస్ వసూళ్లను విజయవంతంగా దాటింది. దీంతో ఈ ఏడాది భారత బాక్సాఫీస్ వద్ద అత్యధిక వసూళ్లు రాబట్టిన హాలీవుడ్ సినిమాగా అగ్రస్థానంలో నిలిచింది. ముంబైలో నిర్వహించిన గ్లోబల్ ప్రీమియర్‌కు లభించిన స్పందనే ఈ భారీ విజయానికి నాంది పలికిందని చెప్పొచ్చు. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ చిత్రం కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. ఉత్తర అమెరికా తో పాటు విదేశీ మార్కెట్లలో వస్తున్న ఆదరణతో సినిమా ప్రపంచవ్యాప్తంగా ఏడు రోజుల్లోనే 400 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 3300 కోట్లకు పైగా) వసూళ్ల మైలురాయిని అధిగమించింది. తొలి వారం ఓపెనింగ్స్ పరంగా నోలన్ సినిమాల్లో ఇదే అత్యుత్తమ రికార్డుగా ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఈ చిత్రానికి బ్రహ్మరథం పడుతుండటంతో బాక్సాఫీస్ వద్ద రాబోయే రోజుల్లో మరిన్ని రికార్డులు బద్దలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సాంకేతిక హంగులతో పాటు బలమైన భావోద్వేగాలు ఉన్న చిత్రాలను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని ఈ సినిమా మరోసారి రుజువు చేసింది. హోమర్ రాసిన పురాణ గాథ ఆధారంగా రూపొందిన చిత్రంలో గ్రీకు యోధుడు ఒడిస్సెస్ పాత్రలో మ్యాట్ డెమన్ అద్భుతమైన నటనతో ఆకట్టుకున్నారు. ట్రోజన్ యుద్ధం తర్వాత పదేళ్ల పాటు సాగే ఆయన సాహసయాత్ర, ఎదురైన సవాళ్లు, రాక్షసులు, శక్తులను ఎదుర్కొంటూ తన భార్య పెనెలోప్, కుమారుడిని కలుసుకునే భావోద్వేగ ప్రయాణమే ఈ చిత్ర కథాంశం. సినిమాలో ఆన్ హాథవె, టామ్ హాలండ్, జెండయా, రాబర్ట్ ప్యాటిన్సన్ వంటి ప్రముఖ హాలీవుడ్ నటులు కీలక పాత్రల్లో నటించి సినిమా స్థాయిని మరింత పెంచారు. సింకోపీ ఇంక్ పతాకంపై తెరకెక్కిన ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని యూనివర్సల్ పిక్చర్స్ ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసింది. విజువల్ ఎఫెక్ట్స్, సాంకేతిక నిపుణుల ప్రతిభ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి. ఇక భారత్ లో హాలీవుడ్ కి వంద కోట్ల వసూళ్లు కొత్తేం కాదు. చివరిగా అవతార్ : ది వే ఆఫ్ వాటర్ భారతదేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన హాలీవుడ్ చిత్రంగా (సుమారు రూ. 484 కోట్లకు పైగా) ప్రథమ స్థానంలో ఉంది. అవెంజర్స్: ఎండ్‌గేమ్ కూడా అత్యంత ఆదరణ పొందిన మార్వెల్ సినిమాగా రికార్డు సృష్టించింది.

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from 6-5-41/A, Arundelpet 5/1, Pasumalai Complex, 1st Floor, Guntur, Andhra Pradesh -522002 Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI. No. APTEL/26/A6182,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com